భారతి

మాసపత్రిక

★

సంపాదకుడు:

శివలెంక శంభుప్రసాద్

★

నవంబరు 1969

★

సంపుటము : 46 : సంచిక : 11 :

విడిప్రతి వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

నవంబరు 1969

మాతృ సందర్శనము

శ్రీ త్రిపురాన వేంకటకృష్ణరావు

త్వదపాంగామల దృష్టి చంద్రికలు మత్తాపంబుఁ దీర్చన్; భవ
న్మృదుహాసామృతవృష్టి తుషారములు పేర్మిన్ నన్నుఁ దేర్పంగ, నీ
పెదవిన్ బల్కులు కొల్కి, శోణితదీప్తిం దావకాశీర్వచో
మ్రదిమల్ ముద్దులు గొల్ప, నాకిడవె యంబా నీదు సాక్షాత్కృతిన్॥

అవిగో! తావక దృక్తరంగిత శుభవ్యాపార శోభారుచుల్
భవదర్ఘ్యార్థ జలంబులో బ్రతిఫలింపం దోఁచె; లోకావన
ప్రవణాయాతపదాబ్జపావనలికల్, రాఁ జిందె నామోవిపై
నివె! తన్మాధ్వీకణాలు, స్వాగతము తల్లీ, వచ్చుచుంటే యిటుల్॥

అంబరవీథినుండి భవదాగమనాంచితలారుణప్రభా
డంబరముల్ గులాబిమొగడల్ విరియన్ విరఁజిమ్ముచున్ స్రవిం
పం బరతెంచుచున్నయవి; పావనదివ్యపదాన కోకిలా రా
గంబుద మొల్కుచున్నయదిఁ యంబరో, నాపయి నీ సురాగముల్॥

ఏమి? యీ మధురానిలాకలన, మేమి! యీ శరచ్చంద్ర శో
భామల్యోదయసుప్రభాతిశయ, మహా! యేమి? యీ స్వప్నమ
స్తోమాపారమధుప్రసార మిది యీ దుగ్ధాబ్ధి హీరోదయ
శ్రీ మానోజ్ఞము లొల్కుచున్నయవి, ధాత్రీ, యీవె రా నుంటివే?

శ్రుతియై మ్రోగఁ దొడంగె నోంకృతియు మాత్రోర్మిగంగ బ్రహ్మాండముల్
శ్రుతిపొందం గడగెన్ బికంబయి సుధాస్రోతస్వినుల్ పాఱఁగాఁ
కృతి కృత్యంబుగ నాడఁ జొచ్చె శిఖియై, గీర్వాణ లోకంబు, సం
తత మిట్లొప్పనె? నీవురా నివియు సన్నాహంబులై యుండవే?

ఈవు దయాప్రసన్నమతి వీ శుభగామలసుప్రశాంత వా
తావరణంపుఁ గల్మిలు త్వదాగమనోచిత సూదకాంకముల్
గావె? వసింప హృన్నళినకర్ణిక యున్నది; పల్కె స్వాగతం
బీవిడియున్న లేఖిని లిఖించిన పద్యము లున్న వమ్మరో॥

కాఁబోలుం దను తేజ మియ్యది, యశక్యం బయ్యె వీక్షింపఁగా
నీ బాలేందుకరంబు లెంత కనుక్రాంతిన్ బాపఁగానున్న; నీ
మే బల్దావులు ముంచె మైకము నీ మేలెంత ప్రాఁపున్న; నీ
ప్రాబల్యంబులు తట్టుకోఁ దరమె? యంబా యీవె నాకున్ ధృతిన్॥

తళుకుఁ బసిండి వ్రాతఁ జలతారు బుటా సరిగంచు జాళువాన్
జళపెళలాడెఁ జీరయు, నవీనమణీఘృణికింకిణీతతిన్
గలగలలాడి భూషలు ధగద్ధగలాడె; నిదే! యపూర్వ, మీ
యలఘు కళానుభూతి భవదాగమనంబునఁ గాకకల్గునే?

కన నిష్ణాతము లయ్యె నీ కనులు సాక్షాత్సర్వ మీ విశ్వమున్,
వినఁ బారీణము లయ్యె నీ చెవులు నీ విశ్వావనీవాణి, వా
కొనఁగా దక్షము నయ్యె నీ రసన వాఙ్లోకంబు నీ సర్వమున్,
జననీ, యీ యనుభూతు లింత యమృత స్వాదు ప్రభావంబు లే?

వినవచ్చెన్ గిలికించితాంచితకలాభిశ్రావ్యగానధ్వనుల్,
కనవచ్చెన్ విబుధేంద్రచాపవివిధాఖర్వప్రభావర్ణముల్,
నిను బ్రత్యక్షముగా, సమగ్రముగ నే నిన్ జూడలే దింకఁ బ్ర
త్యనుభూతంబులు నయ్యె నాకు భవదవ్యక్తానుభూతిచ్ఛటల్॥

అంతయు క్షీరనీరనిధి యయ్యెను; బాయస భంగ గర్భ శు
క్త్యంతర మౌక్తికాయిత పయోగి కణ ఫేనదయాంతరంగ ప
ద్మాంతర కర్ణికం బ్రభవ మందిర శ్రీ యనఁ దోఁచె దేవి, యా
శాంతము లెల్లనిండి బహిరంతరముల్ కలియంగ నేకమై॥

మాతృసందర్శనము

చలియింపన్ సచరాచరాఖిల జగత్సంజీవ చైతన్య; మేఁ
దిలకింపన్ సమకూడి యేర్పడి యొకే దేదీప్యమానాకృతిన్
వెలిఁగెన్; నేనొక జీవ శీకరమనై విశ్వైక తన్మూర్తిలోఁ
గొలువన్ సోదర జీవకోటి దయ జాల్కొనుంటి ధన్యుండుఁగన్॥

భువియెల్లన్ దివియై తనర్చె, జడరూపుల్ పేర్మి స్వారూపులై;
రవధుల్ నిండి మదంగ మింద్రియవిలాసాతీతమై పొల్చెఁ బూ
ర్ణవశంబై సకలాంతరాళపరిపూర్ణంబై సహస్రార ము
ద్భవమై యొక్కటి గాఁగ మాత యొసఁగెన్ బ్రత్యక్ష సాక్షాత్కృతిన్

సకలము స్వప్రథల్ నెరప సాగుచు నుండఁగ నేను దత్ప్రభా
చకితుఁడ నయ్యుఁ దచ్చరణసారసయుగ్మముఁ జేరి తత్కళా
ప్రకట సుమంబులేరి మతి ప్రస్తుతులన్ రచియించి యుంచగన్
సకల చరాచరంబులకు సమ్మతిఁగా నిడి కొల్వఁ గల్గితిన్॥



లక్ష్మీ-భీమవరాగ్రహార దానశాసనం

శ్రీ ముసునూరి సాంబశివరామమూర్తి

[గతసంచిక తరువాయి]

ఈ శాసనమునందు గమనింపదగిన విషయములలో ముఖ్యమయిన అంశము లివి.—

1. నాగవంశ ప్రశంస

ఈ నాగవంశప్రశస్తి పురాణములు మొదలు ప్రస్తుతసాహిత్యము వఱకును గన్పించుచునే యున్నది. అయితే ఆ వంశక్రమము భిన్నభిన్నరీతులుగా గాన్పించినను ప్రధానవిషయముమాత్రము నిక్కముగ గ్రహింపబడుచున్నది.

"తదన్వయే సర్వజనాశ్రయో భూత్ 'ధనంజయమ్మాత్' సహిచక్రవర్తి॥ రాజ్ఞీచతస్యాభవదంబుజాక్షీ 'భోగావతీ' నామ నృపేశకన్యా। పురేచతస్మిన్ 'మణినాగ నామ్ని' తతోకరోద్రాజ్య మరిందమ శ్చిరం। ఫణీశ్వరాకారతయా సగర్భజాతాపి। రాజ్ఞీతపసా నృపోభూత్। తదాప్రభృత్యేవ స నాగవంశః। సర్వోత్తమో భూదితి సుప్రసిద్ధం" అనుటచే పూర్వము మణినాగపురమున అనంతవర్మ అను చక్రవర్తి పాలించెను; ఆతని రాణి భోగావతియను రాచబిడ్డ; ఆతడు తొలుదొల్త సర్పాకృతిగ జనిమ్మించినను ఆరాణి భోగావతి తపోబలముచే మానవుడై రాజ్యమేలెను; ఆనాటినుండియు ఆ వంశమునకు నాగవంశము అను పేరు ప్రసిద్ధికెక్కెను— అని యీశాసనమున తెలుపబడినది.

విమర్శ:

నాగులు అన కేవలము పాములని చెప్పరాదు 'నాగులు' అని చెప్పబడువారు ఒకజాతివారనుట ఎల్లరికు తెలిసినదే. అమరకోశము, ప్రథమకాండము, భోగివర్గము: 'నాగాః కాద్రవేయాః;' (వ్యా:—) 'మానుషాకారేషు ఫణాలాంగూలాదియుక్తేషు, దేవయోనిషు, భోగిషు వర్తతే'; 'నగేభవ్యతే భవాః నాగాః'; 'పద్మ్యాంనాంగం తిరివనాగాః' అని వ్యాఖ్యానింపబడియున్నది. వారి నివాసము 'అధోభువనం, పాతాళ, బలిసద్మ, రసాతలమ్, నాగలోకః'; (వ్యా) 'నాగానాం సర్పాణాం లోకః నాగలోకః' అనియు వ్యాఖ్యానింపబడియున్నది. అందువల్ల పురాణాదుల విద్యాధర, అప్సర, యక్ష, రక్షః, సిద్ధ, సాధ్య, గరుడ, ఉరగ, గంధర్వ, కింపురుషాది జాతులన్నియు దేవయోనులుగా (దేవతలనుజాతివారికి సంబంధించినవారుగా) వర్ణింపబడియున్నారు. కావున కాద్రవేయులు, ఉరగులు అనబడు నాగజాతివారు ఆదినుండియు భారతవర్షమున నివసించుచున్నారు. వారి మొదటి నివాసము ఆనాడు పాతాళలోకమని పేర్కొనబడిన నేటి 'నాగాలాండు' మొదలైన ప్రాంతము. ఆనాటి వేద, పౌరాణిక భూగోళమున మేరు, మందరపర్వత ప్రాంతమగు హిమాలయపర్వత పాద ప్రదేశము.

రామాయణమునందు శ్రీరామపుత్రుడగు కుశుని భార్య కుముద్వతియు, మహాభారతమున ఖాండవ వనమందలి తక్షక, కర్కోటక, అనంత, వాసుక్యాదులు జరత్కారు, ఆస్తీకుడు, అర్జునుని భార్య ఉలూచి మొదలైనవారందరు నాగవంశజులే. క్రీస్తుశకారంభ

మందలి ప్రతిమలన్నియు అమరవ్యాఖ్యానమునకు సరియగురూపమున ఒకటి, రెండు, మూడు, అయిదు, ఏడు పడగలు శిర్షాగ్రముననను, పృష్ఠభాగమున దీర్ఘలాంగు లాకారమును గలిగియున్నట్లుల రూపింపబడినవి.

ఆ అస్సాం దేశమందలి (నాగాలాండు) మణిపురము నందుండియే యీ నాగవంశజులు కాలక్రమున దక్షిణాపథమునజేరి ఆంధ్ర విష్ణువుకాలము నాటికి (క్రీస్తునకు పూర్వమే) బౌద్ధమతస్థులై ఉభయ సింధు ప్రదేశవాసులైరి. హాలశాతవాహన చక్రవర్తికాలమునాటికి యీనాగులే సింహళద్వీప నివాసులైరని నాగకన్యయగు లీలావతితో హాలచక్రవర్తి వివాహ గాథయే చాటుచున్నది. వీరు ఆనాటి ఆజాతి క్షత్రియులే. దేవయోనులైన పలుజాతులలో నొక్కరైన నాగజాతి వారలే పురాణకాలమునుండియు భారతదేశమంతయు వ్యాపించియున్నారనుటలో మహాభారత కాలమునాడే అర్జునుని భార్య 'ఉలూచి' కావేరీ తీరస్థ నాగజాతి కన్యయనుట తేటతెల్లమేకదా. అంతేగాక 11, 12 శతాబ్దములందు బరిపాలించిన జగదేక భూషణ ధారావర్ష, రాజభూషణ సోమేశ్వర కన్నరదేవ, జగదేక భూషణ వీరసోమేశ్వర, జగదేక భూషణ నరసింహదేవ, రాజాధిరాజ జయసింహదేవ, రాజాధిరాజ హరిశ్చంద్ర దేవ మహారాజులు బస్తరు (చిత్రకూట) నాగవంశ మహారాజులగుటయు విశదమే. అంతేగాక కరవాల భైరవ (తూర్పుచాళుక్య) విజయాదిత్యునకి మహామంత్రి, సైన్యాధ్యక్షుడు, మాండలికుడునై క్రీ. శ. 1132 న కొంపులోంగో ద్వాదశగ్రామ ప్రతిగ్రహీత యగు భీమరాజును నాంగవంశోద్భవుడే. అందువలన యీ నాగవంశపురాజులు (రామాయణ మహాభారత) రాణకాలమునుండి నేటివఱకును యావద్భారతము నందును నివసించుచుండిరి. కొందరు మహారాజులై దేశమేలిరి. మఱికొందరు మహామంత్రులుగను, హైహయవంశ రాజులవలె సేనానాయకులుగను, మాండలిక్కులుగను ప్రఖ్యాతినొందిరి. అందువల్లనే యీ నాగవంశపు రాజులు తొలుదొల్త మణినాగపు వాసులనియు ఆ పిదప వింధ్యపాదప్రదేశము నేలిరనియు, ఆ దోషనివారణార్థము 'వేములవాడ' దేశమందలి 'తొయ్యేరు రాజ్యమున' మొదట 'గంగవాడ' రాజధానిగా జేసికొని ఆ పిదప సర్వసంపత్సమృద్ధమైన 'రంభాపురము'ను (Modern Rumpa) రాజధానిగా మార్చుకొని రాజ్యమేలిరనియు ఈశాసనము 10—18శ్లోకములలో వర్ణింపబడినది. క్షాద్రవేయులగు నాగులందరు కశ్యప బ్రహ్మసంతతివారగుటచే 'కాశ్యప'సగోత్రులగుటయు ప్రసిద్ధమే. వారిది నాగధ్వజము, సింహలాంఛనముగా చారిత్రకులు వెల్లడించియున్నారు.

ఈ శాసనమందలి నాగవంశ నిరూపణ :

ఇందొక విశేషము గొనవచ్చుచున్నది. 'ఫణీశ్వరాకారశయా నృగర్భజాతోపి రాజ్ఞీతపసా నృపోభూత్, తదా ప్రభృత్యేవ స నాగవంశః సర్వోత్తమోభూదితి సుప్రసిద్ధః॥8॥' అని యుదాహరింపబడెను. ఈ విషయము జాగరూకతతో గమనింపతగ్గది. ఈ విషయమునే స్త్రీ సాహిత్యమున 'పాముపాట' యనబడు ధర్మాంగద చరిత్రమును చాటుచున్నది. అంతేగాక 'గౌతమీ మాహాత్మ్యము'నందలి చతుర్వింశాధ్యాయమున 'నాగతీర్థ'మను కథనమునను గలదు. ఈ నాగవంశోత్పత్తి కథనమున స్త్రీసాహిత్యము మొదలు— పురాణతీర్థ మాహాత్మ్యములవఱకును జేర్చొనబడిన గాథాసత్యముల బరికించుట ముఖ్యావసరమే. గౌతమీ మాహాత్మ్యము నాగతీర్థమున 'తతఃపుత్ర శ్చిరాదాసీ। త్సర్పోవై భీషణాకృతిః.........తం పుత్రం పోషయామాస।.........తస్మిన్నేవ మహాసర్పే। వర్తిత్వ్యం మనుష్యవత్। మనుష్యవాచా సర్పస్తు। వక్తిసర్వం స్ఫుటాక్షరమ్। సర్పఃస్వ పితరం ప్రాహ। కురుమేం జాతకక్రియాః। తథోపనయనం చాపి।వేదధ్యయన మేవచ। యావద్వేదాన్నజానీతే। తావచ్ఛూద్ర సమో ద్విజః।...బ్రాహ్మణం కంచనానీయ। సంస్కారాది తథాకరోత్। అధీతవేదస్సర్పోపి......వివాహ మక

రోద్రాజా । భోగవత్యా స్సువిస్తరం ।........తతః ప్రసాదిత శ్శంభు స్తయాచైవ మయాసహ । పునశ్చోక్తం తేనభద్రే । గౌతమ్యాం మమపూజనం । కురుతాం జ్ఞాన మాసాద్య । తథాసర్పాకృతిస్త్వ । తదా వినాశోభవితా । భోగవత్యా ప్రసాదితః । పూజయామాస దేవేశం । తతః ప్రీతోభవద్భవః । తతో దైవ ప్రభావేన । కామరూపోభవత్తదా । శూరసేన సుతస్సోపి । దివ్యరూప ధరోభవత్ । తతః ప్రభృతి తత్తీర్థం । నాగతీర్థమితి శ్రుతం । తత్ర నాగేశ్వరో దేవో భోగవత్యా ప్రతిష్ఠితః ॥'. ధర్మాంగద చరిత్రమునందును ఈ విషయమే కలదు.

నాగులు పురాణకాలమున దేవయోనులు కావుననే మానవులకు పూజనీయులైరి. నాగచతుర్థి, కుమార షష్ఠి, సుబ్రహ్మణ్యషష్ఠి, స్కందషష్ఠి, మల్లార షష్ఠియను పండుగ లేర్పడుటయు, నాగేంద్రుని గద్దె కేగుట, పుట్టలో పాలుపోయుటయు ప్రత్యక్షము. అంతేగాక సంతానపతులు కాగోరు అతివలు నాగులచీరలు ధరించుట మొదలైనవి గలవు. బ్రహ్మగారుడమందలి అష్టనాగులు, మంత్రశాస్త్రమున సిద్ధనాగినీసాధనలు, శ్రీ మహావిష్ణునకు శేషశయ్య, అనంతుడు, ఈశ్వరునిభూషణము వాసుకియు పురాణవచనములే. (శ్రీ మహావిష్ణువు అనంతశేషశాయియయి నాగరాజగు అనంతశేషుని పై కార్యభారమిడి వాని కార్యములయందే సుఖభోగము లందినవాడు; ఈశ్వరుడు 'నాగభూషణుడన' నాగుల రాజైన వాసుకి ఈశ్వరుని కొల్వుకూటమున అలంకారప్రాయుడు; అనగా అతడులేని సభాకార్యక్రమము వ్యర్థములని గోచరించుచున్నది. ఇట్లే నంది వాహనుడు, గరుడవాహనుడు మొదలైన పేర్లన్నీ అన్వర్థనామధేయములే యగును.) వీరందరును ఆయావంశానుగతమైన శిష్టాచార సంపన్నులేగాని అన్యులుగారు. అందువల్లనే యీ వంశములో వారైన యీ శాసనదాతలును వసిష్ఠ కుమార కల్పసూత్రానుసారముగ జాతకర్మ...విద్యాభ్యాసము (అధ్యయనము), పట్టాభిషేకము, యజనము, వానప్రస్థము మొదలగు వేదవిధ్యుక్తధర్మానుసారులైనటుల, (9, 14, 19, 20, 24, 25, 28, 39, 40, 41) శిష్టాచార సంపన్నులై జాతాదిషోడశకర్మలు, వేదాధ్యయనాది వేదకర్మలును, వర్ణాశ్రమధర్మానుసారముగ, ఆశ్రమ స్వీకారము, క్రతుసంస్కారములుగూడ అయినట్లు తెలుపబడిరి.

అయితే, పురాణప్రసిద్ధమైన నాగవంశోత్పత్తినిగూర్చి పురాణము లొకరీతిగను, నిఘంటువులు, మాహాత్మ్యములు వేరొకరీతిగను తెల్పుటయు, ఈ రాజశాసనమునగూడ నాగవంశోత్పత్తిని 9 వ శ్లోకమునందు 'ఫణీశ్వరాకారతయా వృగర్భ । జాతోపి రాజ్ఞీ తపసా నృపోభూత్ । తదా ప్రభృత్యేవ స నాగవంశః సర్వోత్తమోభూదితి సుప్రసిద్ధమ్ ॥' అని యున్నందుచేతను, దేవయోనులుగానున్న నాగులును, ఫణీశ్వరాకారోత్పన్నులైన యీ నాగవంశజులు భిన్నులు; ఏకమ్ములేనా యనునదియు, అట్టి సర్పమును మానవగర్భము ప్రసవించునాయనియు యోజింపవలసి యున్నది. అమరవ్యాఖ్యానకర్త 'నాగాః కాద్రవేయాః' అనుటలో మానుషాకారేషు, ఫణిలాంగూలాది యుక్తేషు దేవయోనిషు భోగిషువర్తతే' అని ప్రమాణము జూపుచున్నాడు. శ్రీ మహాభారతమున కాద్రవేయులు నూర్వురు ఒక్కసారిగా జన్మించిరనియు వారు సర్పాకృతిగనుండి వినతాకద్రువ సంవాదమున శ్వేతాశ్వ దీర్ఘపుచ్ఛమునకు తమ దేహాచ్ఛాదనచే తమో వర్ణము గల్పించిరనియు గన్పడుచున్నదిగదా. అంతేగాక బౌద్ధులకాలమందలి నాగుల ప్రతిమ లన్నియు ఆతీరుననే యున్నవికదా. ఇవియే నాగుల మూలపురుషులయాకృతిని జన్మించినటుల ధ్రువ పరచుచున్నవి. అంతియగాక కౌరవ జననము— కుంతి అయిదుగురు పుత్రులను గనుట విని తన గర్భ మెంతకును ఫలించకుండుటకుం గినిసి గర్భతాడన మొనరింప గర్భపాతమయ్యెను. ఆ పిండమును దధి, మధు, ఘృత, సర్పి, రోషధీయుతమగు భాండమున నిక్షిప్తముగానుంచి ఓషధీపరిపోషణ గావింప నామానవ

పిండమునుండి యొక్కొక్కరుగా కౌరవశతం బుద్భవించినట్లు గాన్పించుచున్నది.

మానవ ప్రసవమున కొక్కబిడ్డ నియతి. కేవలలైన బలహీనులగుటయో, ఒకరు నిష్క్రమించుటయో, లేక వికలాంగులగుటయో, మేధాహీనులగుటయో తథ్యము. అట్టితతి పెక్కుబిడ్డ లొకే గర్భమున జనించినవారి యాకృతు లెట్లుండునో చూచిన వారికిని, సమగ్రముగా పరిశీలించినవారికిని అవగాహన కాగలదు. అందువల్లనే విపరీత ప్రసవశాంతికై, ఏకనక్షత్రశాంతి, గోముఖ ప్రసవశాంతి, అధికాంగ, హీనాంగ, వికృతాంగ, బహుప్రసవ, నాళవేష్ట, సర్పవేష్ట, సర్పజననశాంతులు జ్యోతిషమున గాన్పించుచున్నవి. దానిని బరిశీలింప మానవగర్భమునుండి వైశేషిక ప్రసవములందు సర్పజననము ప్రకృతిసిద్ధమే. అయితే ఆ ప్రాణులు కేవలము సర్పములుగాక సర్పాకృతిగ భీషణాకృతిగల ఫణశీర్షము, దీర్ఘదేహము, లాంగూలపుచ్ఛము, హీన అనుపయోగ హ్రస్వకరచరణములు కలిగియుండి (నుండలాక జననమును బోలియుండి) క్రమక్రమముగా ఓషధీ పరిపోషక ప్రభావమున యథాక్రమము మానవాకృతి ధరించి దృఢగాత్రులు దీర్ఘాయుష్మంతులుగ జీవించుటకు తగు నాధారము లుండునని యోచింపవలయును. కావున (దేవయోనులలోని నగులు) ఈ వంశమూలపురుషుడు అట్టి సర్పజననము కలవాడై యుండగలడనుట స్పష్టము. సందేహించనక్కరలేదు అందువల్లనే యీ నాగవంశజులు తమ తొలుదొల్త నివాసము దేవయోనులందలి నాగుల నివాసమైన మణినాగపురము అనియు, తరువాత దక్షిణాపథ ప్రవేశనుండలి (భోగవతీపురము) వింధ్యపాదమనియును దెల్పుకొనియున్నారు ఈ ఆచారము హైహయవంశరాజులు తమ వంశజులు కార్తవీర్యార్జునిని పట్టణమైన వింధ్యపారియాత్రమందలి మాహిష్మతీపురము (మాంట) అని యుదాహరించుకొనియున్నారు *

ఈ నాగవంశరాజులు మొట్టమొదట వేంగీమండలాధిపతియైన తూర్పుచాళుక్య కరవాలభైరవ విజయాదిత్యుని (రాజరాజనరేంద్రుని సాపత్నీసోదరుడు) సేనానాయకుడు, మహామంత్రి, మాండలికుడునైన భీమరాజు క్రీ. శ. 1032 'కొంపాలొంగ్గడ' శాసనమున గాన్పించుచున్నాడు. ఆ పిదప రాజేంద్రచోడుని (కులోత్తుంగచోడుని) చక్రకూటవిజయమునందలి యొకానొక నాగరాజు కానవచ్చుచున్నాడు. ఆ పిదప ఈ శాసనపు నాగరాజులు గాన్పించుచున్నారు.

రాజ్యములు, రాజధానులు, వైభవము:

వేములనాడుదేశము, తొయ్యేటిరాజ్యము, గౌతమీ పూర్వదిశలని చెప్పబడియున్నది. (10—18 శ్లో) అయితే, యిపుడీ 'వేములనాడు'దేశము గాని 'తొయ్యేటిరాజ్యము'గాని గానరాదు. అయితే ఆ వేములనాడదేశమున (శ్రీ, గౌతమీవాలె అనుటచే) గౌతమీనదిలో గలియు నొక్క కొండఏటియొద్దున రంభాతీర్థము గలదనియు '......తస్యై రారామ, దేవాలయ దీర్ఘికాభిః । అరణ్యానాగేంద్ర ఘటాశ్వయూథైః । తపోవనైః పుణ్యతపోవనానాం । రంభాఖ్యతీర్థం సహితాముపాత శ్రీ గౌతమీవాలె దిగన్తకుల్యా । జాయంతి వింధ్యాద్రి నివాసజాత దోషం జనానాం వినివారయంతం॥' అని యుదాహరించి యుండుటచేతను... 'ఆసీద్రంభాపురీ రమ్యా ద్వితీయా పాలకాతతః । సా గండవాడా భువి సుప్రసిద్ధా పురీ పురాణాం ప్రథమావిభాతి । నాగేంద్ర వంశోత్థ మహీపతీనాం పట్టాభిషేకార్థ వినూత్నవేదీ' అని యుదాహరించుటచేతను అభివ్యక్తమైన స్వస్య రాజ్య శ్రీ రమితా చలా । తొయ్యేటి చౌళ్లముఖ్యాని

*ఆంధ్రచరిత్రయందు నాగవంశపురాజుల శాసనము లెంతవఱకును లభ్యముగాక యిదియే తొలుదొల్తటిదై యున్నదని భావించుటచే నాగవంశోత్పత్తి, వారి నివాసము నాగజాతిని గురించి యింతవరకు శోధింపవలసివచ్చినది.

పురాణన్యానిచాభవన్। శ్రీ వల్లభే ష్వేంగురునాడి దేశే। శ్రీ గౌతవిూ పూర్వతటాభిరామే। గవ్యూతి దూరే నరసింహనామ్నా। కోఱ్కొండదేశస్య పురోప కంఠే॥' అని పేర్కొనబడియున్నది. కావున వేము ఱునాడుదేశము ఏదో నిర్ధారణ జేయవలసియున్నది.

వేముఱునాడు దేశము :

ఈ శాసనకాలము 'శాకాబ్దేరస (6) రంధ్ర (9) భాను (12) గుణితే నాభస్య చంద్రగ్రహే' అనికదా యున్నది. అనగా శా. శ. 1296+78= 1374. క్రీ. శ. నాభస్య=శ్రావణమాసము అగస్టు నెల (చంద్రగ్రహే) పౌర్ణమి అగుచున్నది. ఏ యితర శాసనములందును వేముఱునాడుదేశమని వాడకున్నను గౌతమీతీరమున తూర్పున 'తొయ్యేరు' అను గ్రామము నేటికిని గలదు. కావున ఆ ప్రాంతమంతయు తొయ్యేటిరాజ్యమై యున్నది. గౌతమీనది తూర్పు భాగమున రెండుక్రోశుల దూరమున శ్రీ నరసింహ స్వామివారి నిలయమైన కోఱుకొండదేశ మున్నటుల గాన్పించుటచే ఆ తొయ్యేటిరాజ్యము, కోఱుకొండ దేశముతోసహా ఈ 'వేముఱునాడు' దేశముగా పరిగ ణింపబడినది. వేంగి+ముఱు+నాడు=వేముఱునాడు; అందు 'ముఱు' అనగా వేఱుపడిన (తునక) భాగము అనగా వేంగిదేశమునుండి వేఱుపడినభాగమని తోచు చున్నది. ఏలనన ఆదిని తూర్పు చాళుక్యుల కాల మున కృష్ణా, గోదావరీ మండలములు పిఠాపురము వఱకును వేంగీ మండలముగా బరిపాలింపబడినది. ఆ పిమ్మట చాళుక్య రాజవంశము చాళుక్యచోడవంశ ముగా బేర్కొన్న కాలము 12 శతాబ్దమున వేంగీ నాథులు వేంగీరాజ్యమందు లేకుండుటచే వారి సంతతి కొంత కాలమును, వారి బంధువులు, ఆశ్రి తులు, అనుయాయులు, ఉద్యోగులు క్రమక్రమ ముగా కాలానుసరణమున అనువు జూచుకొని సామంత ప్రభువులు, మండలేశులుగానుండి క్రమక్రమమున స్వతంత్రులై ఎవరి రాజ్యముల వారే పాలింపజొచ్చిరి. అట్లయినను 13 వ శతాబ్దమున కాకతీయ చక్ర వర్తులు ఆంధ్ర సామ్రాజ్యమును స్థాపించి ఏకో న్ముఖమున ధర్మబద్ధముగ రాజ్యమేలిరి. కాని కాల వైపరీత్యమున కాకతీయ ప్రతాపరుద్ర చక్రవర్తి క్రీ. శ. 1326 సం॥న మహమ్మదీయులకు జిక్కెను. అంతటితో ఆంధ్రరాజ్యమంతరించినది. తురుష్కుల బాధలు ఆంధ్రదేశమున చెలరేగినవి. జాతికి మను గడయే లేకపోయెను. ఈ దేశోపద్రవ ప్రళయమున కోర్వలేక ప్రజలెల్లరు ఇష్టదైవముల దలంచి పరమతస్వీకారమునకొల్లక ధనమాన, ప్రాణముల బోగొట్టుకొనవలసిన వారైరి. ఈ కల్లోలమును కండ్లారజూచిన ప్రతాపరుద్రుని డెబ్బది యాఱుగురు నాయకులును సమావేశమై ముసునూరి ప్రోలయ, కాపానాయకుల నాయకత్వమున జేరి ఆంధ్రదేశమున యవన (తురుష్క) పరిపాలన లేకుండ బాఱద్రోలిరి. హిందూ ధర్మములను చాతుర్వర్ణ్య (పరిపాలనము) ధర్మములను పునరుద్ధరించిరి. భూతలస్వర్గము గావించిరి. అయితే ఆ నాయకులిర్వురును స్వార్థ త్యాగులు, రాజ్యకాంక్ష లేని వారగుటచే (వేంగీ) ఆంధ్రదేశమును తమ యేలుబడికి తీసికొనక అందు పాల్గొన్న సేనానులందరకును ఎవరి ప్రదేశములు (రాజ్యముల) వారికే వదలివేసిరి. అందుచే వేంగీదేశమంతయు ఛిన్నభిన్నమై పోయెను. రెడ్డిసంచిక 7 పేజీలో 'ప్రతాపరుద్ర చక్ర వర్తి 1323లో బందీగా గైకొనబడుటతో కాకతీయ రాజ్యము పతనమందినను, రాజ్యాంగపు కట్టుబాట్లు మాత్రము సుస్థిరముగా నుండెను. కాకతీయ నాయ కులు తమ తమ నాయంకరములలోనుండి దేశము స్వాధీనములో నుంచుకొని పాలించుచునే యుండిరి. ఏలూరు మొదలు సింహాచలపర్యంతప్రదేశము ఇందులూరి రుద్రదేవుని పాలనలో నుండెను. వీరి క్రింద కొప్పులరెడ్లు పిఠాపురము రాజధానిగా, కొఱాము తత్పరిసర ప్రదేశముల నేలుచుండిరి. కోరుకొండ రాజధానిగా ముమ్మడి నాయకుడును, తొయ్యేఱు ముఖ్యనగరముగా ముసునూరి కాపనాయకుని సోదర పుత్రుడు అనోతా రెడ్డియును, రేకపల్లి ప్రధాన స్థానముగా ప్రస్తుత భద్రాచలము, పాలవంచ

ప్రాంతముల ముసునూరి ప్రోలయ నాయకుడును, అమనగల్లు రాజధానిగా కాపయనాయకుడును నాయకత్వము నెఱపుచుండిరి. కమ్మనాటిలో చెఱకు వంశపు రెడ్లును, పల్నాటిసీమయందు దేవరి నాయుడును, తంగేడయందు శ్రీగిరి నాయుడును, వెలనాటియందు సోమయాజుల రుద్రసేనానియు, వర్ధమానపురమునందుండి గోనవంశపు రెడ్లును, పాకనాటిలో ముప్పిడి నాయకుడును, ములికినాడు, రేనాడు, పెన్నతవాడి, సకిలి, ఏయువనాడు, పొత్తపినాడు, మార్జవాడి మొదలగు దక్షిణాంధ్ర దేశభాగములను జొట్ట, యల్లంక, గొంకారెడ్డి గారలును ఇంకను అనేకులగు నాయకులును కాకతీయ రాజ్యమందలి యుత్తర భాగములను తమ స్వాధీనమందే ఉంచుకొనియుండిరి ఓరుగంటిదుర్గపతన మాత్రమున మహమ్మదీయులకు యావత్కాకతీయ రాజ్యమును స్వాధీనము కాలేదు'......దీనిని గమనింప 14వ శతాబ్దమున వేంగీదేశము (ఆంధ్రదేశము) ఛిన్నాభిన్నమునై యున్నది. అందువల్లనే ఈ తొయ్యేటి రాజులు తొయ్యేరు కోర్కొండ రాజ్యములను 'వేములవాడు' దేశమని పేర్కొనిరి. కొప్పులవారు దోనేపూడి శాసనమున ఏలెంటినాడనియు, ముమ్మిడి రంగనాయకుని రాజ్యశాసనములందు కొంగలినాడు, కురవాటు దేశము, కోనదేశము, పొగుణారనాడు అని వాడియున్నారు.

రంభాపురపు పూర్వపు రాజధానులు :

ఈ నాగవంశపురాజులు ఎప్పుటనుండి ఈ రంభాపురము చేరిరో గమనించిన వారివంశము పూర్వపు నివాసము తెలియగలదు. 'తదన్వయే సర్వజనాశ్రయో భూ దనంతవర్మా సహి చక్రవర్తీ। రాజ్ఞీచ తస్యాభవదంబుజాక్షీ భోగవతీ నామ నృపేశకన్యా। పురేచతస్మిన్ మణినాగనామ్ని తతోకరోద్రాజ్య మరిందమశ్చిరం' అని వ్రాయుటచే వీరు తొలుదొల్త మణినాగపురవాసులైరి. 'రంభాఖ్యతీర్థం సహి రామనాథ శ్రీ గౌతమీవారిదిగన్తతుల్యా। జాయంతి వింధ్యాద్రి నివాసజాత దోషం జనానాం వినివారయంతం। విసర్గ మంజూతే తస్మిన్ దేశే భీమమహీభుజః। ఆస్తేరంభా పురీ రమ్యా ద్వితీయాపాలకా తతః। సాగండవాడా భువి సుప్రసిద్ధా పురీ పురాణాం ప్రథమావిభాతి। నాగేంద్ర వంశోత్థ మహీపతీనాం పట్టాభిషేకార్థ వినూత్నవేదీ' అని యుదాహరించుటచే తొలుత వీరి రాజధాని 'మణినాగపురము' అనియు, వింధ్యాద్రియందు కలదనియు ధ్రువమగుచున్నది. దానిని గమనింప వింధ్యాద్రియందు పుట్టిన గోదావరి యుపనదియగు 'వైనగంగ'పై నెలకొని వార్ధాకు సమీపమగు 'మణిపురము' అని యూహింపవగును. అందుకు తోడు బస్తరు (చక్రకోట్యము) రాజులు అహివంశరాజులని ధారావర్షాది మహారాజులందరి శాసనములందును బేర్కొనబడినది. ఈ నాగపుర మా ప్రాంతమునకు జేరియే యున్నది. వింధ్య పుళిందదేశమగుటచే వేద (కర్మ) బాహ్యమని ధర్మశాస్త్రములు చాటుచున్నవి. తద్దోషనివారణార్థము ఈ వంశపురాజులు అచ్చట నుండి 'గండవాడ'యని ప్రసిద్ధికెక్కిన పురాతన పట్టణము రాజధానిగా జేసికొనిరి. ఆ గండవాడ నేడు గానవచ్చుటలేదు. కాని గోదావరిజిల్లాలోని ఎల్లవరం డివిజనులో సీలేరుతీరమున నొక 'గండికోట' గానవచ్చుచున్నది. కావున ఈ వంశపురాజులు మణినాగపురము వదలి ఆ గండికోట యనబడు గండవాడను రాజధానిగా జేసికొనియుందురు. ఆ పిమ్మట సకల ఫలసస్యసమృద్ధియు, గోదావరీనదీపవిత్రపుణ్యక్షేత్రము నగు రంభాతీర్థమును రంభాపురము గావించి రాజధానిగా నీ తొయ్యేటిరాజ్యమును పాలించిరనుట ధ్రువము

రంభాపురము :

ఈ రంభాపురము గౌతమీనదీ ప్రాక్తటమున తొయ్యేటి రాజ్యమున కలదని యుదాహరింపబడెను. ఈ తొయ్యేటి గ్రామము నేటికిని గౌతమీనదిలో 'పోలవరపు కేఱు' అని యుదాహరింపబడుచు (పూర్వపు దేశపటమున శ్రీ గౌతమీవారి — వాలుధార' అని యున్నది) కలియు చోటనున్న దేవీపట్నము ప్రక్కను కలదు. కావున ఆ ప్రాంతమునకే 'నాగతీర్థ'మున్నటుల గౌతమీ మాహాత్మ్య చతుర్దశాధ్యాయమున ఈ నాగవంశపు రాజులను

గురించిన ప్రస్తావనలో నున్నది. కావున ఆ 'నాగ తీర్థమే' (పురాణములోనిది) రంభాతీర్థమై నాగ వంశ రాజధానియగుటతోడనే రంభాపురమైనది. అదియే నేటి రంపచోడవరమునకు ప్రక్కనేయున్న 'అంప' గ్రామమై నిలిచియున్నది. ఇందుకు భీమేశ్వర పురాణము ప్రథమాశ్వాసము 23 ప॥

'ఝూడేశ వనసప్తమాడె బారుహ దొంతి
వంతువాడి క్షితీశ్వరుం గెలచి,
యొడ్డాది మత్స్యవంశోదయార్జునుచేత
బల్లిహాధిపుచేత బలచమంది;
దండకారణ్య మధ్య పుళింద రాజ్య రం
భాహివంశజులకు నభయ మొసగి;
భానుమత్కులవీరభద్రాన్న దేవేంద్ర
గర్వసంరంభంబు గట్టి పెట్టి
యవన కర్ణాట కటక భూధవులతోడ
బలిమి వాటించి యేలించె దెలుగుభూమి
దన నిజస్వామి నల్లాణ ధరణినాథు
భళిరె యరిమేటి లింగన ప్రభువరుండు॥'

అని యుద్ఘాటించెను. ఆ రంభాపురము, తొయ్యేటి ప్రాంతము నేటికిని అరటి, పనస, మామిడి మొదలగు తోటలతో సకల ఫల సమృద్ధమై యున్నచున్నది. ఆ రంభాపురమే కాలానుక్రమమున ప్రాకృత జనుల నుడికారముననో లేక రాజకీయరంగముల తిఱుమగా గలుగు అల్లకల్లోలముల మూలముననో కాని, 'అంప' (అంపిల్లుట=తగవులాడుట) అను అర్థముననో కాని నేడు 'అంప' అని వ్యవహరింపబడుచున్నది.

ఆనాటి రంభాపుర వైభవము :

ఈ శాసనమందలి 10–18 ల బరికింప ఆనాటి రంభాపుర (అంప) వైభవమును హంపీ పురపు శ్రీకృష్ణదేవరాయలవాటి వైభవమునుమించి గాన్పించుచున్నది. నేటికిని అంపయందు శిథిలమైన ఉాశికోట యొకటి ప్రాచీనాస్తిత్వమును జాటుచున్నటుల గాన్పించుచున్నది. కాని నేడీ రంభాపురము, 'అంప'అను కుగ్రామమై శోభావిహీనమై నాగరికతాశూన్యమై కేవలము కొండజాతుల వారితోనిండి నిత్యదారిద్ర్యముచే సర్వజన సామాన్యులకు గూడ కనుమఱుగై యుండుట మన ఆంధ్రదేశమున కొక తీఱనిలోటు అనిపించును. ఆ ప్రాచీనపుకోటను పురాతత్వశాస్త్రవేత్తలు పరిశీలించి భద్రపఱచిన ముందుముందు చారిత్రకోపయోగమైన వస్తుసంభారము లేమైన చేకూరగలవేమో యను ఆశ జనించుచున్నది.

వేములునాటిదేశ తొయ్యేటిరాజ్య నాగవంశరాజులు, రంభాపురము :

అనంతవర్మ – (మూలపురుషుడు, మణినాగపురవాసి.)

భీమరాజు – { సామలకోట తామ్రశాసన దానప్రతిగ్రహీత. కరవాలభైరవ వీరవిజయాదిత్యుని మంత్రి, సేనాని, మాండలికుడు, దుర్గిక వాసుకీరస, సోమేశ్వరాంతర వాసుకినాముడు. క్రీ. శ. 1311.

1. భీమరాజు – రంభాపుర రాజధానీకరుడు.

2. వల్లభరాజు – అర్యమాంబ

3. ఎల్లభీముడు. (ధవళాంకభీముడు)

(భార్యలు)

1 మల్లమ – ఇమ్మడింద్రుడు (సితకరగండుడు సితకరరేజాడు)

2. కొప్పమ – పల్లినాథుడు

3. లక్ష్మీదేవి – వల్లభేంద్రుడు (సింధుగోవిందుడు) లక్ష్మీభీమవర తామ్రశాసనకర్త శా. శ. 126+78=1374 క్రీ.శ.

దీనిని గమనింపగా ఈ నాగవంశపు రాజులు, ఈ తొయ్యేటి రాజ్యమును రంభాపురము (జంప) రాజధానిగా 1. భీమరాజు 2 వల్లభరాజు, 3. ఎఱ భీముడు 4. ఇమ్మడీంద్రుడు 5. వల్లభేంద్రుడు అను అయిదుగురు రాజులు ఈ శాసనకాలమైన క్రీ. శ. 1374 నాటికి పరిపాలించిరని తెలియుచున్నది. అంతకు ముందెందరు రాజులు తొయ్యేటి రాజ్యపు మొదటి రాజధానియైన 'గండవాడ' యందు పరిపాలించిరో, అంతకుముందు, తొలి రాజధాని యైన 'మణినాగపురము' నందెందరు రాజులు పరిపాలించిరో తెలియరాదు. అంతేగాక ఈ రంభాపుర రాజులు అయిదుగురును ఎవరెవరు ఎంతెంత కాలము రాజ్యమేలిరో తెలియరాదు. కావున మొదటి భీమరాజు రంభాపురమును ఎప్పుడు రాజధానిగా జేసెనో గూడ దెలియవచ్చుట లేదు. అయితే రాజరాజ నరేంద్రుని సాపత్న్యసోదరుడైన కలవాలభైరవ విరవియూదిత్యునిమంత్రియు, సైన్యాధిపతియు, మాండలికుడు నైన నాగభీమరాజు ఒకడు క్రీ. శ. 1031 లో కొంపాలొంగడ ద్వాదశదానప్రతిగ్రహీతయై గన్పడుచున్నాడు. కాని అతడే రాజధానివాడో, అతడు పరిగ్రహించిన కొంపాలొంగడ ద్వాదశగ్రామ మెచ్చటిదో కూడ తెలియవచ్చుట లేదు. కాని అతడు నాగరాజై యుండుటయు, అతనిపేరు భీమరాజగుటయు, ఈ రంభాపుర రాజధాని కర్తయగు రాజుగూడ భీమరాజే యగుటయు పరిశీలింప వీరిరువురు ఒక్కవంశములోని వారేమో యనిపించుచున్నది. అపుడు ఈ రంభాపుర రాజులు అయిదుగురు 5×30=150 సం. పరిపాలించిన 1374—150=1225 క్రీ. శ. పరిపోవుచుండుటచేతను, వీరి పూర్వులు సీలేరు ప్రాంతమందలి గండవాడను (గండికోటను) పాలించి యుండుటచేతను క్రీ. శ. 1000 ప్రాంతమునాటికే ఈ నాగవంశరాజులు వేంగీమండలనివాసులై ప్రాంతీయ రాజులకు సహాయకారులైన క్రింది యుద్యోగులైరని తోచుచున్నది.

దానస్థలము, ప్రభువులు; కాలము :

51. శ్లో. ననుసరించి క్రీ. శ. 1374 అగష్టు వెయుందీ దానశాసనము గావింపబడెను. ఆ దానస్థలము వేముఖునాడు దేశము: ప్రాగ్గోతమీ తీరము నరసింహదేవర యునికిపట్టగు కోర్కొండ దేశమున కోర్కొండకు రెండు క్రోసుల దూరమున గల 'దోసపల్లి, వాల్లంక' అను రెండు గ్రామముల నేకము గావించి తనతల్లిదండ్రుల ప్రీతికొఱకై 'లక్ష్మీ భీమవరాగ్రహారము' అనుపేరున దానము గావించెను. ఆనాటి దేశ పరిస్థితుల (14 శతాబ్దపు వేంగీనాటి ఛిన్నభిన్నములు, రాజ్యములు) నిదివరలో జెప్పియుంటిమి. అయితే యింకొక విషయము. ఈ నాగవంశపు రాజులు ఇంతంత బిరుదులుగల వారలు ఏయే యుద్ధముల నెవరెవరితో గావించి యెవరిని జయించిరో, యెవరికి సహాయ్య మొనరించి యెవరిని గెలిపించిరో దెలుపగల చరిత్రమిసుమంతయు మనకు దెలియకున్నది సరిగదా తుదకొక కథ — గాథ — పాట యైనను గానరాకుండుట చాల విచిత్రము.

తొయ్యేటి రాజ్యమును క్రీ. శ. 1323–30 వఱకును కాపానాయకుని ప్రతినిధిగా అనపోత నాయకుడు పాలించి తరువాత రాజమహేంద్రవరము రాజధానిగా 350 వరకు పాలించినటుల చారిత్రకు లుద్ఘోషించుచున్నారు.

కాపానాయకుని యనంతరము మంచికొండ రెడ్డు, ముమ్మడీంద్రుడు కోర్కొండ దేశమును జయించినట్లాతని చారిత్రక శాసనములు చాటుచున్నవి. ప్రాచీన భూగోళము:— 1, 'ప్రథితోభయ గోదావరీమధ్య ప్రాంతేషు మహిత సౌభాగ్యవాన్। పాలయతి ముమ్మడీంద్ర శ్చెంగలి, కురవాట, కోన, పారవాన్' అనియు, 2. పాణార, కోన, కురవాట, చెంగరాడీన్। గోదావరీ ఉభయ తోయముపాంత దేశాన్ జిత్వా వనాచలజలదుర్గరమ్యా, ఏకః ప్రశాస్తి చిరమప్రతిశాసనమ్' అని గాన వచ్చుటచే ముమ్మడీంద్రుడు ఉభయ గోదావరీ పరిసర ప్రాంతముల

నిర్వక్ర పరాక్రమమున బరిపాలించినటుల విశదము. ఆతని పిదప ముమ్మడి శ్రీ రంగనాయకులు కోర్కొండ దేశమును బాలించుటయు, లక్ష్మి కోరికపై శ్రీరంగమునుండి నల్లాని చక్రవర్తుల పరాశరభట్టరును రావించి వైష్ణవ స్వీకారము గావించుటయు, గురువు కోరికపై వారి నిర్యాణానంతరమున కోర్కొండ (మెట్ట)పై శ్రీ నృసింహస్వామివారి ఆలయమును 1353 సం॥ నిర్మించినట్లును, కోర్కొండదేశము తానును, పెద్దతమ్ముడు సింగమనాయడు తుని సమీపమందలి కొటామును, చిన్నతమ్ముడు తాడిపాక దుర్గమును, పాలించినటుల చారిత్రకాంశములు దెలుపుచున్నవి. ఆతడు 1370లో మరణించిన పిదప ఆతని కుమారు లిర్వురు 1385 వఱకును కోర్కొండ దేశమును బాలించినటులును చరిత్ర ఉదాహరించుచున్నవి. ఇట్టి పరిస్థితులు నెలకొనియుండగా అనపోతుని యేలుబడిలోనున్న తొయ్యేటి రాజ్యము ఈ నాగరాజుల కెట్లు వచ్చెను? ఈ అయిదుగురు రాజులలో నెవరికెట్లు వచ్చెను? లేక అంతకుమున్నే ఈ నాగరాజులు తొయ్యేటి రాజ్యమేలుచుండగా ఆ తొయ్యేటి రాజ్యము అనపోతభూపాలునకు ఎట్లు వచ్చెను? ఈ విషయము లవలేశమును చరిత్రయందు గానరాకున్నది.

అంతేగాక కోర్కొండ దేశమును మంచికొండ రాజులు నిర్వక్రపరాక్రములై బాలించుచుండ, ఆ దేశములో నందరాడకు చేరిన ఈ 'దోనేపల్లి', 'వాల్లంక' గ్రామముల రెంటి నేకము గావించి తమ తల్లిదండ్రుల సుకృతము కొఱకై లక్ష్మీభీమవరాగ్రహారమను పేరను ఈ తొయ్యేటి రాజగు నాగవల్లభుడు ఎట్లు దానమీయ గలిగెను? ఈ విషయముల సమన్వయ పఱచి పరిశోధనగావించుట, బరిశోధకుల విధియై యున్నది.

శ్రీ గ్రాంట్ సిద్ధపరచిన 1862-63 (పుట-21), 1863-64 (పుట-18) అడ్మినిస్ట్రేటివ్ రిపోర్టులు ఆధారంగా, శ్రీ హెన్రీ మారిస్ రచించిన గోదావరిజిల్లా చరిత్రాంశాల వర్ణన (పుట-22) లోని భద్రాచలం, రేకపల్లి వివరములను, 1962 తూర్పు గోదావరిజిల్లా సెన్సస్ రిపోర్ట్లోని రాజకీయ చరిత్రను (అధ్యాయం-2, పుట-11) బరికింప ఈ తొయ్యేటి నాగవంశపు రాజులు మహాబలపరాక్రమవంతులై, ధైర్య సాహసోపేతులై, శూరులు, వీరులునై క్రీ. శ. 1030 మొదలు 1880 వఱకును సుమారు అయిదువేల చతురపు మైళ్ళకుమించిన ప్రదేశమును సమస్త గిరి వన దుర్గాధిపులై, ధన, కనక, వస్తు, వాహన, ఆరామ, దేవ, దివ్య తీర్థాది సంపన్నులై, సర్వస్వేచ్ఛాస్వతంత్రులై, ధర్మపరాయణులై పాలించిరని యవగాహనమగుచున్నది. తుదకు కాలగర్భ జనిత దోషమున శ్వేతహూణుల మాయావాగురుల దగుల్కొని రాజ్యవిహీనులై గిరి, గహ్వర, కాననావాసులై పేర్లైనను గానరానటుల రూపు మాసిరని విశదమగుచున్నది.

ఇప్పటికైనను ప్రస్తుతము అంపయందుగల ప్రాచీన శిథిలపు జాతికోటను, పరిసరములను బరిశీలించుట, ఆ ప్రాంతవాసులజేర్చి స్థల జానపద గేయముల సేకరించుట, గాథల ప్రోగుచేయుట మొదలగు కృషి సలిపినచో ఈ తొయ్యేటి అంప రాజుల చరిత్రాంశములు విశదముగా దొరకి కొంత వఱకు చరిత్ర కుపయోగింపగలవను ఆశ జనించుచున్నది.

ఆంధ్రదేశపు చారిత్రక మండలియందు నాగవంశపు చరిత్ర బహుస్వల్పమగుటచేతను, ఈ ప్రాంతమున ఆ వంశపువారిది ఒక్క శాసనమైనను దొరకక నేటికీ యొక్క శాసనము బయల్పడి ఈ మాత్రపు చారిత్రకాంశములనైనను వెల్లడింపదగు నవకాశము చేకూర్చుటచేతను ఈ శాసనమునందలి సంగతులింత విశదముగ విపులముగా వ్రాయవలసి వచ్చినది. తప్పులన్న, అజ్ఞానకృత దోషములను మన్నించి గుణమేమయిన మున్న గ్రహించెదరు గాకయని ప్రార్థన.

లక్ష్మీ భీమవరాగ్రహారము :

ఈ శాసనమందలి దానస్థలమగు లక్ష్మీ భీమవరముగాని అంతకుముందుగల దోనేపల్లి, వాల్లంక


గ్రామములుగాని నేడు కాన్పింపవు. అయితే ప్రాగ్గౌతమీతీరమున కోరుకొండదేశమున ఆ కోరుకొండకు గవ్యూతిదూరమున—రెండుక్రోసుల దూరమున—ఈ గ్రామము ఉన్నట్లుదాహరింపబడెను. పోనీ ఈ అగ్రహారపు సరిహద్దుల నుదాహరించుటలో ఒక్కసరిహద్దుగ్రామమైనను యుదాహరింపబడక ప్రకృతిసిద్ధములగు లతావృక్షగుల్మాదులు, వాళ్ళు, గుట్టలు, చెఱువులు, దీర్ఘికలు, సెలయేళ్ళుమాత్రమే యుదాహరింపబడినవి. అయితే ఒక ఉత్తరదిశను మాత్రము 'ఓంకాలపూడి' పోవుమార్గమని యుదాహరింప బడియున్నది. అయితే ఆ చుట్టుప్రక్కల యెక్కడను 'ఓంకారము=ఓంకాలపూడి' అను గ్రామము కానరాదు. కాని నేటి రాజమహేంద్రవరముతాలూకాలో గోదావరి తీరమున రాజమహేంద్రవరమునకు పైన కొంతదూరమున రఘుదేవపురమున్నది. ఆ సమీపముననే 'వంగలపూడి' అను గ్రామము కలదు. ఈ దానస్థలమునకు పడమటిభాగమున 7, 8 మైళ్ళదూరమున నుండుటచే ఆ 'వంగలపూడి'యే ఆ దినములందు ఓంకాలపూడి యని పిలువబడెనని యూహింపవలసివచ్చుచున్నది. ఈ దానస్థలము రాజమహేంద్రవరముతాలూకా రఘుదేవపురపు ఫిర్కాలో దోసకాయలపల్లి సమీపమున బూరుగుపూడి రాజానగరము జంక్షనురోడ్డునకు చేరిన నందరాడ—కలవచర్లలమధ్యను గలదు. ఆ లక్ష్మీభీమవరముకాని, దోనేపల్లి వాల్లంక గ్రామములుకాని నేడు లేకున్నను ఈ నందరాడగ్రామమునకు జేరిన ఈశాన్యభాగమందలి పాటిదిబ్బలు నేటికిని 'దోనేపల్లి' దిబ్బలనియే పేర్కొనబడుచున్నవి. కావున ఆ స్థలమే నాటి లక్ష్మీభీమవరాగ్రహారమని నిరూపింపవలెను. ఆ పాటిదిబ్బలయందే ఈ తామ్రశాసనము దొరకియున్నది.

శాసన సారాంశము

ఈ శాసనపు సారాంశమేమన ఈ నాగవంశపు రాజులు తొలుదొల్త బస్తరు (చక్రకోట్యము) రాజ్యమందలి (నేటి మధ్యప్రదేశ్) గోదావరినది యుపనదియగు వైనగంగపై వింధ్యపర్వతము నందున్న (వార్ధా) నాగపురము (మణినాగపురము) పరిపాలించి క్రమక్రమముగా రంపచోడవరము తాలూకాయందలి దేవిపట్నము ఫిర్కాలోని 23 నెం. గండివాడ (Gondivada) రాజధానిగా తొయ్యేరు రాజ్యమును (175, 176, దేవిపట్నము, తొయ్యేరు గ్రామములు) బరిపాలించి, ఆ పిదప చోడవరముతాలూకా యందలి 44. రంప (రంభాపురము) రాజధానిగా తొయ్యేటి రాజ్యమేలుచు 1370 లో మంచికొండ రెడ్ల వంశములో ముమ్మడి రంగనాయకుడు గెలిచినగానే ఆతని కోర్కొండరాజ్యమాక్రమించుకొని పరిపాలించును క్రీ. శ. 1374 లో ఆ కోర్కొండకు రెండు క్రోసుల దూరమందున్న నందరాడ—కలవచర్ల గ్రామములమధ్యస్థలమగు నాటి దోనేపల్లి, వాల్లంక యను రెండు గ్రామముల నేకముగావించి తనతల్లిదండ్రులకు అక్షయ పుణ్యలోక సిద్ధికొఱకై శ్రావణమండలి చంద్రగ్రహణ కాలమున ఏబదియైదుగురు వేద, వేదాంగ, శాస్త్ర, పురాణేతిహాసాది విద్యాకోవిదులకు అఱునది భాగల సర్వకరపరిహారముగా గ్రామదానము చేసియుండిరి.

షరా: ఈ నాగవంశపు రాజులు క్రీ. శ. 1000 నుండి క్రీ. శ. 1880 వఱకును అయిదువేల చతురపు మైళ్ళకు మించిన వేములనాటి రాజ్యమును—కాని పన్ను ఎవరికిని చెల్లింపకుండగనే—మన్యపు చక్రవర్తులై పాలించిరి. కాని వారి చారిత్రక విషయములా మండలములందే మఱుగుపడియుండుట విచారకరము. ఆ విషయము బయల్పరచుట యువ చారిత్రక పరిశోధకులవంతై యున్నదని మనవి చేయుచున్నాను.

వేములునాడు దేశము - తొయ్యేటి రాజ్యము



నాగ(వంశ) వల్లభేంద్రుడు. క్రీ. శ. 1374. (దోనేపల్లి—వాల్లంక) లక్ష్మీభీమవరాగ్రహారము కోర్కొండదేశము. (1) (మణి)నాగపురము (బస్తరు) (2) గండవాడ (3) అంప (4) తొయ్యేరు, (5) లక్ష్మీభీమవరము (దోనేపల్లి, వాల్లంక) (6) కోర్కొండ (7) కాపాలపల్లి (8) దేవిపట్నము (9) వాలుధార (10) చోడవరము.

గౌరీ శంకరము*

శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

లోకోత్తరగుణరూపశీలురు గౌరీశంకరులను నాయికా నాయకులనుగా దీసికొని మహాకవి కుమార సంభవ కావ్యమును రచించెను. కుమారకావ్యము రూపమున చిన్నదయ్యును గుణమున గొప్పది. కాళిదాసు గౌరీశంకరుల గాఢప్రేమతపస్సును మహనీయ ప్రవృత్తిని ప్రతిభతో చిత్రించి తన కావ్యము నొక రమ్యచిత్రపటముగా సుశ్రావ్యగీతముగా నొనర్చినాడు. అమృతమయప్రేమస్వప్నములకు అస్తిత్వము కల్పించినాడు. ఈ స్వచ్ఛప్రేమ పరమార్థమే విక్రమోర్వశీయ శాకుంతల దివ్యసీమలలో ప్రతిధ్వనించును.

యౌవనప్రాబల్యమును, చారిత్రకలావణ్యమును ఊతగా గొని విజృంభించు మదనశక్తి సంయమనాగ్నిలో బూదియై, వివేకభూమిలో దివ్యప్రేమగా ఫలించినది. మధురభారతి మహార్థముతో కలసి ధన్యమైనది. శక్తిసంపన్నప్రకృతి పురుషునితో గలసి సాఫల్యము నొందినది. ఉదారకవిత ఆధ్యాత్మిక సౌందర్యముతో నెనసి వీక్షణమాధుర్యమును భజించినది. విరాట్స్త్రీపురుషుల యెడబాటుతో నీరసమును, నిర్గుణమును నైన జగత్తు వారి రసవత్సంయోగముతో ఆనందపులకితమై నిశ్వసించినది.

ఫలితముగా మహావీరు డుద్భవించి విశ్వశ్రేయమును సాధించెను!

ఈ మహార్థమును కవి తన కళాపూర్ణవాణిలో భావితముచేసి పురాణ కథను ఒక రసవత్కావ్యముగా మలచినాడు!

కుమార సంభవమున ప్రధానరసము శృంగారము. తక్కిన కరుణాదికములు అంగరసములుగా నున్నవి. రఘువంశముయొక్క రచనాలక్ష్యము వేరగుటచే ఆయా సందర్భములందు అమిత సంయమముతో చిత్రింపబడిన శృంగారము ఈ కావ్యమున సింహాసనము నధిష్ఠించినది. కవి యిందు సృష్టితంత్రమునకును, జీవనమాధుర్యమునకును పట్టుగొమ్మయైన శృంగారమును సాంగోపాంగముగ చిత్రింప దలచెను. ఈ రచనా లక్ష్యమునకు ఏకనాయకమును, ఏకవస్తుకమును నయిన కుమార సంభవ కావ్యరంగము సువిశాలమై పాత్రోన్మీలనమునకును, కథాశిల్పమునకును, రసరామణీయక పరిపోషణమునకును జేయినిచ్చిన ఆనుకూల్యమును చేకూర్చినది. సాంఖ్య సిద్ధాంతము ఈతని శృంగార రచనమునకు ప్రోత్సాహకమై యుండవచ్చును. సృష్టితంత్రమునకు స్త్రీ, పురుషులిర్వురును ప్రకృతి, పురుషులకు ప్రతిబింబప్రాయులు. వారి కలయిక అనివార్యమై ప్రపంచప్రవృత్తికిని, లోకకల్యాణమునకును మూలకారణమగును. వారి వియోగము లోక సంగ్రహమునకే విరుద్ధమునయి, మానవ సంక్షోభ కారకమునయు భారతీయ తత్త్వదర్శనమువలన మనము గ్రహింపగలము. ఈ పరమార్థమునే యీ కావ్య ద్వితీయ సర్గమునందలి 7, 13, శ్లోకములు విశదీకరించును.

రఘువంశముతుదిని ఒకరాజు బలహీనతను, భోగలాలసతను శృంగారప్రతిపాదకముగా చిత్రించుటలో ఆతని చరిత్రయందలి స్త్రీలౌల్యమును, వ్యసనపరత్వమును చెప్పుటయందే కవికి తాత్పర్యము గాని యుత్తమగార్హస్థ్యమాధుర్యమును చిత్రించుట ప్రయోజనముగాదు.

---

* కాళిదాస కళామందిరము—3.

కుమారకావ్యమున స్త్రీ పురుషుల హృదయ తపఃఫలమును, మాధురీపూర్ణమునున్నైన పరిశుద్ధ దాంపత్యమును రససంపన్నముగ చిత్రింపగలిగెను. దానికి ఇంద్రియపరితృప్తియే పరమార్థముకాక సత్సంతానప్రాప్తియే ఫలశ్రుతియని ధ్వనింపజేసెను.

సృష్టిలీలకు మూలకారణములుగా భారతీయ వేదాంతమునందు నిరూపింపబడిన మాయి మాయలే మహేశ్వర పరాశక్తులు. వీరినే గీత, పరమపురుష పరాప్రకృతులుగా వర్ణించినది. ఈ పరాప్రకృతి అపరాప్రకృతివలె జడముకాక చిన్మయి. పరమపురుష ప్రోద్బలమున సర్వజగత్తును ధరించుచున్నది. ఈ పరమేశ్వర పరాశక్తుల వియోగసంయోగలీలాఖేలనమే కుమారసంభవమునకు మూలవస్తువు. ఈ తాత్త్వికాంశమునకు మహాకవి తన అమృతహస్తస్పర్శ నిచ్చి మాధురీమయకావ్యముగా మలచినాడు.

ఈ కావ్యమున ప్రతిపాదితమైన శృంగారమునకు గౌరీశంకరులు ఆలంబనములు. వీరు ఆలంబనములుగా ఏర్పడు రసాస్వాదనమునుగూర్చి ఇంచుక మెలకువ గలిగియుండవలెను. పరమార్థమున గౌరీశంకరులు జగత్పితరులైనను ఆ దృష్టితో కావ్యమును చదువ దొరకొన్నచో రసాస్వాదము దుర్లభమగును. కావ్య నాయికానాయకులందు అలౌకిక దైవబుద్ధి ఏర్పడినచో మానవసాధారణమైన సుకుమార భావస్ఫూర్తిగాని, కోమల సుఖదుఃఖానుభూతిగాని మృగ్యమైపోవును. కావ్యగత ప్రేయసీప్రియుల మృదు హృదయములనుండి వెలువడు ప్రేమసంగీతమును చట్టున విలుప్తమైపోవును.

కావ్య విద్యా గురువైన వాల్మీకి మహర్షి శ్రీరాముని భగవదవతారమని చెప్పినను ఆతని చరిత్ర చిత్రణమునందు ఆ ప్రసక్తి రానీయక అచ్చపు మానవత్వమునే చిత్రించి రసప్రవణమైన కావ్య ధర్మమును కాపాడెను. అట్లే కాళిదాసును గౌరీ శంకరులను జగత్పితరులనుగా సంభావించినను ప్రపంచ సృష్టికర్తలైన ఆ దివ్యమూర్తులను మానవీయ కోమల హృదయానుభూతులతో, ఖేద మోదములతో పునస్సృష్టి గావించెను.

ఇందలి శృంగార రసాలంబమైన గౌరీదేవి సౌందర్యలహరియై నిండు యౌవనమునందెను. హైమవతీ సౌందర్యము నుగ్గడించుటలో ఉపనిషత్తుసైతము నుపేక్షింపలేక ఇట్లనెను.

'...బహుశోభమానాం ఉమాం హైమవతీం
తాం హోవాచ కి మేత ద్యక్షమితి' కేన. తృ. 12

రామణీయకోపాసకుడైన కవి ఆ స్ఫూర్తి నందుకొని గౌరీ సౌందర్యము నిట్లు చిత్రించెను.

'ఉన్మీలితం తూలికయేవ చిత్రం
సూర్యాంశుభి ర్భిన్న మివారవిందమ్ ।
బభూవ తస్యా శ్చతురశ్రశోభి
వపు ర్విభక్తం నవయౌవనేన॥' 1—32.

నవయౌవనముతో కూడిన పార్వతి శరీరము కుంచెచే విప్పారిన చిత్రపటమువలె, సూర్యకిరణములచే వికసించిన పద్మమువలె హెచ్చుతగ్గులు లేకుండ శోభించెను.

ఇట్టి పార్వతీ సౌందర్యమును కవి ఇట్లు ఉత్ప్రేక్షించెను.

'సర్వోపమాద్రవ్యసముచ్చయేన
యథాప్రదేశం వినివేశితేన ।
సా నిర్మితా విశ్వసృజా ప్రయత్నాత్
ఏకస్థసౌందర్య దిదృక్షయేవ॥. 1—49.

విధాత, ఒక్కచోటికి ప్రోగుచేసిన సౌందర్య సర్వస్వమును చూడదలచినట్లు ఏచోటున నుంచవలసిన ఉపమాద్రవ్యము నాచోటనుంచి ప్రయత్నపూర్వకముగా నామెను సృజించెను.

కావ్యనాయకుడు శంకరుడు ఒకనాడు హిమవత్పర్వతమునకు వచ్చి అందొక సానువున నివాస మేర్పరచుకొనెను.

'స కృత్తివాసా స్తపసే యతాత్మా
గంగాప్రవాహోక్షిత దేవదారు
ప్రస్థం హిమాద్రే ర్మృగనాభిగన్ధిః
కించి త్క్వణత్కిన్నర మధ్యువాస॥ 1-54.

చర్మాంబరధారియును, యతచిత్తుడును అగు మహేశ్వరుడు గంగాప్రవాహములచే తడియుచున్న దేవదారుమూలములు గలిగి కస్తురిచే పరిమళించునట్టియు, అలతియలతి కిన్నరగానముతో హృద్యమగునట్టియు హిమసానువు నధిష్ఠించెను.

భావోద్దీపకములైన సుందరదృశ్యములును, కస్తూరీ పరిమళములును, కిన్నరసంగీతములునుగల హిమవత్పర్వతపు చరియయందు తపస్సు కొనసాగుననియే వచ్చెనా? అచటి సామగ్రియంతయు తపోవిరుద్ధము కాదా! అని స్థూలదృష్టికి తోచినను కవిహృదయమునందలి ఒకానొక చమత్కారవిలసనము పర్యాలోచించినమీదటగాని తెలియదు. సామాన్య తపశ్శీలుర కది విరుద్ధమే. కాని ఆ కృత్తివాసునకు, యతచిత్తునకు ఆ సామగ్రి యేమియు బాధకము కాదు. అంతియేకాక ఆ ప్రదేశము అపూర్వమైన అనురాగాభివ్యక్తికిని, సరససన్నివేశములకును, రంగస్థలము కాబోవుచున్నదనియు ధ్వనితమగును.

'స్వయంవిధాతా తపసః ఫలానాం
కేనాఽపి కామేన తప శ్చచార॥ 1-67.

ఇతరులు చేయు సర్వతపస్సులకును ఫలప్రదాతయగునాతడు ఏదో కోరికతో తపస్సు చేసెనట! ఏమి చమత్కారము! ఆ మహాతపస్వికి తన ప్రేమసర్వస్వము ఆ గిరిరాజ భవనమున ఉన్నదని తెలియును. అచట నిలుచుటయే ఆతనికి ప్రీతిపాత్రము. అంతరాంతరములలోని ఆ భావము అవ్యక్తమధురము. దాని నెవ్వరు కనుగొనగలరు? క్రాంతదర్శియైన కవియే కనుగొనగలడు! కనుగొన్నను పక్వదశ వచ్చువరకును ఆతడును చెప్పక 'కేనాఽపి కామేన' అని చమత్కరించి విడుచును.

తరువాత గిరిరాజు మహేశ్వరునియెదుట ప్రత్యక్ష మయ్యెను. ఆతడొక్కడేనా? కాదు. జయ విజయ అను నిరువురు చెలికత్తెలతో కూడిన తన పుత్రిక గౌరితో ఎదుట నిలిచి ఆమెసేవ అందుకొని అనుగ్రహింపు మని చెప్పి యొప్పగించెను. ఆ ప్రదేశమునందలి భావోద్దీపన సామగ్రియేకాక ఇప్పు డీ సుందరీసేవాసంపత్తినిగూడ ఆతడేల స్వీకరించెను?

'వికారహేతౌ సతి విక్రియన్తే
యేషాం న చేతాంసి త ఏవ ధీరాః' 1-59

ఆ తపస్వి మహాధీరుడు. వికారకారణములకు జెదరువాడు కాడు. గౌరినిత్యసేవాకార్యక్రమము ప్రారంభమైనది.

'గిరిశ ముపచచార ప్రత్యహం సా సుకేశీ' 1-69

ఆ నీలవేణి నిత్యమును శంకరుని ఉపచరింప దొడగెను.

ఇట్లు నాయికానాయకులను కథాసందర్భమున ఒక్కచోట సమావేశపరచి తన రసస్పష్టికి కవి చక్కని ఆధారభూమిని నిర్మించుకొనెను.

హిమసానువున ఉదారచిత్తుడును ప్రణయిప్రియుడును అగు శంకరుడు నివసించియున్నాడు. సౌందర్యమూర్తి గిరిరాజసుత నిత్యమును ఆతనికి పరిచర్యలు చేయుచుండెను. అచట కస్తూరీపరిమళము అలముకొని యుండెను కిన్నరసంగీతము పూలవాసనవలె మత్తుగొలుపుచునే యుండెను. ఈ ఉద్దీపకసామగ్రి చాలదో యన్నట్లు అచటికి వసంతముకూడ అవతరించెను.

'సంకల్పయోనే రభిమానభూతం
ఆత్మాన మాదాయ మధుర్జజృమ్భే॥' 3-24

వసంతము జంగమహృదయములను తట్టి లేపుటయేకాక స్థావరములనుసైతము రాగరంజితము లొనర్చెను.

పర్యాప్త పుష్పస్తబక స్తనాభ్యః
స్ఫురత్ప్రవాళోష్ఠ మనోహరాభ్యః
లతావధూభ్య స్తరవోఽ ప్యవాపుః
వినమ్రశాఖా భుజబంధనాని॥' 3-39

సిందువారగుత్తు లనెడు పాలిండ్లుగలిగినవియు, ఒప్పులొలుకు లేతచివుళ్లనెడు అధరోష్ఠములు గలిగినవియు నగు లతలవలన తరువులును కౌగిలింతల నందినవి. ఇందలి వసంతోద్దీపన విశేష మిట్టిది:—సాధారణముగా శృంగారానుభవమున పురుషుల ముందంజ ప్రసిద్ధము. కాని ఇచట స్త్రీలే స్వయంగ్రాహమునకు సిద్ధపడుచున్నా రనగా ఈ వసంత విజృంభణ మెంతటిదో ఊహింపవచ్చును. ఇందు లతల రాగాధిక్యము తరువులకువలె తటస్థుడైన శివునకు గౌరీసౌందర్యము గిలిగింతలు పెట్టిన దనియు స్ఫురింపక మానదు.

ఆ మనోహరప్రదేశమున సగర్వముగా కాముడు ప్రవేశించి స్వేచ్ఛాసంచారము చేయదొడగెను. అతడు సవిలాసముగా పరమశివునిగూడ సమీపింప దలచెను. కాని మనస్సుచేగూడ చెనకరాని ఆ నిష్ఠాగరిష్ఠుని చూచి వాని ఉత్సాహము దిగజారిపోయెను. కాని ఇంతలో వినష్టప్రాయమైన ఆ కామశక్తిని తన తనూ సౌందర్యముచే పురిగొల్పుచు గిరిరాజకుమారి అచ్చటి కవతరించెను.

'అశోక నిర్భర్త్సిత పద్మరాగం
అకృష్ట హేమద్యుతి కర్ణికారం
ముక్తాకలాపీకృత సింధువారం
వసంత పుష్పాభరణం వహన్తీ' 1–53

అనంతరత్నఖనియగు హిమరాజపుత్రికకు స్వర్ణరత్నాలంకారములు కరవయ్యెనా? కాదు. ఆనాడామె సహజసుగంధకోమలములైన పూవులనే నిలువెల్ల ధరించి రూప మెత్తిన వసంతలక్ష్మివలె వచ్చినది పరమ సంయమీంద్రుని యొద్దకు పోవుచు కనుల మిరుమిట్లుగొలుపు ఇంత కైసేత ఎందులకు? ఏమో, ఆ కోమలాంగి హృదయాంతరాళమున ఏ సన్నని మధురభావ మున్నదో ఎవ్వరికి తెలియును? వసంతమున విరియబూచిన పద్మరాగ శోభావంతములైన అశోకపుష్పములను బంగరురంగు దువాళించు కర్ణికారకుసుమములను ముత్తెపుసరులను మించిన సింధువారలతాంతములను ఆమె అలంకరించుకొనియుండెను.

గిరికుమారి తిన్నగా శివసన్నిధికి వచ్చి ఆతని పాదములకు చివుళ్లతోగూడిన పుష్పాంజలి సమర్పించెను.

'ఉమాఽపి నీలాలకమధ్యశోభి
విస్రంసయంతీ నవకర్ణికారం।
చకార కర్ణచ్యుతపల్లవేన
మూర్ధ్నా ప్రణామం వృషభధ్వజాయ॥
3–62.

ఆమె నల్లని ముంగురులందలి పచ్చని కర్ణికారపుష్ప మించుక జారగా చెవియందలి లేజివురు నేలవ్రాలగా తలవంచి ఆ పరమేశ్వరునకు నమస్కరించెను.

'అనన్యభాజం పతి మాప్నుహి' అని అమోఘవచనుడైన శంకరు డాశీర్వదించెను. ఇంత చక్కని సంఘటనమును తాను వినియోగించుకొనకుండ కాముడు విడుచునా! ఆతడు తలయెత్తెను!

ఆ సమయమున సొంపులొలుక తాను నిర్మించిన పుష్కర బీజమాలను గౌరీసుందరి శివునకు సమర్పింపగా స్నేహప్రియుడైన శంకరుడు చేయిచాచి దానిని స్వీకరింపదొడగెను. అదే యదనని కాముడు తన సమ్మోహనాస్త్రమును వారిపై ప్రయోగించెను. మహాకవి ఇచట తన రసజ్ఞతను, ఔచిత్యమును ప్రదర్శించుచు చిత్రించిన చిత్రము దర్శనీయము

'హర స్తు కించిత్పరిలుప్తధైర్యః
చంద్రోద యారమ్భ ఇవాంబురాశిః
ఉమాముఖే బింబఫలాధరోష్ఠే
వ్యాపారయామాస విలోచనాని॥' 3–67.

చంద్రోదయ ప్రారంభమున సముద్ర మించుక కలవరపడినట్లు ఆ పరమశివుడు కొంచెము ధైర్యము చెదరి దొండపండువంటి పెదవిగల గౌరీముఖమున సాభిలాషముగా తన చూపులను ప్రసరింపదొడగెను'—ఇందు సముద్రగంభీరుడైన శివుని హృదయమును మధురచంద్రోదయమువంటి పార్వతీముఖము ఇంచుక కలవరపరచినది. ఆ రసగంగాధరుని ఆర్ద్రహృదయమున రతిభావ ముదయించెను. కనుకనే అంతవరకు

తన తపస్సమాధిలో వెలుగు అక్షరజ్యోతిని దర్శించిన ఆ కన్నులు ఉమాముఖమున ముగ్ధములైనవి దీనికి ప్రత్యుత్తరముగా శైలబాల హృదయముతోగూడ శరీరము పులకించెను.

'వివృణ్వతీ శైలసుతాఽపి భావం
అంగైః స్ఫురద్బాల కదంబకల్పైః।
సాచీకృతా చారుతరేణ తస్థౌ
ముఖేన పర్యస్తవిలోచనేన ॥ 3-68

ఆమెయును తన యనురాగమును వ్యక్తపరచుచు సిగ్గు తొణకిసలాడు చూపులతో ముఖము ప్రక్కకు త్రిప్పుకొనెను. ఇట్లు కవి తన నాయికానాయకులందలి ప్రథమానురాగమును విపులముగ చిత్రించి కథను మలుపుత్రిప్పెను.

మహేశ్వరుడు ఇంద్రియక్షోభమును నిగ్రహించి కాముని దహించెను. ఈ లోకోత్తర రాగిరాగిణీ జీవనములందు ఆస్పదము సంపాదింపవలసినది సుస్థిర ప్రేమముగాని చంచలకామము గాదు. అందులకు ఒండొరుల హృదయమున ఈ ప్రేమము బహుధా భావితమును సంభావితమును గావలెను. అట్టిప్రేమము అశ్రమముగా కాక అపూర్వ తపః ఫలముగా లభింపవలెను అందులకై ఈ ప్రేయసీ ప్రియుల ప్రణయము తాత్కాలికముగ విచ్ఛిన్నప్రాయమైనది.

కాముని పుష్పబాణము శంకరుని హుంకారముచే తిరస్కరింప బడినను అది పార్వతిహృదయమును బాధింపజొచ్చెను. ఆమె పరమేశ్వరునియందు లగ్నమైన తన మనస్సును త్రిప్పుకొనలేక విరహవేదనకు గురి యయ్యెను. ఎన్ని శైత్యోపచారముల చేతనైనను ఆమె హృదయమునకు శాంతి కలుగలేదు. ఆమె అలవోకగా వనమున సంచరించుచు చటుక్కున తన ప్రియుడు జ్ఞప్తికి రాగా పారవశ్యమున అతని లీల నొకటి పాడదలచి కంఠమెత్తెను. కాని అతని వియోగము తన హృదయమును కలతపెట్టగా కన్నీటితో కంఠమునందు పాట పలుకక తొట్రుపడెను. అది చూచి చెంతనున్న చెలిమికత్తెలు కిన్నర రాజకన్యకలు తామును కంటనీరిడికొనిరి. ఆమె విరహవేదన మతిశయించినది. కన్నులకు నిద్ర కరవయ్యెను. రాత్రి తుదిజామున ఇంచుక కన్నుమూసి వెంటనే మేల్కొని 'నీలకంఠా! నన్ను విడిచి ఎచ్చటికి పోయెదవు' అని వట్టిబయలును కౌగిలించుకొనుచు ఎన్నిరోజులు గడపినదో చెప్పలేము. చేతులార ప్రియుని చిత్రమును లిఖించి 'ఏమయ్యా, చంద్రశేఖరా! వేత్తలు నిన్ను సర్వవ్యాపివని చెప్పుదురు. నీయం దింత అనురాగముగల నన్నే ఎట్లెరుగకున్నావు' అని రహస్యమున ఉల్లసము లాడుచుండెడిది. ఈ గాఢసంతాపమునకు పరమశివుని కృప యొక్కటియే శాంతికరమని నిశ్చయించుకొనెను. కాని ఆ దుర్లభుని చేరుటెట్లు? భువనసమ్మోహకమైన తన సౌందర్య మాసంయమివద్ద నిష్ఫలమాయెను. ఆతనిని వశము చేసికొనజాలని ఈ రూపసంపద ఎందులకు?

'నినింద రూపం హృదయేన పార్వతీ
ప్రియేషు సౌభాగ్యఫలా హి చారుతా' 5-1.

స్త్రీ సౌందర్యమునకు ఫలము ప్రియుని సంప్రీతి గదా! తన కా భాగ్యములేదు. స్త్రీ లావణ్యతేజమున కాతడలితుడు. గాఢగాఢమైన హృదయసౌందర్యమే ఆతని ప్రసన్నుని చేసికొనగలదు. దానికి ప్రేమతప మొక్కటే శరణ్యము.

'ఇయేష సా కర్తు మవంధ్యరూపతాం
సమాధి మాస్థాయ తపోభి రాత్మనః।
అవాప్యతే వా కథ మన్యథా ద్వయం
తథావిధం ప్రేమ పతి శ్చ తాదృశః॥' 5-2

ఆ పార్వతి ఘోరతపస్సుచేసి తన సౌందర్యమును సార్థకము చేయదలచెను. తపింపక దుర్లభుడైన అట్టి భర్తగాని, అట్టి ప్రేమగాని ఎట్లు లభ్యమగును? అని నిశ్చయించుకొనెను ఈ రెండిటి విశేషమేమనగా ఈ ప్రేమ, సగము శరీరమునే పరిగ్రహించునట్టిది. ఈ భర్త మృత్యుంజయుడు. స్త్రీకి ఎన్నడును ప్రియునెడబాయని ఉనికియును, నిత్యసువాసినీత్వమును తప్ప లోభనీయము వేరొకటి ఉండదుగదా!

పార్వతి ఇల్లు విడచి అడవిలో తపోదీక్ష వహించెను. సుకుమారి యయ్యును షడృతువులందును బాధాకరము లైన నియమముల నవలంబించి తపించినది.

శివానుగ్రహము వచ్చినది. ముందు కపట వటురూపమున పరీక్షించినను భావజ్ఞుడైన ప్రసన్న శంకరుడు ఆమె ననుగ్రహించి స్వరూపముతో సాక్షాత్కరించెను.

కపటవటువు సేయు శివదూషణమునకు కంట గించుకొని అటనుండి పార్వతి పోబోవునప్పుడు కవి చిత్రించిన సన్నివేశము ఒక లోకోత్తర చిత్రపటము. ఈ చిత్రమున కవి వివర్ణములైన వర్ణములనుగాని, మూగిరేఖలనుగాని ఉపన్యసింపక అక్షరములైన భావ వర్ణములను, సజీవరేఖలను ఉపయోగించి తన రచనా ధురీణతను వెల్లడించుటయేకాదు; ఈ బొమ్మనుండి హృదయసంగీతమును వినిపించెను.

'ఇతో గమిష్యా మ్యథ వేతి వాదినీ
చచాల బాలా స్తనభిన్నవల్కలా ।
స్వరూప మాస్థాయ చ తాం కృతస్మితః
సమాలలంబే వృషరాజకేతనః॥.' 5-84

'ఇటనుండి పోవుదును'— అని చెప్పుచు పార్వతి ఆ తొందరలో పాలిండ్లపైనుండి పయ్యెద కించుక జారగా కదలెను. ముఖమున లేతనవ్వు తొలుకాడ నిజరూపముతో పరమశివుడు పార్వతిని పట్టుకొనెను.

'తం వీక్ష్య వేపథుమతీ సరసాంగయష్టిః
నిక్షేపణాయ పద ముద్ధృత ముద్వహన్తీ
మార్గాచలవ్యతికరాకులితేవ సింధుః
శైలాధిరాజతనయా న యయౌ న తస్థౌ॥' 5-85

తలవని తలంపుగ ప్రత్యక్ష మైన తన తపఃఫలమును చూచి గిరికుమారి శరీర మించుక వణకెను. మేను చెమర్చెను. నడచిపోవుటకు ఎత్తిన పాదమును ఎత్తి నట్లే యుంచి, తన త్రోవలో కొండ ఎదురువడగా కలతచెందిన నదీకుమారివలె ఆ పార్వతి నడువలేదు. నిలువలేదు.

మరి ఏమి చేసెను? అది రసజ్ఞుడైన పాఠకులకు తెలియవలెను. లోకోత్తరులైన ప్రేయసీ ప్రియుల ప్రణయమాధుర్యమును అనన్యాదృశ ప్రజ్ఞతో చిత్రించిన కవి వాక్కు ధన్యమైనది. కావ్య రసజ్ఞునకు కావలసినంత మధుభిక్ష దొరికినది.

తండ్రిచాటుబిడ్డ గౌరి తన వివాహము తండ్రి యనుజ్ఞతో జరుగవలెనని చెలికత్తెచే చెప్పింపగా శంకరుడు వివాహ నిశ్చయమునకై సప్తమహర్షులను గిరిరాజుకడ కంపెను. తండ్రితో వారు చెప్పుచున్న మాటలు విని శ్రీ గౌరి చిన్నారిసిగ్గులుపోవుట ఒక రమణీయ దృశ్యము.

'ఏవం వాదిని దేవర్షౌ పార్శ్వే పితు రధోముఖీ
లీలాకమలపత్రాణి గణయామాస పార్వతీ॥'
6-84.

ఇందలి 'పితుః, పార్శ్వే' 'అధోముఖీ' 'కమలపత్రాణి గణయామాస' అను మాటలలోని భావధ్వని రసోన్ముఖమై పలువు రాలంకారికులకు స్పృహణీయము ఐనది.

కాముని భస్మావశిష్టుని చేసిన సంయమి పార్వతీ సమాగమవిరహమును సహింపలేక రోజులు లెక్కపెట్టెనని ఆ మహాదేవునిలోని సుకుమార మానవతాస్ఫూర్తిని కవి చతురముగా చిత్రించెను. 6—95.

శివపార్వతీకల్యాణమైనది. ఎడబాయని వాగర్థములవలె కలసికొన్న వారి అన్యోన్యానురాగమును కవి యిట్లు వర్ణించి కృతార్థుడయ్యెను.

'భావసూచిత మదృష్టవిప్రియం
కైశ్చిదేవ దివసై స్తదా తయోః
చాటుమత్ క్షణవియోగకాతరం
ప్రేమరూఢ మితరేతరాశ్రయమ్॥' 8-15.

కల్యాణమైన కొద్దిరోజులలోనే, చేష్టలచే తెలియ దగినదియును, అప్రియము తలయెత్తనట్టిదియును, ప్రియసంభాషణములతో కూడినట్టిదియును, క్షణ మైనను విరహమును సహింపనట్టిదియును అగు

ప్రేమ ఆ దంపతులకు ఒకరిపై నొకరికి స్థిర పడినది.

ఇందు సర్వాంగపరిపోషము నందిన వేరొక రసము కరుణము. రఘువంశమునందలి అజవిలాపము నకు ప్రతిరూపముగా ఇందు రతివిలాపము వర్ణిత మైనది. రఘువంశమున గంభీరహృదయుడైన అజుని కరుణరసచిత్రణమునకును, ఇందలి కుసుమసుకుమార హృదయ రతికరుణమునకును విస్పష్టమైన భేదము కాన్పించును. ఇచట మన్మథవినాశము ఎంత దారుణ ముగ జరిగెనో తత్త్వయుక్తమైన రతిశోకమును అంత హృదయవిదారకముగా నున్నది.

మన్మథపత్ని యగు రతి హృదయమునందలి తీవ్రశోకమును, తజ్జనితములైన ఆమె పరిదేవనములును స్వప్రియ స్మృతులందలి తీవ్రవేదనమును పాఠకమనస్సులందు కరుణ-రసోత్పాదకము లగుచున్నవి.

రుద్రదేవుని మూడవ కంటిమంటకు కుసుమ ధన్వుడు భగ్నమగినంతనే రతి స్మృతితప్పి మూర్ఛ వోయినది. పిమ్మట కొంతసేపటికి తేరుకొని నెమ్మదిగ కన్నులు విచ్చి చూడగా ఎట్టయెదుట పురుషాకృతిగల భస్మరాశి కాన్పించెను.

'అథ సా పున రేవ విహ్వలా
వసుధాలింగన ధూసరస్తనీ।
విలలాప వికీర్ణమూర్ధజా
సమదుఃఖా మివ కుర్వతీ స్థలీమ్॥. 4–4

ఆ భస్మమును చూడగనే ఆమె విహ్వలయై ఒక్క పారిగా దానియందు పడి పొరలాడెను. మృదులమైన ఆమె వక్షస్సీమయందంతటను ఆ బూది యలము కొనెను. కేశపాశము-విడి చెల్లాచెదరుకాగా అచటి భూమినిసైతము తన వెంట విలపింపజేయు చున్నట్లు ఆమె దుఃఖించెను. పిదప నిట్లనెను,

'హృదయే వససీతి మత్ప్రియం
యదవోచ స్తదవైమి కైతవమ్।
ఉపచారపదం న చే దిదం
త్వ మనఙ్గః కథ మక్షతా రతిః॥ 4– 9

నీవు నా హృదయములోనే ఉన్నావు అని ఒకప్పుడు నీవు నాతో ప్రీతిగా పలికినమాట అసత్యమని ఇప్పుడు తెలిసినది. అది ముఖప్రీతిమాట కానిచో నీవు పోయినమీదట నీ మనస్సునందలి రతి ఎట్లు జీవించియున్నది? అని బేలగా ప్రశ్నించి పలవించెను.

'రచితం రతి పండిత త్వయా
స్వయ మఙ్గేషు మ మేద మార్తవమ్।
ధ్రియతే కుసుమప్రసాధనం
తవ తచ్చారు వపు ర్న దృశ్యతే॥' 4 – 18

'నీవు చేతులార చేసిన వసంతపుష్పాలంకారము ఇదిగో ఇంకను నా శరీరము నందున్నది. అలంక రించిన నీవు ఇంతలోనే అదృశ్యమైతివా?' అని తలచికొని తలచికొని దుఃఖిల్లినది.

కొంతసేపటికి మన్మథమిత్రుడు వసంతుడు నెమ్మదిగా ఆమె ఎదుటికి వచ్చెను అతని చూచిన తోడనే ఆమెదుఃఖము పొంగిపొరలెను.

'త మవేక్ష్య రురోద సా భృశం
స్తనసంబాధ మురో జఘాన చ' 4 – 26

ఆమె అతనిని చూచి పొలిం డ్లదరునట్లుగా, రొమ్ము బాదుకొని ఏడ్చెను. తరువాత భర్త పోయిన అగ్ని మార్గముననే తానుకూడ ననుగమింతు నని ఆపతి మిత్రుని చితి పేర్చు మని కోరినమాటలు హృదయ విదారకములు.

'కుసుమాస్త్రరణే సహాయతాం
బహుశః సౌమ్య గత స్త్వ మావయోః।
కురు సంప్రతి తావ దాశు మే
ప్రణిపాతాంజలియాచిత శ్చితామ్॥' 4-35

సజ్జనుడా, నీవు మా ఇరువురి పుష్పశయ్యకును ఎన్నోసారులు సహాయము చేసిన స్నేహశీలివి. నే నిప్పుడు నిన్ను దోసిలియొగ్గి వేడుకొనుచున్నాను. దయచేసి ఆ చేతులతోడనే నాకు చితిపేర్చుము.'

వెంటనే ఆమె కొక అశరీరవాణి ఇట్లు విని పించెను.

'కుసుమాయుధపత్ని, దుర్లభః
తవ భర్తా న చిరం భవిష్యతి॥' 4–40

'మన్మథపత్నీ, అచిరకాలములో నీ భర్త నీకు లభింపగలడు'

కాళిదాసు పురాణకథను తన కావ్యవస్తువుగా స్వీకరించినను కథా కవితా నిర్వహణములో అనల్ప చాతురిని ప్రదర్శించెను.

ప్రథమసర్గలో హిమవత్పార్వతీ వర్ణనములు అధికభాగము నాక్రమించినను అందు తుదిని చేసిన కథాప్రస్తావము క్రమముగా సాగి తృతీయసర్గలో ఇంద్రమన్మథప్రసంగము, మన్మథప్రయాణము, వసంతవిజృంభణము, పార్వత్యాగమనము, శివక్రోధము, మదనదాహము, శివనిష్క్రమణము మున్నగు సంశములు ఘటనపై ఘటనగా కథకు వెలుగును వేగమును ప్రసాదించినవి. పిమ్మట చతుర్థమున రతివిలాపమును—శోకతప్త రతిదేవిఎదుట వసంతుడు ప్రత్యక్షమగుటయు, ఆకాశవాణి మదనపునరుజ్జీవనాశ కలిగించుటయు ఉత్సుకతకు కారణములై కథకు నాటకీయచమత్కారమును కలిగించినవి. అది పంచమమున బ్రహ్మచారి ప్రవేశ పార్వతీ సంవాదాదులతో పుష్టి నంది శివసాక్షాత్కార కల్యాణ ఘట్టములతో ఉచ్చస్థితి నందుకొని పార్వతీ పరమేశ్వర సంయోగముతో సమాప్తి నందినది.

గిరిజాశంకరకల్యాణవర్ణనముతోనే ఈ కథ ముగింపబడుట, ఎత్తిన కథ ఎత్తుగడకు సరియైన సమాప్తియేనా? యని పలువురు ప్రశ్నింతురు. ఈ సందేహముతోనే వేరొక కవి మరి తొమ్మిది సర్గలు రచించి దీనికి అదికించుటయును జరిగినది. కథోపక్రమణికనుబట్టి కుమారుడు పుట్టుటయు, తారకాసుర సంహారము జరుగుటయు ఇందు వర్ణ్యము అగుట ఉచితము అని ముందు తోచినను నిశితముగ నాలోచింపగా ఈ కావ్యమునకు కుమారసంభవ మని పేరుగాని కుమార విజయ మని కాదనియు, పార్వతీ పరమేశ్వర కల్యాణమే కుమారసంభవమునకు సూచనము కనుక పైకథ కవి వర్ణింప నవసరము లేదనియు స్ఫురింపకపోదు.

రఘువంశము అగ్నివరుని శృంగారవర్ణనముతో రథోద్ధతావృత్తముతో ముగిసినట్లే ఈ కుమారసంభవము కూడ శృంగారవర్ణనముతో రథోద్ధతావృత్తముతో ముగియుట చూడగా కథకు పాఠకు లూహించిన సమాప్తి నీయక సూచనాప్రాయముగా విడుచుట కాళిదాసపద్ధతియేమో అనిపించుచున్నది.

బ్రతుకు తెరలు

శ్రీ గంధం జోయెల్

ఆశలకు పచ్చని
పందిళ్ళు వేయడం
నీ వనుకున్నంత
సులభ సాధ్యంకాదు
కోర్కెల్ని యినుప
గొలుసుల్తో కట్టినా
పారిపోతూ వుంటే
పట్టుకోలేవు సరికదా,
పడిపోతావు జాగ్రత్త !

జీవితం చంద్రబింబం
దూరాన్నుంచి తిలకిస్తే
సుందరంగా కన్పిస్తుంది
కాలూనితే, కనువిప్పితే
గోతులూ; గండుశిలలు !

ఎన్నిసార్లు చెప్పాను
పగిలిన గుండెలు
పాడే గీతంలో మా
ధుర్యం ఏకోశానా లేదని
వికావికలైన మనస్సుని
వెన్నతో మాటి మాటికి
జోడించవద్దు, పొమ్మని

అడుగడుగున ఎదు
రువచ్చు అపజయాలకు
ఏ దుప్పటి కప్పాలి ?

భరోసా కలగాలంటే
బ్రతిమాలి ఏ నీతి శత
కాల్ని విప్పిచెప్పాలి!

వ్యథలకు ఉదాసీన
వదనుడవై, బానిసవై
జీవించటం సహించలేను

ఈ బ్రతుకు భారం దించి
నీకు స్వేచ్ఛ ప్రసాదించాలని
క్రొత్త ప్రాంగణంలో
ముగ్గులు పెట్టాలని
కరవాలం దించి, శాంతి
కలాన్ని చేపట్టాలని
నీ నయనాల కన్నీటిని
పన్నీరుగా మార్చాలని
ఆదర్శాల ఛత్రంతో ని
న్నాదుకోవా లనుకొని
ప్రయత్నించాను!
ప్రబోధించాను!;

అయితే నేస్తం!
బ్రతుకు లోతైన బావి.
ఆనందం అందని నీరు.
దాహం తీరాలనుకుంటే
అనుభవం చేంతాడుపట్టి
నీరు తోడుకొని త్రాగాలి!

ఆశలకు పచ్చని
పందిళ్ళు వేయడం
అంబరానికి నిచ్చెన
వేయడం లాంటిది

అనూర్జితం జీవితం!
అనుశాయి మానవుడు!!

తెలుగులో వచనకవిత

శ్రీ టి. ఎల్. కాంతారావు

ఆంధ్రసాహిత్య పరిణామక్రమంలో కాలానుగుణమైన సాహితీ ప్రక్రియలు అనేకం పుట్టాయి. ఒక్కొక్కకాలంలో ఒక్కొక్క ప్రత్యేకమైన సాహిత్య ప్రక్రియ అభివృద్ధి చెందింది. గడిచిన కాలాల్లో సాహిత్యంలో సంభవించిన మార్పులను గజగమనంతో పోలిస్తే ఇరవయ్యో శతాబ్దంలో ఆంధ్ర సాహిత్యంలో వచ్చిన విప్లవ పరిణామాల్ని అశ్వగమనంతో పోల్చవచ్చు. ఈ మార్పులన్నీ కూడా తత్కాలంలో విలసిల్లిన సామాజిక జీవనదృక్పథానికి అభిముఖంగా సాగిపోయాయని విమర్శకాభిప్రాయం. కొన్నికొన్ని అంశాలలో ఈ అభిప్రాయం వివాదగ్రస్తమైనప్పటికీ సమస్తంవిూద ఆలోచిస్తే కొంతవరకూ నిజమని అంగీకరించక తప్పదు. ఇలా ఎందుకు అభిప్రాయపడవలసి వస్తోందంటే నాటికవులు తమ కాలంనాటి యథార్థ సమాజగతిని పూర్తిగా దర్శించలేక పోయారు. రాజాస్థానాలలో, రాజమర్యాదలతో జీవించిన కవులు ఆ రాజుల సాంస్కృతిక జీవిత విధానాన్ని, వారి వంశ గౌరవాన్ని, వారి అభిరుచుల్ని వర్ణిస్తూ తమ వైయక్తిక జీవితంలోని రసానందాన్ని చిత్రించారు. అంతేగాని తాము ఉన్న స్థితిలోంచి కొంచెం క్రిందకుదిగి తమను, తమ నాదరిస్తున్న రాజకుటుంబాల్ని మినహాయించిన సంఘ వ్యవస్థను వాళ్ళు చూడలేదు. అంటే ఆనాటికవులు పున్నమినాటి చంద్రకాంతినే దర్శించారు కాని అమావాశ్య నాటి గాఢాంధకారాన్ని చూడలేక పోయారు. అంచేత పురాణప్రబంధయుగాలు రెండూ కూడా సాహిత్యంలో తమకాలంనాటి సాంఘిక జీవితంలో ఒకకోణాన్ని మాత్రమే చిత్రించి రెండో కోణాన్ని వదిలేశాయి.

పద్యకవిత నాటిసంప్రదాయ జీవనానికి అనుకూలంగా సాగిపోయింది. సూక్ష్మమైన విషయాల్ని మినహాయిస్తే ఆనాటి సమాజం యావత్తూ కొన్ని సంప్రదాయాలకి లొంగి జీవించింది. జీవితంలో జీర్ణించుకుపోయిన సంప్రదాయమే సాహిత్యంలోకూడా విస్తరించింది. కొన్నికొన్నియుగాల్లో అక్కడక్కడా కొన్నిమార్పులు సంభవించినా ఆ మార్పులు విప్లవానికి దారితీయలేదు; సంప్రదాయ విచ్ఛిత్తికి, శైథిల్యానికి దారితీయలేదు. సంప్రదాయయుగంనాటి సాహిత్యోద్దేశం వేరు. సాహిత్యం అందరికీ అందుబాటులో ఉండాలనే సిద్ధాంతం ఆనాడు ఆలోచనలో గాని, ఆచరణలోగాని లేదు. సంప్రదాయ ఛందస్సు ఆదరింపబడటానికి ముఖ్యమైన కారణం—జ్ఞాపకం ఉంచుకోవటం. నాడు ముద్రణశాలల్లేవు; కాగితాల్లేవు; కలాల్లేవు. తాటాకులపై గంటములతో రాయబడిన కవిత ఛందోబద్ధంగా లేకపోతే నిలవదని వారి నమ్మకం కావచ్చు. అదీకాక పద్యకవితలోఉన్న ఇంకొక గొప్పవిషయమేమిటంటే — పద్యరచనావిధానమెలా ఉన్నప్పటికీ శ్రావ్యంగా పాడటంలో వినేవాడికి అందంగా ఉంటుంది; ఆనందంగా ఉంటుంది. అంటే రచనాశిల్ప ప్రాధాన్యం ఇక్కడ కొంతవరకూ తగ్గినా ఇబ్బందిలేదు. శిల్పం లోపించినప్పటికీ రాగంద్వారా రసానందాన్ని కలుగజేసే శక్తి పద్యానికున్నది. పద్యం వినటంద్వారా లేక రాగయుక్తంగా చదవటంద్వారా పొందే అనుభూతి స్వచ్ఛమైనదికాదు. దీనిలో కొంత భాగం కంఠమాధుర్యానిది, లయాన్వితమైన రాగాలాపనదీను.

విషయపరంగా శతాబ్దాల సాహితీ సంప్రదాయాన్ని ఆధునికభావకవులు ఎదిరించారు. 'దిగిరాను

దిగిరాను దివినుండి భువికి నవ్వుపోదురుగాక నాకేటి సిగ్గు నా ఇచ్ఛయేకాక నాకేటి వెరపు' అన్నారు కృష్ణశాస్త్రి. ఇది వైయక్తికమైన స్వేచ్ఛాకాంక్ష. వే కవియొక్క ఆత్మాశ్రయత్వ అతిశయం 'జగమునేలిన స్వేచ్ఛాఝరుడనౌతు' అనటంలో అతనియొక్క స్వేచ్ఛాప్రియత్వం అర్థం అవుతోంది. అయితే భావకవులు సాధించిన స్వేచ్ఛావహానికి ప్రవాహవేగమే అర్థమయింది కాని విప్లవస్థితిలోని లోతు అర్థం కాలేదు. భావకవులు సాధించిన స్వేచ్ఛ వ్యక్తిగతమైనది; విషయపరమైనది. రీతిపరంగాను, సమష్టిపరంగాను స్వేచ్ఛను భావకవులు కలలోకూడా ఊహించలేదు. అయినప్పటికీ భావకవులు సాధించిన కవితాపరమైన విప్లవమే తదనంతర కవులు అభ్యుదయ సాహిత్యంపేరుతో తీసుకొచ్చిన విప్లవోద్యమానికి కారణమైనది.

సంప్రదాయబద్ధమైన పద్యకవితలో కొన్ని నియమాలున్నాయి. ఒక్కొక్క రకమైన పద్యంలో — ఆ పద్యానికిన్ని పాదాలని, పాదానికిన్ని అక్షరాలని, యతిప్రాసనియమం ప్రతిపద్యంలోను ఉండవలెనని, లేదనాలని — ఇత్యాదులుగా నిబంధించి ఏర్పరుచుకున్నారు. భావకవులు కావ్యవస్తువులో ఉనుకు వచ్చిన మార్పు విధానంలో తీసుకురాలేదు. అంటే వాళ్ళు చెప్పదల్చుకున్న నూతనభావాన్ని పాతవిధానంలోనే చెప్పారు. భావకవితానంతర కవులలో విషయంలో వచ్చిన మార్పుతోపాటు విధానంలోకూడా మార్పు వచ్చింది

రెండు ప్రపంచయుద్ధాల అనంతరం మానవ జీవితంలో మరో మలుపు ప్రారంభమయింది. మొదటి ప్రపంచ యుద్ధానంతరమే సామాజికజీవిత విధానంలో మార్పు వచ్చింది; వ్యవస్థలో మార్పు వచ్చింది. బలవంతుడు బలహీనుణ్ణి తినేసే స్థితిలోకి మానవచరిత్ర దిగజారిపోయింది. సంఘంలో ఏకొద్దిమందో మాత్రమే యావత్సమాజాన్ని శాసించేకాలం అది. ఫలితంగా యువతరంలో, కార్మికకర్షకవర్గంలో. ఇంకా సూక్ష్మంగా చెప్పాలంటే పీడితజనానీకాల్లో చెలరేగిన అసంతృప్తి అగ్నిజ్వాలలు ప్రపంచం నలుమూలలకీ వ్యాపించి పేదాపుల మనస్సుల్ని మండించాయి. తదనుగుణంగా రాజకీయరంగంలో తీవ్రమైన పరిణామాలు గోచరించాయి. వాటి ప్రభావమే కళారంగం మీదకూడా పడచేసి అన్నిదేశాల్లోనూ సంప్రదాయ కవిత్వంమీద తిరుగుబాటు లేవదీసి సాహిత్యచరిత్రలో కొత్తయుగాన్ని ప్రారంభించింది. అదియే ఆంధ్ర సాహిత్యంలో అభ్యుదయ కవిత్వంగా అవతరించింది.

అభ్యుదయకవులకు ఆవేశం ముఖ్యలక్షణం. ఈ ఆవేశం ప్రధానంగా సంఘపరమైనది. సంఘంలో నిరంతరం జరుగుతున్న అన్యాయాలు, ఆర్థికఅసమానత, సామాన్యమానవుని జీవితసంఘర్షణ వీళ్లకు కావ్యవస్తువులయ్యాయి. ఆ వస్తువుల్ని కవితల్లో నిబంధించేటప్పుడు ప్రాచీనకావ్యనియమాలు దరిదాపుగా విచ్ఛిన్నమయ్యాయి. తత్ఫలితంగా గేయకవిత ప్రారంభమైంది. పద్యకవితలోంచి కవిత్వం గేయకవితలోకి పరిణామం చెందేసరికి కవులకు అభిప్రాయ వ్యక్తీకరణకి చాలాగొప్ప స్వేచ్ఛ లభించింది. గతం మీద ద్వేషం, వర్తమానంమీద నిరాశ, భవిష్యత్తుపై ఆశ నాటి అభ్యుదయకవుల గేయాల్లో ఎక్కువగా ప్రతిఫలించాయి.

రవరాధుత్తె దురదృష్టంచే
చెరసాలలలో చిక్కేవాళ్లా —
లోహారాక్షసుల పదఘట్టనచే
కొనప్రాణంతో కనలేవాళ్లా —
కష్టించాలిక కడుపుమంటచే
తెగించి సమ్మెలు కట్టేవాళ్లా —
అనేకులింకా అభాగ్యులంతా
అనాథులంతా
అశాంతులంతా
దీర్ఘశ్రుతిలో, తీవ్రధ్వనితో
విప్లవశంఖం వినిపిస్తారోయ్!'

ఈ విధంగా భావవైవిధ్యంవలన సంక్రమించిన

రీతితో కవిత్వంలోని సంప్రదాయచ్ఛందస్సులు పూర్తిగా విధ్వంసం అయ్యాయి. యతిప్రాసనియమాలు కొంత వరకూ సడలిపోయాయి. ఈ నియమాలనుంచి స్వేచ్ఛనుపొందిన కవికంఠం సింహగర్జన చేసింది. వారు కొత్తగా ఏర్పఱచుకున్న ఛందస్సువల్ల చెప్పదల్చుకున్నది స్పష్టంగా చెప్పగలిగారు.

'మానవమేధస్సుకు
సంకెళ్ళను తగిలించిన
గత సాంఘిక శిలాశాసనం
పడగొట్టను
పగిలిన నా విస్ఫులింగశిల
పలికిన నా విప్లవగీతం
గత సాంఘిక సంబంధ సౌధాలపై
బాంబులు దూకించిన నా గీతం
జగత్తులో జలప్రళయం సృష్టించదట;
ప్రపంచాన్ని మార్చిందట
స్వేచ్ఛామహాగ్నిపర్వత
శిఖరాంచల రక్తజ్వాలికగా
మండిందట ,
....
గత లోకం కాల్చిందట
నవలోకం చూపిందట

ఇట్లా అభ్యుదయకవులు ఒక మహావిప్లవ భావాన్ని చెప్పదల్చుకున్నారు. తద్భావానికి అనుగుణమైనశైలిని, ఛందస్సుని నిర్ణయించుకున్నారు. శ్రీశ్రీతో ప్రారంభమైన ఈ అభ్యుదయభావం ఆకాశమార్గంలో పయనించిందేకాని భూమిమీద నిలకడగా నిలవలేదు. భాషలో, భావంలో, రీతిలో వచ్చిన ఈ విప్లవం తదనంతర కవులకు శాశ్వతమార్గమైంది. భావకవులనుంచీ సాహిత్యంలో ప్రారంభమైన నూతనమార్గాన్వేషణ అభ్యుదయకవిత్వంతో ఆగిపోలేదు. అభ్యుదయకవితాయుగానికి ప్రారంభకులైన కవులే మళ్లీ అన్వేషణ సాగించారు. ఆ అన్వేషణా ఫలితమే వచనకవితావిష్కరణ.

వచనకవితలో ఇప్పటిదాకా గేయకవిత్వంలో పాటించిన మాత్రాఛందస్సులు, యతిప్రాసనియమాలు కూడా నిరసించబడ్డాయి. చెప్పదల్చుకున్న భావాన్ని సూటిగా, స్పష్టంగా చెప్పటమే వచనకవితాలక్షణం. ఈ ఛందోనియమాల్ని పరిహరిస్తే తేటగీతి ఛందస్సు వచనగేయంగామారే అవకాశం ఉందని శ్రీశ్రీ సుప్తాస్థికలలో చూపించాడు.

'అవి ధరాగర్భమున
మానవాస్థికా పరంపరలు;
సుప్తశిశ్వబ్ద సంపుటములు;
అటనొక దీర్ఘయామిని;
ఆ నిశా శ్మశానశయ్యను
ప్రేతప్రవర్తనము
ఆ యుగస్మృతిమహా రహస్యాంగణాన
తాండవించును
మృత్యుశైత్య మొకటి...'

ఈ విధంగా తొలిసారిగా నూతనమార్గాన్వేషణాపథంలో ఆధునికయుగలక్షణాన్ని సంతరించుకుని తెలుగులో వచనకవిత పుట్టింది. దీనికి గట్టిగా పునాదిని అమర్చారు అని చెప్పలేంకాని శ్రీశ్రీ, శిష్ట్లా, నారాయణబాబు మొదలగువారంతా ఈ ప్రక్రియకు ప్రారంభకులే. శ్రీశ్రీ మహాప్రస్థానంలో 'పాడు' అనే శబ్దవచనగేయాన్ని రాశాడు. ఎప్పుడో అది వచన కవితాయుగానికి ప్రారంభమైనా ఉత్కవితా లక్షణానికీ, లక్ష్యానికీకూడా అనుమానింపబడిన గేయం. తొలితరంలో అభ్యుదయకవితా లక్ష్యమే వచనకవితాలక్ష్యంకూడా అయింది. అందుచేతనే వారి రచనల్లో వర్గపోరాటం ప్రతిఫలించింది.

'అందరం కలిసిచేసిన ఈ
అందమైన వస్తుసముదాయం అంతా
ఎక్కడో ఒక్కడేవచ్చి
ఎత్తుకుపోతూఉంటే చూచి,
'అన్యాయం! అన్యాయం' అని మేమంటే —
'అనుభవించాలి మీ ఖర్మం' అంటాడు.'

పై వచనగేయంలో ప్రతిరెండుపాదాలకీ ఆదిలో ప్రాసనియమం తప్పితే మరేవిధమైన నియమాలు లేవు. తను చెప్పదల్చుకున్న విషయం సాంఘికమైన అన్యాయాన్నిగూర్చి దాన్ని చిత్రించటానికి కవి ఎలాంటి నియమాల్ని పాటించకుండానే సామాన్యులకు సంఘంలో జరుగుతున్న అన్యాయాన్ని సామాన్యంగా చెప్పాడు. అయితే శ్రీశ్రీ ప్రారంభించిన వచనకవిత శ్రీశ్రీలోనే అనేకపరిణామాలకు గురైంది. ఉదాహరణకి కవితా! ఓ కవితా! తీసుకుంటే— గేయంతో సమానమైన నడకను కలిగిన వచనకవితా ఖండిక అది.

'కవితా! ఓ కవితా!
నా యువకాశల నవపేశల సుమగీతావరణంలో
నిను నేనొక సుముహూర్తంలో
అతిసుందర సుస్వందనమందున
దూరంగా వినువీధుల్లో విహరించే
అందని అందానివిగా
భావించిన రోజులలో'

ఇలాగే ఈ ఖండిక సాగిపోతుంది. ఈ ఖండిక లోని నడకయొక్క వేగం కవియొక్క సామాజిక విప్లవ దృక్పథంమీద, హృదయస్పందనమీద ఆధారపడిఉంది. వచనకవిత తొలిరోజుల్లో స్వచ్ఛమైన కవితా ప్రక్రియగా నిలబడకపోవటానికి కారణం తత్కవులకి గణ, యతి, ప్రాసలమీద మోజు తీరక పోవటం. ఆ కారణంగా కావ్యఖండికలలో ప్రాసల కోసం నానాబాధాపడటం చివరికి అదొక అపహాస్యంగా తయారైంది. కాని పరిణామక్రమంలో వచనకవిత ఒక నిర్దిష్టకవితావిధానంగా వేళ్లు పాతుకుంది. శ్రీశ్రీ, శిష్ట్లా మొదలగువారు చూపెట్టిన ఈ నవ్యమార్గం ఆరుద్ర, తిలక్, కుందుర్తి, దిగంబర కవుల చేతిలో ఇంకా సుగమమైంది.

అయితే వచ్చినమార్పు ఏమిటంటే—వచన కవిత రాసిన గొప్పకవులలో ఏ ఒక్కరి కవిత్వం మరొకరి కవిత్వంతో పోలిక లేకపోవటం. నియమాలను పూర్తిగా వదిలించేసుకున్న కవిత్వం ఒక్కొక్క కవియొక్క భావనావిధానాన్నిబట్టి, శిల్పచాతుర్యం బట్టి ఒక్కొక్కరకమైన రూపు సంతరించుకుంది. ఈ రూపాల్లో కొన్నిమహాసౌందర్యంగా భాసించవచ్చు; మరికొన్ని సాధారణంగా కనిపించవచ్చు. ఇంకొన్ని వికృతరూపంలో ప్రత్యక్షం కావచ్చు; లేదా జుగుప్సాకరంగా ఉండవచ్చు. విలువను నిర్ణయించుకోవలసింది సహృదయులు.

శ్రీశ్రీ, శిష్ట్లా, నారాయణబాబు తరువాత సాహిత్యంలో అనేకప్రయోగాలు చేసినవాడు ఆరుద్ర. ఆరుద్ర తొక్కిన కొత్తపుంతలకి త్వమేవాహం, సినీవాలి ఉదాహరణలు. త్వమేవాహంలో వచనకవిత్వాన్ని భిన్నరూపాల్లో చూపించాడు ఆరుద్ర. కాలంమీద కవికిగల దృక్పథం కావ్యంఅంతా విస్తరించుకుంటుంది.

'నువ్వు ఎక్కదల్చుకున్న రైలు
ఎప్పుడూ ఒక జీవితకాలం లేటు
ఏళ్ళూపూళ్ళూ నిరీక్షించలేక
ఎక్కేస్తానేదో ఒక బండి
నీ ఆదర్శాల లగేజి
ఎక్సెసంటాడు టి. ఐ. సి.'

పై పాదాల్లో అక్కడక్కడా ఆంగ్లశబ్దాలున్నాయి. ఈ ఆంగ్లశబ్దాలను తెలుగు శబ్దాలతో కలిపేటప్పుడు ఒక్కొక్కచోట అందంగా ఉంటుంది; వేరొకచోట అసహ్యంగాకూడా ఉండవచ్చును. త్వమేవాహంలో చాలాభాగం వచనకవిత్వమే. ఇది అందరికీ తేలిగ్గా అర్థంఅయ్యే కవిత్వంమాత్రంకాదు. తేలిగ్గా ఉత్తమకవిత్వం ఎప్పుడూ ఎవ్వరికీ అర్థం కాలేదన్నది నిజమైనప్పటికీ త్వమేవాహం అంతా వ్యక్తిగతమైన ప్రతీకవాదంకాబట్టి అది అందరికీ అర్థంఅయ్యే అవకాశం తక్కువగా ఉంటుంది. ఉదాహరణకి—

'బ్రెయిన్‌లో బ్రెన్‌గన్
రెయిన్‌లా ఆలోచనల బ్రెయిన్
స్పయినల్ కార్డులో స్పెయిన్.'

ఇలాంటి పాదాలు కవి హృదయం తెలిస్తేనే కాని అర్థంకానివి, అర్థం కాలేదంటున్నారని పాఠకుల్ని, ప్రజల్ని దూషించినందువలన ప్రయోజనం ఏముంది?

'లాభంలేదు పిష్టర్
ఈ గాయం
మానబోదు డాక్టర్
చేతులు కడుక్కోవోయ్ మిష్టర్

పుస్తకం మూసెయ్యండి మాష్టార్' లాంటి పాదాల్ని కవిత్వంగా అంగీకరించటమంటే కష్టమయిన విషయం. ఈ లోపం ఎందుకొచ్చిందంటే— వచనకవితా ప్రారంభకులైన తొలికవులకి అంత్యప్రాసలమీద మోజు తీరకపోవటంవలన; ఏ నియమమూ లేకపోతే రసావిష్కరణ జరగదేమోననే అనుమానం వలన శిష్ట్లకూడా వచనగంధిరూపంలో వచనకవిత రాశాడు; ఆ వచనకవితనిండా గ్రాంధికవాసనే. దానిలో గొప్పకవిత్వంమాత్రంలేదు.

'ఓహో సౌందర్య నిశీథసామ్రాజ్యమూర్తీ !
రక్తారుణప్రవాహసమరకల్లోలములో ప్రజల
ప్రఫుల్లసౌందర్య జీవితానంద ముగ్ధులం
జేయుదువు !
అనంతముఖాలుగల అందాల అనలమా !
నీ సయ్యాటపాటల యూనాటములతో కుందకిట
కుండలంబులకాంతి బ్రహ్మాండమునకు
తేజశ్శక్తియౌను !'

ఇది వచనకవితా ప్రస్థానములో ప్రారంభదశ అని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఎంచేతంటే—ఆనాటికింకా పాతవాసనల్ని కవులు సంపూర్ణంగా వదిలించుకోలేదు. ఆ బంధాలనుండి శ్రీ శ్రీ, ఆరుద్రలు కొంతవరకూ విముక్తులయ్యారు. ఆరుద్ర పాతనుంచి బయటపడి కొత్తప్రయోగాల్లో ఒకవైపు ఉత్తమ కవిత్వం రాస్తూనే మరోవైపు అంత్యప్రాసల గారడీ కవిత్వంలో పడిపోయాడు.

శ్రీ శ్రీ, ఆరుద్రలవరకూ కూడా ఆధునికవితా ఉద్యమంయొక్క ఉద్దేశం సామ్యవాదం; సమతారాజ్య స్థాపన. వాళ్ళు రాసిన వచనకవిత్వంలోకూడా సామ్యవాదమే కనిపించింది. వారి తరువాతవచ్చిన కుందుర్తి, తిలక్ మొదలుగాగల తదితర కవులలో సామ్యవాద దృక్పథంకంటె ప్రజాస్వామ్యవాదన ఎక్కువగా ద్యోతకమయింది. తత్కారణంగానే ఆధునికకవితా ప్రక్రియలన్నిటికంటె వచనకవిత్వమే ప్రజాకవిత్వంగా పేర్కొనవలసిన అవసరం ఏర్పడుతున్నది. వచనకవిత్వాన్ని ఒక ఉద్యమంగా ముందుకు తీసుకుపోవాలన్న కాంక్షతో కుందుర్తి ఉత్తమవచనకవిత్వాన్ని రాశాడు; రాస్తున్నాడు. అతనిది సంపూర్ణమైన ప్రజాస్వామిక దృక్పథం.

'ఇది నా కవిత్వం - గీత; వినేవాడు వరుడు
చదువుసంధ్యలురాని రోడ్డుమీద పామరుడు
లేమితల్లియొడిలో నిరంతర గాఢనిద్రాపరుడు.'

ఇట్లా కుందుర్తి తన కవితని ప్రజాస్వామ్య లక్షణాలుగల మహోద్యమంగా మన ముందుంచుతాడు. అతని కవిత్వంలోని జీవలక్షణాన్ని 'శపథాలు' అనే ఖండికలో చెబుతాడు.

'ఎన్నడూ యెవరూ తొక్కనిపథాలు
నా శపథాలు
ప్రజోద్యమాల తుది సమరానికి
సిద్ధమైన విధాలు
దరిద్రుల ఆగామియాత్రకు
సన్నద్ధమైన రథాలు—
నా కవితా శపథాలు
ముక్కోటి మూగజీవాలు
పలికేభావాలు నా పాట
అంతులేని అభాగ్యుల కన్నీటి ఊట
పాటలో అతిశయోక్తుల బాణాలువాడను
బధిరాంధకశవాల ప్రతిక్రియాప్రకటనలు చూడను'

వచనకవితలోఉన్న విశిష్టలక్షణం ఏమిటంటే — ఈ ప్రక్రియలో ఏ భావాన్నైనా వెలువరించే అవకాశం ఉండటం. పోగా ప్రాచీనకావ్య

ప్రక్రియల్లోఉన్న అలంకారాలు, ధ్వని ఇత్యాదులను వచనకవితా విధానంలో కూడా సంపూర్ణంగా ఉపయోగించుకునే వీలుంది. భిన్నభావాల్ని వచనకవిత్వంలో శిల్పసహితంగా వెలువరించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న కొద్దిమంది కవులలో తిలక్ ఒకడు. అతని కలంలో వచనకవిత్వం కొత్తరూపును సంతరించుకుని, సమగ్రకవితా ప్రక్రియగా నిలిచిపోయింది. భావానుగుణమైన ప్రవాహశైలిని కుందుర్తి తర్వాత వచనకవిత్వానికి ప్రసాదించినవాడు తిలక్.

సంప్రదాయబద్ధమైన పద్యానికి గణనియమం వల్ల, అక్షరనియమంవల్ల ప్రవాహరూపమైన శైలి ఏర్పడింది. వచనకవిత్వంలో ఈ నియమాల్ని తొలగించినప్పటికీ కవియొక్క ప్రతిభవల్ల, శయ్యానిర్మాణ చాతుర్యంవలన ప్రవాహరూపమైన శైలి ఏర్పడుతోంది. అంటే—మానసికమైన అనుభూతికి అక్షరాలలో ఆకృతి ఇచ్చేటప్పుడు ప్రతిఅక్షరం కవియొక్క అనుభూతికి నిదర్శనంగా నిలవాలి.

'ఒక్కమాట చెప్పు
నిన్నరాత్రి దేవుడువచ్చి నా మంచంమీద కూర్చుని
దీనంగా నాకేసిచూసి కన్నులు దించుకున్నప్పుడు
ఏమైనా అన్నానా? నేనేమైనా అన్నానా?
ఆకలిగొని ఆకలికని అన్నింటా విఫలుడై
ఆత్మహత్యచేసుకున్న అబ్బాయినిగూర్చి అడిగానా?
అమ్ముకుని యవ్వనం, అలసిన జీవనం
సాగించి సాగించి సంధ్యవేళ ఉరితీసుకున్న
సానిపడుచుమాట చెప్పానా?
....
కాంగోలో, క్యూబాలో, స్పైయిన్‌లో, లావోస్‌లో
కాలి కమురుకంపుకొట్టేకాలం కథ, మానవవ్యథ
నే వివరించానా?' అంటాడు తిలక్. ఇక్కడ రాత్రి తన దగ్గరకు దేవుడు రావటం ప్రధానం కాదు. తాను చెప్పదల్చుకున్న విషయం ప్రధానం. లోకంమీద పరుచుకున్న అన్యాయాన్ని, అక్రమాన్ని వ్యక్తంచెయ్యాలి. ఈ అన్యాయాలూ, అక్రమాలూ పైన పేర్కొన్న పాదాల్లో ఏ ఒక్కపాదంలోనూ అనేకరూపాల్లో అనేకమందికి జరుగుతున్నాయి. వీటన్నిటినీ చూస్తున్న ప్రేక్షకుడు కవి. వాటికి తీవ్రంగా కంపిస్తున్న హృదయం అతనిది. హృదయకంపనకి అనుకూలంగా మాటల్ని పేర్చటంవల్లన కవితాగుణం కలిగింది పై పాదాలకి. ఇక్కడ ఏ నియమమూలేదు అయినా ఇది ఉత్తమకవిత్వమే. నియమాలకి అతీతమైన కావ్యపదార్థ మొకటి కవిత్వానికి కావాలి. ఆ పదార్థాన్ని కనుగొని అందుకోగలిగితే ఎట్లా చెప్పినా అది కవిత్వమే అవుతుంది. దీనికి శ్రీశ్రీ నుంచి ఉదాహరణ చూపించవచ్చు. 'ఛందస్సుకీ, వ్యాకరణానికీ, అలంకారాలకీ, అన్నింటికీ అవతల స్వచ్ఛమూ స్వచ్ఛందమూ, నీరూపమూ నిరూపమూ అయిన కవిత్వపదార్థ మొకటుంది. ప్రతికవి దాన్ని అందుకోటానికి ప్రయత్నిస్తాడు.' తిలక్ పై చెప్పిన అన్వేషణకి ఉదాహరణగా నిలుస్తాడు. తిలక్‌లో అభ్యుదయభావన, ప్రేమభావన, సౌందర్యభావన చోటు చేసుకున్నాయి. ఈ మూడు భిన్నమైన భావాలకీ అతను వచన కవిత్వాన్నే వాహికగా చేసుకున్నాడు. అనుభూతివాదం, ప్రతీకవాదం మొదలైనగల ఇజాల్ని అన్నింటిని వచనకవిత్వంలోనే చిత్రించాడు. మధ్యతరగతి మానవునికి ప్రతీకగా గొంగళీపురుగుని తీసుకుని 'గొంగళీ పురుగులు' కావ్యఖండిక రాశాడు.

'చిన్నప్పటి ఆదర్శాలు అటంకరాలు నరికి
గోడమీద గ్రూప్ ఫోటోలు, బియ్యేడిగ్రీలు కృంచి
నిత్యనైమిత్తిక వృశ్చికాల గుళ్ళుకట్టి
సంఘ గౌరవ భైరవ దైవతమూర్తి ప్రతిష్ఠించి
రసహీనమైన తమ జీవితాన్ని నిర్వహించి
నీడలమాటున పీడకలచాటున నీరసంగా నుంచుని
....
భయాలచాటున, ఏడుపుకొండలమాటున
గుమస్తాలు టీచర్లు చిన్నచిన్న సంసారులు
కోటీశ్వరరావులు వీరేశ్వరరావులు గొంగళీపురుగులు
లక్షలు లక్షలు.'

ఒక్క అక్షరం ఎక్కువగాని ఒక్కఅక్షరం తక్కువ గాని లేకుండా విరుపూ, ఊపూసాగింది. ఇక్కడ వచన గేయంలో పాదాల విరుపునుగూర్చి కొంత చెప్పవలసి ఉంది ఈ పాదాలవిరుపు కవియొక్క అనుభూతికి ప్రతిరూపంగా ఉంటుంది. మాత్రాబద్ధ ఛందస్సుల నుంచి గూడా విడివడిన వచన కవితయొక్క కావ్యగుణం పాదాల విరుపుమీద, ప్రవాహశైలిమీద ఆధారపడి ఉంది. గణాలు లేకపోయినప్పటికీ శబ్దంయొక్క భావాన్నిబట్టి, ఉద్రేకం యొక్క ఊపునుబట్టి పాదాలని విరవటంవలన వచనకవిత్వానికి స్వచ్ఛమైన ప్రవాహశైలి ఏర్పడుతోంది.

'దూరాన తెల్లని ఓడతెరచాప కదిలినపుడు
భావహృదయాన విశ్వసానిలం వీచినపుడు
ఒక్క దుఃఖితుడు నవ్వినపుడు
ఒక్కపతితుడు కన్విప్పినపుడు
అక్కడ నా అడుగుజాడ గుర్తించగలవు'
అక్కడ నా సందేశాన్ని అశ్రుసంగీతాన్ని
ఆహ్లాదించగలవు.'

ఇట్లా ప్రతిపాదాంతంలోనూ ప్రాసనియమం పాటించ బడినది. ఈ ప్రాసనియమం లేకపోయినా వచనకవిత్వపు నడక కుంటుపడదు. ఏ పాదాని కాపాదం ఒకనిశ్చిత మైన అర్థాన్నిస్తుంది.

'చంద్రగోళం చవిటి పర్రమీదవెతగ్గా వెతగ్గా
ప్రబంధనాయికల ఉపాలంభనలు దొరికెనట
విశ్వనాథ వారు వెనక్కినడవగా నడవగా
వేదకాలం యింకా వెనక్కి వెనక్కి పోయిందట'

ఈ పాదాల్లో గొప్ప కవిత్వం ఏమీలేదుగాని పాదాల విరుపులో ఖండికకి అందం వచ్చింది. ఇది హాస్యంతో కూడిన వ్యంగ్యరచన. ఇందులో ఒకటోపాదం మూడోపాదం అట్లాగే రెండోపాదం నాలుగవపాదం సమానభారాన్ని కలిగిఉన్నాయి.

తిలక్ తరువాత వచనకవిత్వాన్ని పరవళ్లు తొక్కే ఉద్రేకంతో నడిపించినవారు దిగంబరకవులు. వీళ్లు తమ కావ్యఖండికల్ని వచనగీతాలు అననివ్వ మని అన్నారు; వాటికి దిక్కులని పేరుపెట్టారు. వారు ఏపేరుపెట్టినా సీసా పాతదే సారం కొత్తది. వచనకవిత్వం అనటానికి వీలులేదని శాసించేటప్పుడు వచనకవితాస్వరూపంనుంచి, నిర్మాణంనుంచి వీరి కవిత్వం ఏవిధంగా వేరైందీ వీరు ప్రత్యక్షంగా, సోదాహరణంగా నిరూపించవలసింది; అలా చేయ లేదు. దిగంబరకవులు ఉత్తమమైన వచనకవితా ఖండికల్ని రాశారు. ఉదాహరణకి—

'శతాబ్దాల పరిణామం ప్రగతిపై
అనాదిగా పెరుగుతున్న అనంతమానవుణ్ణి నేను—
పురోగమనం అద్భుతాల వ్యామోహంలో
విజ్ఞానం విజయాల దాహంపరిధిలో
తిరుగుతున్న ఇంగితాన్ని నేను—
సృష్టియోనినుండి జారిపడ్డ విచిత్రవికార
రూపాన్ని నేను—
ఇంకా ఎదగనిమానవుణ్ణి నేను.'

ఈ పాదాల నడకలో ఎక్కడా కుంటుపడటం కాని, శబ్దాలకోసం తడుముకోవటంకాని, ప్రాసకోసంపడే బాధకాని కనిపించవు. కవి హృదయం ఏవిధంగా స్పందిస్తే ఆ విధంగా అక్షరాలు స్వచ్ఛమైన ఆకృతి దాల్చాయి. పాదాలవిరుపుకూడా ఉద్రేకపు లయ ననుస రించే సాగింది. శబ్దంయొక్క బరువుని, శక్తిని తెలుసుకుని ప్రయోగించటం శిల్పంలో ఒకభాగమే కదా! ఈ నైపుణ్యం దిగంబరకవులలో కావాల్సి నంత ఉంది.

'అట్టడుగున అహరహం
చరిత్ర రాళ్లను కొడుతూ
రక్తం కక్కుతూ
మహావర్గ మానవుడు;
మధ్యతరగతి నపుంసకత్వాన్ని విడిచి
దగ్గరకువెళ్లి మరో రాయితీసి
అందరికోసం బద్దలకొట్టమని

యుగధర్మం
గుండెచీల్చి అరుస్తున్నది.'

ఇలాగే యింకా చాలా ఉన్నతమైన వచన ఖండికల్ని సృష్టించారు దిగంబరకవులు. అయితే ఈ నవసృష్టివెనుక అనంతమైన అరాచకలక్షణాలు, విధ్వంసకలక్షణాలు కనపడుతున్నాయి. ఈ వ్యవస్థని మొత్తంగా తిట్టడమే ధ్యేయంగా పెట్టుకున్నారు దిగంబరకవులు. ఈ వ్యవస్థ విధ్వంసం అనంతరం ఏర్పడవలసిన నవసమాజస్వరూపాన్ని వాళ్లు చూపించ లేదు. ఇది వారి కవిత్వంలోని ప్రధానమైన లోపాల్లో ఒకటి. ఒక వ్యవస్థని ఎదిరించేటప్పుడు దాని స్థానంలో మరో వ్యవస్థా స్వరూపాన్ని సూచన మాత్రంగానైనా నిర్వచించాలి. అలా కాకుండా కవిత్వం పేరుతో కవిత్వాన్ని దేశం నెత్తిమీదరుద్దటం న్యాయం కాదు. నీళ్లదూషణకి, అహంకారానికి నిదర్శనంగా ఈ ఒక్క ఖండికచాలు.

'ఒరేయ్!
మీరంతా ఊరపందుల్లా బతుకుతున్నారు.
భవిష్యత్తు గురించి ఆలోచనలులేవు
వర్తమాన వక్రగతిపట్ల విమర్శలేదు
లంజల్లా వెధవల్లా
మొగుడుచచ్చిన ముండల్లా
మొగుడిచాటు పోరంబోకు లంజల్లా
బతికున్న శవాల్లా
చచ్చు పీనుగులు
ఎందుకురా మీరంతా బతికి
ఒరేయ్!
సన్నాసుల్లారా!
దున్నపోతుల్లారా!'

ఇంతకంటె దిగజారిపోయిన తెలుగు కవిత్వం ఏదన్నా ఉందేమో దిగంబర కవులకే తెలియాలి.

ఈ తరంలో గోపాలచక్రవర్తి, వేగుంట మోహన ప్రసాద్, అద్దేపల్లి రామమోహనరావు, సోమసుందర్, మాదిరాజు రంగారావు, వరవరరావు మొదలుగా గలవారు వచనకవితా ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోతున్నారు. ఈతరం కవులపై ప్రత్యేకించి వేరొక వ్యాసం రాయవలసిన అవసరం ఉన్నది.

ఇప్పుడు వస్తున్న వచనకవితాఖండికల్లో చాలా భాగం అస్పష్టతని అయోమయాన్ని పులుముకుని దిగుమతి అవుతున్నాయి. ఆధునికత ముసుగులో అరాచకత్వం ప్రబలుతోంది. మరి కొంతమంది వచన కవిత్వంపేరుతో దుష్టవచనాన్ని రాస్తున్నారు. ఈ పద్ధతి సాహిత్యపురోగమనానికి ఆరోగ్యకరమైన లక్షణంకాదు. ఏదో రాసేద్దామనే ఆతురతకంటె సాహిత్యపరిణామక్రమాన్ని, సాహిత్యలక్షణాన్ని సమగ్రంగా అర్థంచేసుకునేందుకు ప్రయత్నించవలసిన ఆవశ్యకత ఈ తరంలో కవులమనుకునే కొంత మందికి ఉంది. జననం ఆనందదాయకమేకాని అవిటి జననం అనర్థానికి దారితీయటమేకాక అపహాస్యానికి గురవుతోంది. అంచేత అంగలోపంతోకూడిన జననం కంటె అసలు జననం లేకపోవటమే ఉత్తమమేమో!

వచనకవిత పుట్టి దరిదాపుగా ముప్ఫై ఏళ్లయింది. దీనికి నిలకడుందా? నిలుస్తుందా? అన్న సందేహాలు ఈ మధ్యకాలందాకా చాలామందిని వేధించాయి.' ఇప్పుడాబాధ అక్కర్లేదు. ఏ కవిత్వం నిలకడైనా కాలంమీద ఆధారపడిఉంది. కవి కలం నుండి జారుతున్న అక్షరాల్లో బలంఉంటే, జీవ ముంటే అవి కాలాన్ని జయించి నిలుస్తాయి; నిలిచాయి కూడా. అంచేత ఈ ప్రక్రియనుగూర్చి ఎవరూ జాలిగా 'అయ్యో! పాపం' అనక్కర్లేదు; నిరాశగా పెదాలు చప్పరించనక్కర్లేదు. సాహిత్య చరిత్రలో ఈ ప్రస్థాన మేమిటో సాహిత్యపత్రికలు బుజావు చేస్తున్నాయి; వాటిని ఆదరించే పాఠక లోకం బుజావు చేస్తున్నది.

వచనకవితలో కథాకావ్య నిర్మాణానికి అవ కాశం ఉన్నదా? లేదా? ఆవశ్యకత ఉన్నదా? లేదా? అనే సమస్యలపై అనేకమంది అనేక

అభిప్రాయాలిచ్చారు. వచనకవితా ఉద్యమాన్ని ప్రాణంతో సమానంగా ప్రేమించే కుందుర్తి కథాకావ్యనిర్మాణం జరగాలంటున్నాడు. వచనకవితకి ఒక స్పష్టమైన రూపాన్నిచ్చిన తిలక్ కథాకావ్యం వచ్చినా రాకపోయినా ఫరవాలేదన్నాడు. తిలక్ దృష్టిలో కవిత్వం అనుభూతి ప్రధానమైనది. ఏ ఖండికకి ఆ ఖండికే ఒక ప్రత్యేకమైన అనుభూతిని ఆనందాన్ని కలుగజేస్తున్నప్పుడు ఇక వేరే కథాకావ్యనిర్మాణప్రసక్తి లేదని అతనివాదం. ప్రాచీన మహాకావ్యాల్ని తీసుకుంటే - ప్రతికావ్యంలోనూ ఒకకథ, దానిచుట్టూ కొన్నిపాత్రలు, వాటి మనస్తత్వాలు కనబడతాయి. పాత్ర చిత్రీకరణలోగాని, మనస్తత్వ నిరూపణలోగాని, కథాసంవిధానములోగాని మహాశిల్ప నైపుణ్యాన్ని చూపించారు వెనుకటి కవులు. ఉదాహరణకి మనుచరిత్రను తీసుకుంటే 'ఆ పురిఁబాయకుండు మకరాంక శశాంక మనోజ్ఞమూర్తి' అన్న ఒక్కపద్యంలో ప్రవరుని జీవలక్షణాలన్నిటినీ పేర్కొన్నాడు పెద్దన. తరువాత కథంతా ఆ పద్యానికి అనుగుణంగా సాగిపోతుంది. అది పూర్వకాలం కాబట్టి ఆ కాలానికి తగిన నాయకుల్ని ఎన్నుకున్నారు ఆనాటి కవులు. వర్తమానకాలానికి తగిన నాయకులు ఈనాటి కవులకి తక్కువకాదు. ఏసామాన్య మానవుణ్ణి చూచినా అనంతమైన సంఘర్షణ అతని జీవితంలో కనబడుతుంది. ఆ సంఘర్షణని సంపూర్ణంగా చిత్రించేటప్పుడే కథాకావ్యం ఏర్పడుతుంది. అవకాశం ఉండీకూడా సద్వినియోగపరుచుకోనకపోవటం ఉన్నతమైన లక్షణంకాదు. అయితే దీనికి వేరొక అభిప్రాయమేమిటంటే—ఆధునిక కాలంలో జీవితం వేగంగా పరుగుపెడుతున్నదనీ, ఈ యంత్రయుగంలో మహాకావ్యాన్ని నిర్మించే అవకాశం అసలు లేదని. ఇది చాలా పొరపాటైన ఊహ. అంతటి అవకాశమే లేకపోతే పెద్దపెద నవలలు వచ్చే అవకాశం అసలు లేదు. చిన్నకథ నవలస్థానం ఆక్రమించవలసింది. అలా జరగకుండా లెక్కకుమించిన నవలలు వస్తున్నాయి. నవలలు రాయటం, చదవటంలో జీవితంయొక్క వేగం, యాంత్రికయుగలక్షణం వర్తించటం లేదా? ఇవన్నీకాదు ప్రతిభావంతులైన కవుల్ని బద్ధకం ఆవరించింది. కాకపోతే కథాకావ్యం రాయలేని దుస్థితిలో కవులున్నారేమో!

ప్రఖ్యాత కావ్యఖండికల రూపంలో వచనకవితా ప్రక్రియ తెలుగు సాహిత్యంలో స్థిరపడిపోయింది. కథాకావ్యరూపంలో వచనకవిత ఎలా ఉంటుంది అన్నది ఇప్పుడిప్పుడే తేలనివిషయం. అంతదాకా—

'ఎప్పుడో ఒకమహాకవి భగీరథుడులా వస్తాడు.
కొంగ్రొత్త కవితాగంగను తెస్తాడు' అని

కుందుర్తివలె ఆశతో ఎదురు చూడవలసిందే.



పాపానికి జీతం...

శ్రీ జి. భాను

'యహేయ్...' అని వంచలోనుండి గంభీరంగా పిల్చిన గొంతుకు సమాధానంగా 'వోయ్... ఇదో...వస్తున్నా' ఇంటిలోపలనుండి కమ్మనిగొంతు విన్పించింది.

కొద్దికాలం గడచింది. గంభీరంగా పిల్చిన ఆయన తన పనిచేసుకోడం మొదలుపెట్టాడు తాను ఇల్లాలిని పిల్చిన సంగతి మర్చిపోయినట్లు.

ఇంట్లోనుండి పలికిన స్త్రీ వచ్చి మండిగం మీద కాలుపెట్టి భర్తవైపు తొంగిచూసింది. ద్వార బంధానికి ఆనించిన ఆమెచేతిన్రంగాజులు గలగల మని కలగానం చేశాయి. ఆ మానవుడు విన్పించుకో లేదు తన పనిలో మునిగిపోయి.

అతను చేస్తున్నపని ముగింపుకు వచ్చేముందు కలిగే వహౌనగాంభీర్యం అది అని ఆ ఇల్లాలికి అనుభవ పూర్వకమైన సంగతి.

పొగరపోసిన దిమ్మంపైన పట్టిళ్ళు పెట్టి యూటారెతో ఉంగటాలు కుడుతున్న మొగుడు అరుంధతి అరచేతివెడల్పుకన్నులకు మాంచి పసందుగా అనిపించాడు అప్పుడు.

రోజూ చూసే దృశ్యమే అది: చినిగిపోయిన ఈతాకుచాపపైన, పనిరాయి, సానరాయి, నీళ్ల తొట్టి ముందుపెట్టుకొని, గుమ్మట పట్టుకొని, పదునుచేసినతోలు సాగగొడుతూ, ఊడగబండపైన, సానరాయిపైన కత్తులు సుతారంగా నూరుతూ చెప్పులు కుట్టడం — ప్రతినిత్యంచేసేపని అదే! కానీ అరుంధతికి యల్లమంద సుందరంగా అనిపించాడు ఆనాడు! వేళావిశేషమేమో!?

చెప్పులు పూర్తి అయ్యాయి. మరలా ఇంకొక జత చెప్పులకు అచ్చులు పోసుకొన్నాడు. రెప్ప వాల్చ కుండా భర్తను చూస్తున్న భార్యకు అర్థంకాలేదు.

'కుట్టిన సెప్పులు దొరగోరి కిచ్చిరాకుండా మల్లా యేందిది?' అనుకొన్నది లోలోపల.

'యెందుకో...పిలిసింది?' — తీయగా అన్నది.

తలెత్తి చూశాడు ఎల్లమంద. కన్నుల లోతు ల్లోకి చూశాడు. అరుంధతి కాటుకకన్నులలో వెన్నెల రేక తళుక్కున మెరవనే మెరపింది.

'పనుండి...' మూతిమీద నవ్వుతూ, వాలు చూపు చూస్తూ అన్నాడు.

'నాతో పనేందిప్పుడు...' గునుస్తూ అన్నది.

'నీతోగాకుంటే...మరెవ్వరితో...జెప్పు...' వాడి చూపులు చూస్తూ అన్నాడు.

'వూఁ...సరింగా జెప్పు......పనుంది నాకు...' ఎల్లమంద ముఖంలోకి చూస్తూ అన్నది.

'యామబ్బా తొందర...నువ్వట్టానుంచో... నిమిశాల్లో జోడు కుట్టేత్తా...సర్లెగాని......ఈ కుట్టిన సెప్పులు...తీసకెళ్ళి మన దొరగోరికి... నువ్విచ్చిరావాల...వే నెల్లేవాణ్ణేగాని పొలెం శివయ్యగోర్కి యెంతరేత్రయినా సెప్పులు కుట్టి తెత్తానని మాటిచ్చినా...నువ్వెల్లి యిచ్చిరావాల...సరేనా?'

క్షణం తటపటాయించి తలూపింది అరుంధతి.

'బువ్వలో కేంజేశావ్...మాపిటికి?'

'రొయ్యపొట్టు కారంజేసి......కోడిగుడ్లు కేసినా...'

'నర్లే...తొరగ...బోయిరా...ఈ సెప్పులియ్యే తలికి...' అన్నాడు కత్తితో అచ్చులుకోస్తూ.

దగ్గరకువచ్చి చెప్పులు తీసుకొని చూచి 'రంగయ్య లేనే...నగంగా' అన్నది.

'ఊఁ...నిజమేఁ...నిన్నూజూసి...మరిసిపోయిన...' అన్నాడు కొంటెగాచూసి, కోరమీసాలపైన నవ్వుతూ. అన్నభేద్యి చిలుమురాళ్ళ ఉంచిన రంగుపిడలోనుండి రంగుతీసి చెప్పులకు రుద్ది బ్రష్ చేశాడు.

చెప్పులు చీకటిముద్దల్లా మెరుస్తున్నవి.

'నేనొచ్చేదాకా...పిల్లలు జాగర్త...' చెప్పులు తీసుకొంటూ అన్నది.

'హూఁ...బిర్రాగేలే...తొరగ రా...తెలిసిందా?' అన్నాడు రహస్యంగా. ఆ మాటలకు అరుంధతి హృదయాకాశంలో ఎన్నోకోర్కెల విహంగాలు రెక్కలు విప్పుకొన్నాయి. చిరునవ్వు ఎర్రనిపెదాలలోనుండి దూసుకొనివచ్చింది.

చెప్పులు చేతబట్టుకొని, భర్తను కన్నురాల చూసి బయలుదేరింది అరుంధతి. నాలుగు కొంపలు దాటి దారిమలుపు తిరగగానే పిల్లవాణి భుజంమీద వేసుకొని కూతురు ఎదురైంది.'

'అమ్మోయి...నేనొత్తానే...' ఏడుపు ప్రారంభించింది.

ఈ మాటలకు భుజంమీద పిల్లవాడు లేచి తల్లినిచూసి, చేతులుచాచి ఏడుపు సాగించాడు. అరుంధతి పిల్లాడి బుగ్గలు పుణికి, కూతురుజుట్టు నిమిరింది

'మమ్మగదూ...దొరగోర్కి...ఈ సెప్పులిచ్చి... తొరగావొత్తానే...సుబ్బయ్య కొట్లో...చెనగపొప్పు... జీడీలూ...తెత్తాగా...అబ్బాయికి...గూత్తి బువ్వేసి, పుట్టిమీన పిడతలోవున్న నెయ్యేసి, తినిపిచ్చి చిచ్చి కొట్టు...మీ బాబు...పనిమీదున్నాడే ... అమ్మా...... అల్లరిసేయమాక...పో'అని చెప్పులు నెత్తిమీద పెట్టుకొని ముందుకు సాగింది.

పిల్ల సంతోషంతో, సంబరంగా ఇంటిదారి పట్టింది 'కప్పొచ్చె...కమ్మగొట్టె...నిదరబో...... బూచోడా......కప్పొచ్చె కమ్మగొట్టె......నిదరబో బూచోడా' అని పాడుతూ చంకలోని పిల్లోణ్ణి నవ్విస్తూ ఇంటికి వెళ్ళింది.

తుమ్మలతోపులో నెమ్మదిగా క్రిందికి జారుతున్న సూర్యముఖం తీయని ఊహల మననంతో గాబోలు అరుణ వర్ణాంకితమైపోయింది. ఆతగాడు పశ్చిమదిగ్భాగంలో రేగిన పుండులా కనిపిస్తున్నాడు. పతనానికి పూర్వస్థితి మహోన్నతంగాను వుండవచ్చు, భయంకరంగాను వుండవచ్చుననే సత్యాన్ని రుజావు చేస్తున్నాడు కర్మసాక్షి.

చిల్లకంపలోవున్న డొంకదాటి, సీమతుమ్మ పీకలుదాటి, పంటకాలువవెంట ఊళ్ళోకి బయలు దేరిన అరుంధతి గుండెలో దిగులు కలుక్కుమంది.

మౌనంగా తన ప్రవాహపు పెదవులతో గట్టును ఒరసుకొని నర్మసంభాషణ కావిస్తున్నట్లు సాగుతున్న పంటకాలువ తనతో ఏదో రహస్యం చెబుతున్నట్లనిపించింది.

ఎన్నోసార్లు ఆ పంటకాలువవెంట ఊళ్ళోకి వెళ్ళలేదూ? ఎందుకో ఈవాడు అరుంధతికి ఏనాటి సంగతులో జ్ఞప్తికి వచ్చాయి ముఖ్యంగా తొలిరోజుల మధురస్మృతి ఒక్కటి లీలగా మనసులో మెదిలింది.

'భర్తతో అరుంధతి తల్లిగారింట'నుండి క్రొత్తకాపురానికి ఈ కాలువ వెంబడే ఊళ్ళోనుండి వస్తున్నది. భర్త కన్నుల్లోకి మూగగా చూడ్డం తప్పితే, అంతబాగా మాట్లాడడానికి పరమసిగ్గుగా వుండేది అప్పుడు. దానికితోడు ఆ రోజు దొరసాని, దొరగారు ఏమో మాటలు అన్నారు. దొరగారు మరీని. 'ఒరే! నీ పెళ్ళాం మాఇదిగా వుందిరా' అన్నాడు భర్తతో. ఆ మాటతో ఎల్లుంద సిగ్గుపడిపోయి అరుంధతిని చూశాడు. ఆమె ముఖం మరీ క్రిందికి వాల్చేసుకొన్నది. తర్వాత మాట్లాడకుండా

కాలువవెంట వస్తుంటే అన్నాడు అప్పుడు భర్త: 'ఇదిగో! నీకంటే కాలవ వయం. గుసగుసమని కబురులు ఎట్టా సెబుతావుందోసూడు! నీకు సేతగాకపోతే నేసెబుతా ఇను' అని చెవిదగ్గర నోరు పెట్టినట్లుపెట్టి బుగ్గమీద గట్టిగా ముద్దెట్టుకొన్నాడు. ఒళ్లంతా జలదరించిపోయింది అప్పుడు...

ఆనాటి సంఘటనను తలుచుకొంటూ అరుంధతి నడుస్తున్నది.

బాగా కురిసిన వర్షానికి పుంజుకొని అదో మోస్తరు ఎరుపురంగులో దుండిగచెట్లు మెరిసిపోతున్నవి. చిన్నఈతచెట్లపై ప్రాకిన పాలతీగపైవ ఎన్నోపూలు పుష్పవతులయ్యాయి. గచ్చాకుపొదలు పిచ్చిగా అల్లుకొన్నాయి. తెల్లజిల్లేడుచెట్లపైన సన్నముక్కుల తేనెపిట్టలు కూనరాగాలు తీస్తున్నవి.

మనము సరిగా లేనప్పుడు చెలరేగే రకరకాల ఊహల్లా పుడమి తల్లి గుండెలోనుండి నానావిధాలైన మొక్కలు తలనూపాయి.

జ్ఞాపకాలు తొలుస్తుండగా అరుంధతి ఈ ప్రకృతిని చూస్తూ చూడనట్లుగా తన్నుతాను మర్చిపోయి ఊళ్లోకి వచ్చింది. వంతెన దాటింది. అవిసెచెట్టుక్రిందవున్న బడ్డీకొట్టుదాటి, రచ్చబండ దాటబోతున్నది.

రచ్చబండపైన మోతుబరిరైతులు, ఊరిపెద్దమనుష్యులు, కుర్రకారు సాధారణంగా సమావేశమౌతారు. ఆ రోజు అంతసందడిగాలేదు. నలుగురైదుగురు కూర్చొని ధూమపానంచేస్తూ లోకాభిరామాయణమో, గ్రామాయణమో ముచ్చటిస్తున్నారు.

తలపై పాదరక్షలు పెట్టుకొని, నాజూకుగా, హొందగా నడుస్తున్న అరుంధతి వాళ్ల కనులల్లో పడింది.

'ఎవర్రా అది మా సర్దాగా నడుస్తుందీ!?' ఒకడు అన్నాడు.

'నిజవే... మహొయ్యారంగా నడుస్తుందోయ్ బొమ్మ...ఏం...వ్రతంచెడ్డా ఫల ముంటుందంటావా మార్కండేయులూ?' ఇంకొకడు వంతపాడాడు.

'ఒరే కుర్రకుంకల్లారా! నోరుమూసుకొంటే మంచిది. అదేం మాణిక్యంకాదు ఇష్టమొచ్చినట్లు వాగడానికి? ఈమె మొగుడికి ఈ సంగతి తెలిసిందో మక్కెలు యిరగొట్టడం ఖాయం...కాబట్టి నాయనలారా ప్రమాదం...పైపెచ్చు ఈ యమ్మ మంచిది... ఎప్పుడోగాని ఇటురాదు...మీ సంగతి చూచుకోండి... కాదంటారా బస్తీకిపోండి' అని లోకం తెలిసిన మనిషి చీవాట్లు పెట్టేటప్పటికి క్షణంసేపట్లో అక్కడ నిశ్శబ్దం తాండవించింది.

అరుంధతి రోడ్డు మలుపుతిరిగి, చుట్టూ ఎత్తైనగోడలున్నమేడముందు గేటుతీసుకొని లోపలకు అడుగుపెట్టింది. అక్కడ ఎడంవైపు గొడ్లసావిళ్లు ఉన్నవి. వాటికి దాపుగా వేపచెట్టు ఉన్నది. కుడివైపున పెద్దగడ్డివాములున్నవి. వాటికి ఉత్తరాన, మేడకుముందు ధాన్యపుపురి వున్నది. వీటి మధ్య గుండాకాని, ప్రక్కలవెంటకాని వెళ్లినా మేడ ఎదురుకు వెళ్లవచ్చు.

అరుంధతి మేడదగ్గరకు వెళ్లి మెట్లెక్కి 'అమ్మగోరూ!' అని పిలిచింది. ఎక్కడనుంచీ అలికిడి, అజా లేదు.

చొరవగా దగ్గరకువేసిన పెద్దతలుపు నెట్టుకొని, లోపలికి వెళ్లేటప్పటికి లోపలనుండి మనిషి వస్తున్న సద్దు విన్పించింది. అలానే ఆగిపోయింది అరుంధతి. వచ్చిన వ్యక్తి అరుంధతి నెత్తిపై పెట్టుకొని తెచ్చిన చెప్పులు ధరించబోయే దొర భుజంగరావు. అమ్మగారనుకొన్నస్థానే దొరగారు ప్రత్యక్షంకాగానే క్షణంసేపు అరుంధతి స్థాణువయ్యింది.

ఎప్పుడో మనసులో అనుకొని, అనుకొని, అనుకొన్న యువతి, అనుకోనివిధంగా, చల్లనిసాయంకాలం, ఒంటరిగా కన్నులముందు, ఎవరూ లేనప్పుడు

కవ్వించగానే కల నిజమై ఎట్టయెదుట నిల్చినట్లనిపించింది భుజంగరావుకు. గుండె గుహలో రుచి మరగిన వాంఛల మృగాలు కళ్ళు మలుముకొని భయానకంగా గర్జించిన వైఖరి ఆతని ముఖంలో ప్రస్ఫుటమయింది.

వెత్తిమీద పాదరక్షలతో పుత్తడిబొమ్మలా నుంచున్న అరుంధతి మొదట భద్రకాళిలా, తర్వాత రతీదేవిలా, ఆ తర్వాత అరుంధతిలా అనిపించింది భుజంగానికి.

ఈ సంరంభంలో చేతిలోవున్న తెల్లనిమాత్రలున్నసీసా, అతని గుండెలాగే జారిపోయి క్రిందపడి పగిలిపోయింది. మాత్రలన్నీ చిందరవందరయ్యాయి.

'అరే'అని క్రిందకి వంగాడు భుజంగరావు 'అయ్యో!' అంది అరుంధతి చెప్పులు చేతబట్టుకొని.

'ఈనాటికి గుండె పగిలిపోయింది...' అన్నాడు భుజంగరావు.

'దొరగోరూ! ఏందంటున్నారు?'

'అబ్బే! ఏంలేదులేవే...సీసా పగిలిపోయింది అని అనబోయి...ఇట్లా...' సర్దుకొన్నాడు మాటను.

'ఆ మాత్రలెందుకుండి మరి...'

'పంచదారకు బదులుగా...ఏసుకుంటారులే... ఇంతకీ అడురాకండా నువ్వొచ్చావేం...ఏంటే సంగతి' కన్నుల్లోకి చూస్తూ కన్ను గీటాడు భుజంగరావు.

ఒళ్ళు కంపించింది అరుంధతికి 'పనుండి... రాలేదు దొరగోరు...ఇయిగోండి సెప్పులు...నే నొత్తా నండి...పొద్దోయింది......' చెప్పులు గోడవారను ఉంచింది.

'పొద్దువుగానివే ఆగవే...కొంచెంసేపు......మీ దొరసానిలేదు...మీ దొరసానుంటే అప్పుడే పోయ్యే దానివా? ఏందబ్బా...తొందర...మరీ...మరీ...' ఆరిపోయిన గొంతులోనుండి మాటలు పెగల్లేదు.

అరుంధతి కాళ్ళక్రింద భూమి ఆ మాటలతో జారిపోయినట్లనిపించింది. ఒళ్ళంతా చెమట మయమయ్యింది.

'ఇంటికాడ పిల్లోళ్ళు దొరగోరు...మావోడు తొరగా...వచ్చెయ్యమన్నాడు......నే నొత్తా...' వణుకుతూ మాటలు వెలువడుతున్నాయి.

'అట్లాగేనే...పండక్కి పెట్టినకోక బావుందా? అహో...మీ దొరసానికి నువ్వీసంగతి చెప్పలేదంటగా... అందుకడుగుతున్నా ... నచ్చకపోతే ... చెప్పు రేపే కొంటా...ముంది...ఏమంటావ్?' చిన్నగా నవ్వాడు. ఆ నవ్వులో సహజత్వం కనబడలేదు.

'యెందుకులెండి ... ఆ కోక... బాగుంన్దండి' పైటతో ముఖం తుడుచుకొన్నది.

'ఆహో...' తేరి పారజూచాడు అరుంధతిని. భుజంగరావు మనస్సులో కాంక్షల భుజంగం బుస్సుమన్నతీరు అతని కన్నుల్లో దాగలేకపోయింది.

'యింగ...నే...బోతాను...దొరగోరు' వెనక్కు మళ్ళింది.

'ఊం...వుండవన్నమాట కూసేపుకూడ...సరేగాని...పోయేటప్పుడూ...ఏపచెట్టుదగ్గర వసారాలో వున్న సుక్కగేదెకు...వాములో గడ్డేసి...పో' అని నిట్టూర్చాడు భుజంగరావు.

ఒక్క అంగలో ద్వారబంధంవాటి ముక్కోటి దేవతలను ప్రార్థించింది అరుంధతి.

మెరుపులాగా తొంగిమూసి ఏదోపని సాధ్యమైనంత తొందరగా ముగించి, ధాన్యపు కొట్టుమీదుగా గడ్డివాము దగ్గరకు బయలుదేరాడు భుజంగరావు. తలలో ఉల్లోలంగా ఆలోచనా కెరటాలు విషనాగుల్లా సుళ్ళు తిరుగుతుంటే ఆ కెరటాల మధ్యలో అనుకొన్న అంగనరూపం సముద్ర మథనంలో సాక్షాత్కరించిన లక్ష్మీరూపంలా అనిపించింది. ఏవో మధురోహలు గుండెలో పదునై కన్నులలోనుంచి వెలికివస్తున్నవి. నీతి, నిజాయితీ, ధర్మం, న్యాయం, దారుణం, దానవత్వం — ఈ భావాలన్నీ ప్రచండమైన వాయువు

తాకిడికి తేలిపోయి, పారిపోయే మేఘాల్లా మనసులో నుండి క్రమంగా పలాయనమైనాయి. అతని కళ్ళు చూస్తున్నాయి. మనసు కళ్ళు మూసుకుపోయాయి.

గబగబా గడ్డివాములోనుండి రెండు వాట్లులాగి తీసుకొనివచ్చి వసారాలో కవర్లాడుతున్న గేదెముందు వేసి, దూగర దులుపుకొని వెనుతిరిగేటప్పటికి ఎదురైన భుజంగరావును చూసి, పాము పడగ క్రింద చేసిన కప్పలా భయవిహ్వల అయ్యింది అరుంధతి. దారికి అడ్డంగా వెకిలిగా నవ్వుతూ నిలబడ్డ భుజంగం ఆమె ప్రాణానికి యమునిలా అనిపించాడు.

'దొరగోరు...ఏందిది' మానం, మర్యాద కరడు కట్టి గొంతులో ధ్వనించింది.

'అరుందా! ... నిజంగా ... తెలియదంటే?... పదేళ్ళనుంచి......ఇందుకోసం......కాసుకున్నానే..... నువ్వొప్పుకో...యీ మేడకి రాణిని చేసేస్తా కావాలంటే... నువ్వు కోరుకున్నది...ఇప్పుడు కావలంటే ఇప్పుడే... ఇస్తాను...రా...ఒక్కసారికి...రా...' కనులు తిరుగుతుండగా దగ్గరకు వచ్చాడు.

'దొరగోరు...ఎవురితో పరాసికాలాడుతున్నావో తెలుసునా? నువ్వేమవుతావో గెపితికి దెచ్చుకో...' కోడె నాగులా బుసలుకొట్టింది.

'ఊ...ఊఁ...ఏందే...నీ మొరాయింపు...ఈడకొచ్చి...యేడకిబోదామనుకొంటన్నావ్?...అదురుష్టం కొద్దీ...ఇంటో ఎవరూలేరు...ఇదీ నీకూ మంచిదేనే... మరియాదగా రా...' పైటకొంగు పడేసి పట్టుకొన్నాడు. దిమ్మెరపోయింది అరుంధతి. పిచ్చిబలంతో పట్టుకొన్న పైటకొంగును గట్టిగా గుంజుకొన్నది. భుజంగం పట్టుజారిపోయి ముందుకు తూలిపడ్డాడు. అరుంధతి వసారాలోనుండి బయటకు వచ్చింది.

'సీ...యదవసచ్చినోడా! కొంగు పట్టుకుంటా వట్టా...నిన్నూ...నిన్ను...పూ నేయిస్తా ... రేపీపాటికి నీ శవం తీసుద్దిమూడు...యల్లమంద పెళ్ళాం వను కొన్నావో లేదో...నా మొగుడు నీ గుండెలో నిదర బోతాడు...నీ సెర్మం...ఒలుత్తాడు...దొరవనుకొంటే దెయ్యానివయ్యావు...' నాలుగడుగులు ముందుకు వేసింది రోషంగా.

క్రింద పడిన భుజంగం మనసు రంగుల రాట్నంలా గిర్రున తిరిగింది. యల్లమంద గండ్రగొడ్డలితో తనపైకి లఘించాడు! ఇంకేముంది! తన తల గబుక్కున తెగిపోయింది! రక్తం? రక్తం! అంతా రక్తం!!

'ఏదీ అరుంధతి? వెళ్తుందా? వెళ్తే!? అమ్మో! ఇది వెళ్ళకూడదు. వెళ్ళినట్లయితే కొంప మునుగుతుంది? తాను బ్రతకడం కల్ల? నలుగురిలో నగుబాటు! మరి?? ఊఁ...ఇక...అంతే మరి!... అంతకన్నా దారిలేదు...ప్రాణం అన్నిటికన్నా తీపి!... ఎదుటి వెయ్యిప్రాణాలకన్నా తన ప్రాణం రక్షించుకోడం అవసరం...కాబట్టి...' భుజంగం మనస్సు అనుకొన్నది.

భుజంగం కళ్ళకి కనబడింది గాటిలోవున్న గసిక. గబుక్కున తీసుకొని పరుగుతీసినట్లు పడిచాడు. అరుంధతి మానసంరక్షణార్థం ముందు పరుగెత్తుతున్నది. అరుంధతి బయటకుపోతే ప్రాణం పోతుందనే భయంవల్ల భుజంగరావు అరుంధతిని వెన్నంటాడు భయంలో, ఒకవిధమైన అశక్తతతో. వెనక పరుగెత్తివస్తున్న పాదాల చప్పుడు విని అరుంధతి మెడ కొంచెం త్రిప్పిందో లేదో భుజంగం చేతిలోని గసికదెబ్బ కణతలకు తగలనే తగిలింది. దెబ్బతగిలిన చోట జివ్వుమన్నది. చర్మం చిట్లిపోయింది. ఎర్రని నెత్తురు సర్రున ఎగజిమ్మింది. కన్నులు బైర్లు కమ్మాయి. అరుంధతి నరాలు పట్టుతప్పాయి. ఆమె కూలిపోయింది. భుజంగం పాదాలవద్ద రాలిపోయింది. అతని కుడిపాదం ఆమె రక్తంలో తడిసిపోయింది.

ఆమె నోట్లోనుండి ఏవో అస్పష్టమైన మాటలు దొర్లాయి.

'అమ్మా!...నా దేముడు...నా పిల్లలు...... ఆఁ...' అరుంధతి కన్నులు మూసుకుపోయాయి.

పల్లెలో అరుంధతి పిల్లలు నిద్రలో కెవ్వు

మన్నారు. ఎప్పుడూ లేనిది యెల్లమంద చెయ్యి కోసు కొన్నాడు గూటిలోని దీపంబుడ్డి కొండెక్కింది.

చీకటిపడింది భుజంగం మనస్సులో చీకటి విడింది.

'అయ్యో !......భగవంతుడా ! ఏమనుకొంటే ఏమైంది?...ఇప్పుడెలా...?? ఏమిటి చేయడం...? ఈ ప్రమాదంనుంచి గట్టెక్కేదెలా? నేను తీసు కొన్న...గోతిలో...గోతిలో...అవునవును... గోతిలో... ఓహో...దేవుడికి వంద దండాలు......ఎంత...... మాంచి...ఆలోచన ఇచ్చాడు......వంద కొబ్బరికాయ లన్నా......' భుజంగం పిచ్చిగా నవ్వుకొన్నాడు. కనురెప్పలు ఎగరేశాడు. పంచ ఎగగట్టుకొన్నాడు. పలుగు పార తీసుకొన్నాడు. చకచకా కొద్దిసేపట్లో ఆరు అడుగుల పొడవు, మూడడుగు వెడల్పుగల గోతిని త్రవ్వాడు వేపచెట్టుక్రింద. పడిపోయిన అరుంధతి దేహాన్ని తీసుకొనివచ్చి, ఆ గోతిలో పెట్టి మట్టిలో కప్పి, చదునుచేశాడు. అనుమానం ఎవరికీ కలుగ కుండా పంచపంచగా ఎండుగడ్డి వెదజల్లాడు. తన పాపం పాతిపెట్టుకొన్న భుజంగం ఒకవిధమైన వెర్రి తృప్తితో నిట్టూర్చాడు.

చీకటి ముదిరింది. చుక్కల వెలుతురు ముదిరింది. రివ్వుమని దూబరలు ఆ చీకటిలో ఎగురు తున్నవి. ఎక్కడో ఉత్తితపిట్ట శివం ఎత్తినట్లు అరుపు. దూరాన నీళ్లుపెట్టిన మాగాణిలోనుండి కప్పల అరుపులు. ఏవో పక్షుల కలవరింపులు. చీకటి గుండె స్పందనల్లా కీచురాళ్ల శబ్దం.

మత్తుగా, మగతగా అరకన్నులు మూస్తున్న భుజంగరావుకు 'దొంగోరూ!...ఓదొరగోరు...' అని పిల్చిన ఎల్లమంద గొంతు వినగానే మత్తు, మగతా విచ్చిపోయి గుండె పచ్చినంత పనయ్యింది ఒక్క ఉదుటున లేచికూర్చొని, పడకగది తలుపు తెరచి, మధ్యగది బయట తలుపుతెరవాడు ఎదురుగా ఎల్ల మంద కన్పించాడు. అతని రాకలోని ఆంతర్యం అర్థమై గుండె చిక్కబట్టుకొన్నాడు.

'ఏంరా...ఏంది...ఈ రేత్రేళ వొచ్చే వేం... డబ్బు గావలిసొస్తే...నీ పెళ్లాంలో చెప్పి... పంపక పోయావా?...సారాకి డబ్బులు లేవా? ఎంతగావా లేంది...' విసుగు ప్రదర్శించకుండా మెత్తగా మాట్లాడుతున్నాడు.

'నాకేమొద్దు దొరా...మాయింటిది...ఇంగా... కొంపకు రాలేదొద్దొరా...అందుకని సూస్సిసి విగాకాడ కొచ్చిరా...యేమైందో దొరా...' యెల్లమంద గొంతులో వణుకు, బాధ కనబడుతున్నాయి.

'ఏందిరా మస్సనేది? నీ పెండ్లాం రాలేదం టావా? నీ మొకం...నాకు చెప్పాలిచ్చి...యెంటనే వొచ్చిందిర దరా...దానిదుంపదెగా...యెంత ఆలస్య మైనా...ఇంత ఆలస్యంగా...ఈపాటికి...యెల్లుంటది లేరా...పో'

'ఏందో దొరా...నా కెట్టాగోవుంది' దిగు లుగా అన్నాడు.

'వోరే...యెల్లమందా!...నువ్వొత్తి పిచ్చో డివిరా...నీ పెళ్లాం...సర్దాగా...సినిమ్మ కెళ్లిందేమో లేరా' వెకిలిగా నవ్వుతూ అన్నాడు.

'దొరా...' కంచులా మ్రోగిన కంఠనాదం విని చుంచులా అదిరిపడ్డాడు భుజంగరావు అతని ప్రాణాలు తావులు తప్పాయి.

'ఏందిరా నీ గిరువమానం!.. దొంగరెడ్డిగోడు... నీ పెళ్లాం...రోస్సమ్మ గుసగుసలాడతాపోతుంటే... నేను...సూసింది...యిప్పుడు...జెప్పు...ఏందో...' పెదాలపై అదోలంగా నవ్వాడు

'దొరా...అట్టాననాకు దొరా...అదటువంటిది గాదొద్దొరా...అగ్గి......అగ్గిలాంటిది దొరా అది...' పిడికిళ్లు బిగించాడు.

'వోరే...యెల్లమందా !...నే నెమన్నాన్రా... నే చూసింది చెప్పానుగాని...కతగాదురా...నీ పెళ్లాం సంగతి నాకు తెలియదురా పిచ్చోడా... రాకపోద్దం టావా?...ఇంటికిబోరా నువ్వు......ఇదుగో చిత్తుగ తాగి......పోరా...' వెకిలగా నవ్వుతూ భుజంగం ఎల్లమంద చేతిలో పెట్టాడు.

ఆయిష్టంగా తీసుకొన్నాడు ఎల్లమంద. అతని మనసులోని కసి, రోషం, పౌరుషం కళ్లను కుంచించివేశాయి. పళ్లు కొరికాడు చీకటిలో అతని కళ్లు పగబట్టిన కోడెత్రాచు కన్నుల్లా ఉన్నాయి. భుజంగం అప్రయత్నంగా ఒక్క అడుగు వెనక్కువేశాడు.

'హత్తా...దొరా...దండాలు...దొరా..' అంటూ కదిలాడు ఎల్లమంద బిగబట్టిన ఊపిరి వదిలాడు భుజంగం.

కొద్దిరోజుల్లో అరుంధతి సంగతి ఊరంతా పొక్కిపోయింది. రకరకాల వ్యాఖ్యానాలతో వదంతులు ప్రచారమయ్యాయి. ఎల్లమంద పిచ్చివాడిలా తిరుగుతున్నాడని సానుభూతిగా అనుకొన్నారు అందరూ. బరువు తీర్చుకొన్నట్లు అనిపించింది భుజంగరావుకు ఆమాట వినగానే.

క్రొత్త చెప్పులు తొడుక్కున్న భుజంగరావుకు కుడికాలు చెప్పు పట్టెడ కరవడంచేత మొదట రాసుకుపోయింది. తర్వాత ఎర్రగా పుండుపడింది పైన. ఇంకా రెండు మూడు రోజులైనతర్వాత బరువుచేసింది కాలు కదపడానికి వీలులేనంత పరిస్థితి ఏర్పడింది. భుజంగరావుకు తన కాలును చూచుకొన్నప్పుడు ఎందుకో అరుంధతి రక్తం అక్కడ అంటుకొని ఉన్నట్లు భ్రాంతిపొందేవాడు అందుకనే ఆకాలుపైవే చెప్పపుండు పడగా మరింతగా క్రుంగిపోయాడు ఆకాలును చూస్తున్నంతసేపూ తాను చేసిన దౌష్ట్యం, అమానుషకార్యం కన్నులముందు గజ్జకట్టి ఆడేవి. ఆరోజు, అరుంధతిని పాతిపెట్టిన తర్వాత ఎన్నో లెక్కలేనన్ని సార్లు నీళ్లతో స్నానంచేసి, ఆకాలు రుద్దిరుద్ది గట్టిగాతోమి, సబ్బుతో కడిగి, మట్టితోపామి శుభ్రం చేసుకొన్నాడు. కానీ, ఆతర్వాత కాలును ఎప్పుడు చూచుకొన్నా ఏమిటో రక్తసిక్తమయినట్లు కనిపించేది. అటువంటి దక్షిణ పాదానికి ఇప్పుడు పాదరక్షచేత కల్గిన వ్రణం పులిమీద పుట్రలాగే అనిపించింది భుజంగరావుకు.

అప్పటినుండి దయ్యం పట్టుకొన్నవాడిలా క్రుంగి, కృశించిపోయాడు భుజంగం. ఎరుపురంగు దిక్కుల్ని, విరిసిన మందారాల్ని, ఎక్కడైనా ఎర్రని రంగునుచూస్తే — ఎర్రరంగునుచూసి బెదిరే పశువులా తనపాదాన్ని చూసుకోడానికే బాధపడి పోయేవాడు లోలోపల

మొదట్లో ఆ పుండుమ తోలుకాల్చి, కొబ్బరినూనెలో కలిపిన నల్లని మిశ్రమాన్ని రాయడం జరిగింది. సాధారణంగా ఆ వైద్యంలో అటువంటి పుండ్లు నయంకావడం కద్దు. భుజంగానికి పైమందు ఎందుకో ఏమాత్రం పట్టు ఇవ్వలేదు; సరిగదా మరింత విషమించింది.

అతని పరిస్థితి చూసిన అతని దగ్గరవాళ్లు స్నేహితులు, బంధువులు ప్రక్కన ఉన్న పట్నానికి వెళ్లి డాక్టరు సలహా తీసుకోమని ఎంతగానో చెప్పి చూశారు. ఆ మాటలు భుజంగం చెవి కెక్కలేదు. భార్య ఏడుస్తూ చెప్పిచూసింది. ఇదిగో రేపు, ఎల్లుండి అని గడిపేశాడు చాలకాలం. చివరకు ఏమాత్రం నడువలేని పరిస్థితి ఏర్పడింది. కాలు మోకాలిచిప్ప వరకు బాగా వాచిపోయింది. ఆ ఎర్రనిపుండు భుజంగాన్ని వెక్కిరించినట్లనిపించింది. భుజంగం బాధగా కాలును చూచుకోబోతే ఆ ఎర్రనిపుండులోనుండి అరుంధతి అట్టహాసం చేస్తున్నట్లనిపించేది. అప్పుడు భుజంగం నిలువెల్లకంపించిపోయేవాడు కళ్లు గట్టిగా మూసుకొనేవాడు వణికిపోయేవాడు. కెవ్వుకేకవేసేవాడు. కళ్లు తెరచిచూస్తే అంతా మామూలే తర్వాత!

ఇలా రెండు, మూడుసార్లు జరుగగా మానసికంగా, శారీరకంగా కుమిలి, క్రుంగిపోయాడు భుజంగం. ఆనాటి దృశ్యం మనస్సులో మెదిలితే ఎదురుగా అరుంధతి సాక్షి లభించినట్లు అనిపించేది. సలుపు, పోటు పెడుతున్న కాలువైపు చూచుకోబోతే పుండులోనుండి అరుంధతి తొంగిచూసి భీతావహంగా నవ్వినట్లు అనిపించేది. తన జీవితాన్ని, ప్రశాంతను వేటాడే దుర్భరసంఘటననుండి విముక్తి పొందటం ఎలా అనే ఆలోచనలో సతమతమైపోయేవారు భుజంగం. పదేపదే ఈ విధంగా జరగడంమూలాన అతని మెదడు మొద్దుబారిపోయింది. ఈ పరిస్థితుల్లో ఒకనాడు స్పృహతప్పి పడిపోయాడు భార్య

కేకలు పెట్టింది. చుట్టుప్రక్కలవాళ్ళు చేరారు డాక్టర్ దగ్గరకు తప్పితే గత్యంతరంలేదని వాళ్ళే నిర్ణయించుకొని, భుజంగాన్ని పట్నం తీసుకుపోయారు.

భుజంగాన్ని పరీక్షించిన డాక్టర్లు పెదవి విరిచారు. అసలే డయబిటీస్ రోగి అయిన భుజంగం ఇంత కాలంగా ఆ పుండు గురించి నిర్లక్ష్యం చేయడంవల్ల ప్రమాదం ముంచుకొని వచ్చిందని నిర్ధారించారు. రోగి అర్థంకాని భయంతో, ఆందోళనతో బాధపడుతున్నట్లు కూడా చెప్పారు. ఈ విషమ పరిస్థితుల్లో ఆ పుండును ఆపరేషన్ చేస్తే అది సెప్సిస్ అవడం తప్పదు. ఏదో అని ఆపరేషన్ చేసినా మనే సంతృప్తి తప్ప ప్రయోజనం శూన్యం అని తమ అభిప్రాయాన్ని వెల్లడించారు

ప్రాధేయపడినవాళ్ల ప్రార్థనను బట్టి భుజంగానికి ఇన్సులిన్ ఇంజక్షనులు ఇచ్చారు. కన్నులు విప్పిచూసిన అతను భయంగా అందరి ముఖాలు చూశాడు. ఆ ప్రశ్నాముఖాల్లో ఏమిగా కనిపించిందో ఏమో మరలా ప్రయత్నపూర్వకంగా కన్నులు మూసుకొన్నాడు. అతని ఒళ్ళంతా చెమటతో నిండిపోయింది. అతను వణికిపోయాడు. కన్నులలోనుండి రెండు అమాయకమైన కన్నీటిబొట్లు తొంగిచూశాయి. కొద్ది సేపటికి తెరచిన అతని నోటిలోనుండి 'ఆం... ఆం...రం...దా...దా...' అనే అక్షరాలు వెల్వడ్డాయి. దగ్గర ఉన్న మనుష్యులు, డాక్టర్లు ఆశ్చర్యమయంగా ఒకరిముఖాలొకరు చూచుకొన్నారు. భుజంగరావు భార్య బావురు మన్నది.

కిటికీలోనుండి కనబడుతున్న అరుణ వర్ణాంకిత పశ్చిమదిగ్భాగం అర్థమైనట్లుగా నవ్వినట్లనిపించింది.



ఆంధ్ర గద్యచంద్రిక

శ్రీ నిడుదవోలు వెంకటరావు

ఈనాటికీ తెలుగుభాషలో అపరిశీలితంగా ఉన్న శాఖలలో సంకలనగ్రంథశాఖ కూడా ఒకటి.[1] ఆంధ్రసాహిత్యంలో ఆదినుండీ పద్యకావ్యాలకే ప్రతిష్ఠాస్థానము గలగడముచేత వచనరచనకు ప్రాధాన్యం లేకపోయింది. అందుచేత తెలుగులో మొదట పద్యకావ్య సంకలన గ్రంథాలే బయలుదేరినవి. ఆధునికయుగంలో పద్యంకన్న వచనమే వ్యాప్తం కావడమువల్ల — వచన సంకలన గ్రంథాలు బయలుదేరినవి. అట్టివానిలో 'ఆంధ్రగద్యచంద్రిక' ఒకటి. దీనిని 1. కళాప్రపూర్ణ శ్రీవిశ్వనాథసత్యనారాయణ, 2 విద్వాన్ శ్రీ మల్లంపల్లి శరభయ్యశర్మ, 3. శ్రీ చెఱుకుపల్లి జమదగ్నిశర్మ, 4 శ్రీ టి. భాస్కరరావు అనువారు సంపాదకవర్గముగా నేర్పడి సమకూర్చారు.

ఇది ఆరు సంపుటాలుగా విభక్తమై యున్నది. ప్రతిసంపుటికి ఒక పీఠిక గలదు. ఆ పీఠికలు, శీర్షికలు 47 పుటలు—మొత్తం 403 పుటలలోను 47 పుటలుపోగా మిగిలిన 356 పుటలు అసలు గ్రంథానికి సంబంధించినవి. ఈ 356 పుటల్లోను, 68 గ్రంథాలనుండి వచనభాగాలు సంగ్రహింపబడినవి — వీని వివరాలు:

1. ప్రథమ సంపుటి : నన్నయభారతభాగము.

2. ద్వితీయ సంపుటి : తిక్కనసోమయాజి; ప్రబంధకవులు.

3. తృతీయ సంపుటి : వచన పురాణములు; పారాయణ గద్యలు.

4. చతుర్థ సంపుటి : వచనములు; కథలు; యక్షగానములు.

5. పంచమ సంపుటి : క్రైస్తవయతులు; యాత్రలు.

6. షష్ఠ సంపుటి : పత్రికలు; లేఖలు; పెద్దబాలశిక్ష; నీతిచంద్రిక.

గ్రంథ సంపాదకవర్గంలో నలుగురున్నప్పటికీ, వారిలో శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారే, ఈ సంకలనానికి పూర్తిగా ఆధ్వర్యము వహించినట్లు 'మున్నుడి'[2] వల్ల తెలుస్తున్నది. అందు వారిట్లు వ్రాశారు :

'ఇందులో భాగములకు పీఠికలవంటి వక్కడ నక్కడ వ్రాసినాము. నన్నయ్యగారి గద్యమునకు మాత్రము నే నొక్కడనే వ్రాసితిని. తక్కినవన్నియు మే మందరమును కలిసియే వ్రాసితిమి. అనగా కూడబలికికొని నలువురి యభిప్రాయములను క్రోడుచేసికొని వానిని నేను నా భాషలో వ్రాయించుట జరిగినది'.

పై వాక్యాలలో 'వ్రాసినాము' 'మేము' 'వ్రాసితిమి' అను బహువచనము లుండడమువల్ల— నన్నయ భాగపీఠిక వినా, తక్కినవి నలుగురూ కలిసి రచించినట్లే ధ్వనించుచున్నది. అయితే, తరువాతి, ఏ పీఠికలలోను మిగిలిన ముగ్గురు సంపాదకుల పేర్లు లేనేలేవు. ఇక ఆ పీఠికలలో, సందర్భవశాత్తుగానైనా, తక్కిన సంపాదకులలో, 'ఫలానావారి

---

1. ఈ సంకలనగ్రంథాలనే—ఆకరగ్రంథాలని వ్యవహరిస్తారు. వీనినిగూర్చి యిదివరకే తెలుపబడినది. 'తెలుగుభాషలో ఆకర గ్రంథాలు.' భారతి—జూలై—1963. పుటలు 59—64.

2. మున్నుడి—3—6 పుటలు.

అభిప్రాయమిది' అన్న సూచన ఈషన్మాత్రమైనాలేదు. చివర వాక్యమున 'వ్రాయించుట' అనగా నితరులచేత నని యర్థము కదా! అప్పుడు తక్కిన సంపాదకుల చేత, విశ్వనాథవారు 'నా భాషలో' అనగా, తమ భాషలో వ్రాయించిరని స్పష్టమగుచున్నది కాని గ్రంథమందట్లులేదు. కాబట్టి తక్కిన ముగ్గురి సంపాదకులకు, పీఠికారచనముతో సంబంధములేదని, కేవలము గద్యభాగ సేకరణమునందుమాత్రమే సంబంధ మున్నదని, ఆ పీఠికలన్నియు విశ్వనాథ వారి విరచితములేయని విశదమగుచున్నది.[3]

గ్రంథనామము

నేటి సాహిత్యప్రపంచమున సర్వే సర్వత్రా—వచనరచన- వచనరచనాపరిణామము—వచన వాఙ్మయ చరిత్ర, వచనయుగము—అని వచనపదమే వ్యవహారములో ఉన్నప్పటికీ ఈ గ్రంథంలో, ఎక్కడా, పీఠికలలో, ఆ విషయమే ప్రస్తావించకుండా, దీనికి ఆంధ్రగద్యచంద్రిక అన్న పేరుపెట్టడం అసంబద్ధము—వచన వాఙ్మయ చారిత్రక పరిణామ విరుద్ధమునై యున్నది. ఇందు నన్నయనుండి చిన్నయవరకు గ్రంథభాగము లున్నవి. బహుశః చిన్నయసూరి 'నీతిచంద్రిక' ననుసరించి వీనికి 'గద్య చంద్రిక' అని పేరు పెట్టబడినట్లు తోచుచున్నది. అప్పుడు 'గద్య చంద్రిక' అన్న సరిపోయెడిది—'ఆంధ్ర' పదము చేర్చుట వలన—తెలుగు భాషలో ఆంధ్ర గద్యము వేఱు, సంస్కృత గద్యము వేఱుగాను అర్థమై, గ్రంథ ప్రణాళికకే భంగము కలిగించుచున్నది.

1. 'గద్య చంద్రిక' అను పేరున్నప్పుడు—చిన్నయసూరి రచన యిందు చేర్చుట కవకాశమే లేదు—చిన్నయసూరి తన రచనలలో 'గద్య'పదము వాడనే లేదు. నీతి చంద్రిక అవతారికలో—

క. నవభాజనమున లగ్నం
బవు సంస్కారంబు వోలి యదటుగావున మా
ణవులకుఁ గథాచ్ఛలంబునఁ
జవి యొట్టఁగ నీతి 'వచన సరణి' రచింతున్

అని 'వచన' పదమునే యుపయోగించినాడు[4].
బాలవ్యాకరణము - పీఠిక

'కాబట్టి యా లక్షణ గ్రంథములు చదువువారికి నిస్సందేహముగా 'వచన రచన' సేయు కౌశలము చిరకాలము బహులక్ష్యములందుఁ బరిశ్రమ చేయక రానేరదు.'[5]

చిన్నయసూరి తరువాతను 'నీతిచంద్రిక' 'వచన కావ్యము' గానే పరిగణింపబడినది కాని గద్య కావ్యముగా గాదు.

'ఈ వచన కావ్యము 'నీతిచంద్రిక' మిక్కిలి ప్రౌఢముగాను లక్షణములకు ముఖ్య లక్ష్యములుగాను జక్కని ప్రయోగములు గలదిగాను కానబడుటచేత లోకమునందిది విశేషవ్యాప్తి గలిగియుండఁ దగినది.'

సుజనరంజని పత్రిక (1865 డిసెంబరు).

'చిన్నయసూరి ధీరులెదఁజేరిచి
సారెకు నాదరింపఁగా
మున్ను రచించి మించె సగము
న్వచనంబుగ నీతి చంద్రికన్'[6].

2. ఈ గ్రంథము మొదటి రెండు సంపుటములలో, తెలుగున కావ్యప్రబంధములు, ముప్పయి రెంటింటినుండి, వచన భాగము లుద్ధరింపబడినవి.

---

3. ఈ గ్రంథము ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీవారి ప్రచురణ.

4. నీతిచంద్రిక. ప్రథమ ముద్రణము క్రీ.శ. 1853. అవతారిక 21 వ పద్యము క్రీ.శ. 1856 ద్వితీయ ముద్రణము.

5. బాలవ్యాకరణము—ప్రథమ ముద్రణము—పీఠిక. క్రీ.శ. 1858.

6. కందుకూరి—సంధి విగ్రహము—కృత్యాది క్రీ.శ. 1872.

తెలుగున రామాయణ భారత భాగవతాది మహాకావ్యములును, మనుచరిత్రాది ప్రబంధములును, వానియందు వచనములున్నను, అవి పద్యకావ్యముల క్రిందనే పరిగణిత మగును కాని, వచన గద్యకావ్యముల క్రింద పరిగణితములు కావు. ఇది సాహితీ విమర్శకులకందఱకు సుపరిచితమైన విషయము కాబట్టి వాస్తవముగా వచన వాఙ్మయమున దీనికి స్థానము లేదు. గ్రంథమంతయు— ఆదినుండి అంతము వఱకు ఏకాకారముగా వచనముగా మున్నయెడల వచన వాఙ్మయమున స్థానమున్నది. అయినను తెలుగున—కావ్యప్రబంధ వాఙ్మయమున నున్న వచన రచనలలో, కవిత్రయము, శ్రీనాథుడు, పోతన, వీరి యైదుగురి రచనలలోమాత్రమే ప్రత్యేక విశిష్టత యుండుటచేతను, తక్కిన ప్రబంధ రచనలలో వైవిధ్యము లేకపోవుటచేతను వాని కెంతమాత్రము స్థానము లేదు. ఇంతకూ ఈ గ్రంథమున ముద్రితమైన యీ కావ్యప్రబంధభాగములన్నియు మూల గ్రంథములలో వ. అని వచనముగానే తూవా తప్పక యున్నవి. ఇందే ద్వితీయ సంపుటములో[7] 'స్తంభోద్భవ వచనము'అని ముద్రితమైనది. వీనియందు దేచ్చటను నా భాగములు, గద్య అని పేర్కొనబడలేదు. అప్పుడీ గ్రంథమునకు 'గద్యచంద్రిక'అన్న పేరెట్లు సరిపోవును?

3. గద్యము వచనము పర్యాయపదములే యైనచో, సంపాదకులు తా ముదాహరించిన ముప్ఫయిరెండింటిలోను—ఆశ్వాసాంతములలో నన్నింటి యందును—వచనమే వ. యుండక 'గద్యము' అని యెందుకు ముద్రితమైనదో పరిశీలింపలేదు. అది గ్రంథస్థవచనముకంటె భిన్నలక్షణములు గలది. అది సమాసయుక్తమై, అనుప్రాసంతో, నానావిధమగు గమకములతో, చదువుట కనుకూలమైన రచనతో నుండును. అనగా వచన రచనలో గద్య యొక ప్రత్యేక లక్షణముగల రచనా విశేషము. అందుచే, గద్య విశేషవాచి. విశేషమగుటచేత, సర్వసామాన్యమగు వచన వాఙ్మయమున కంతకు వర్తింపదు—కావున గద్యచంద్రిక పేరు సరికాదు

4. గద్యపద్యప్రధానమైన ఈ గ్రంథంలో గద్యలక్షణము లేవో కలికమునకైనా కానరావు. సంస్కృతాలంకారికులలో వామనుడు తన కావ్యాలంకార సూత్రవృత్తిలో చెప్పిన—

'గద్యం వృత్తగంధి చూర్ణ ముత్కలికా
ప్రాయంచ'
పద్యభాగవత్ వృత్తగంధి—
అనావిద్ధ లలితపదం చూర్ణమ్
విపరీతముత్కలికా ప్రాయంచ'

అన్న విషయము లిందు కన్పట్టవు. తెలుగు లాక్షణికులలో పొత్తపి వెంకటరమణకవి 'లక్షణ శిరోమణి' అన్న గ్రంథంలో వివరించిన—1. గద్య, 2. బిరుదు గద్య, 3 చూర్ణిక, 4 వచనము, 5. విన్నపము— అను గద్యరచనాభేదము లిందు లేవు.

వామనుడు చెప్పిన 'పద్యభాగవత్ వృత్తగంధి' అనగా వచనము ప్రారంభించునపుడు—అది పద్యభాగముగా భాసించుట అను లక్షణము ఆంధ్ర సాహిత్య ప్రపంచమున నన్నయ యొక్కడే పాటించినాడు.[8] ఉదా—ప్రతిఆశ్వాసాదిని'—

'వ. అక్కథకుండు శౌనకాదిమహామునులకుం జెప్పె' అనునది—

'అక్కథకుండు శౌనకాది మహామునులకుం జెప్పె' అను సీసపద్యపాదము.

'వ. ఇట్లు మహోత్పాతంబులు పుట్టిన సురపతి బృహస్పతిం జూచి (ఆది 2—82).

'ఇట్టి మహోత్పాతంబులు
పుట్టిన సురపతి బృహస్పతిం జూచి'
ఇది కందపద్యమున రెండు పాదములు.

---

7. పుటలు 117—118

8. నన్నయ వచనరచనయందలి ఈ లక్షణమును నేను మొదట కనుగొని సాహిత్య లోకమునకు వెల్లడించినాను చూడుడు. తెలుగు కవులచరిత్ర 'నన్నయభట్టు'—పుటలు 120—123.

'వ. ఇట్లు పెక్కు మృగంబుల నెగచి చంపుచు
(భార. ఆది 4-14)

'ఇట్లు పెక్కుమృగంబుల నెగచి చంపు —' ఇది గీత పద్యపాదము.

ఇంకనూ గలవు కాని నన్నయ భారతభాగ పీఠికలో నీ గ్రంథమున పై లక్షణమే సూచితము కాలేదు. తక్కిన ఉత్కళిక—చూర్ణిక లక్షణముల సమన్వయ మంతకంటె లేదు. పై గద్య లక్షణము ఉచుంబితము అగుటచే నీ గ్రంథమున 120 వ పుటలో ఎత్తిన హరివంశమునుండి 'చూర్ణిక' అని యొక వచనభాగ ముదాహృతమైనది. కాని అది చూర్ణిక కాదు. అది ముక్తపదగ్రస్త గద్యం.

'జయ జయ జగద్భవస్థితి సంహారహేతు గుణ నిర్ధారణ వ్యపహితానేకమూర్తి విలసన! సనకాది యోగీంద్ర హృదయ......పవిత్రీకృతాఖిలలోక! లోకాయతికాది......వరాని మనోమార్గ! మార్గణ భుజంగ పీతాసుర.....హృషీక! హృషీకేశ! కేశవ నమస్తే నమస్తే నమస్తే నమః'[9]

5. సంస్కృత భాష సమస్తమూ వైయాకరణ పరిష్కృతం కావడంచేతను, నిత్యవ్యవహారంలో లేకపోవుటచేతను, సంస్కృత భాష అంతా గ్రంథస్థముగా నుండడము చేతను ఆ భాష వచనమంతా గ్రాంథిక భాషగానే పరిగణితమవుతుంది. కాబట్టి సంస్కృత భాషలో గద్యము అనే పదము గ్రాంథికభాషకే వర్తిస్తుంది కాని —వ్యావహారిక భాషకు ఎంతమాత్రమూ వర్తించదు. ఇప్పుడీ గ్రంథంలో వ్యావహారిక భాషలో ఉన్న 'కైఫీయత్తులు'-కొన్ని కథలు— చేర్చడానికి ఏవిధమైన ఆధారంలేదు.

తెలుగు భాషలో అట్లుగాక భావప్రకటనకై ప్రయుక్తమైన వచనము గ్రాంథికంగాను, జీవద్భాష కాబట్టి వ్యావహారికంగాను, రెండు విధాలుగాను ఉంటుంది. అందుచేత, ఆ రచనలు రెండింటికి 'వచన' మనేమాట రూఢియైనది. ఈ రెండు విధాల రచనల లోను ఒకటి గ్రాంథిక భాషలోనున్నా వానిని వచన రచనలని, వచన కావ్యాలని వ్యవహరించుట జరిగినది. తెలుగున వచనము గ్రాంథిక వ్యావహార—భాషారచనలు రెండింటికి వర్తిస్తుంది. ఈ సందర్భమువల్ల గద్యము వచనము, రెండూ సంస్కృత పదములేయైనా అర్థ విపరిణామంవల్ల, సంస్కృతములో వచనము లేదు తెలుగులో గద్యమూ లేదు.

సంస్కృత గద్యలక్షణాలు ప్రత్యేకంగాగల రచనలు తెలుగు కవులు చేయబట్టే— మన కావ్య ప్రబంధాలలో వానిని 'వచన'మని వ్యవహరించకుండా 'గద్యము' అని వేఱుపఱచుట జరిగినది.

పై వివరణబట్టి ఈ గ్రంథానికి 'గద్యచంద్రిక' అని నామకరణం చేయుట సుతరాము అసంబద్ధము.

ఇక వచన ప్రమేయంగాక, గద్య రచనగాని లేక, కేవలము సంభాషణ వచనము మాత్రముగల యక్షగాన నాటకమును—బడులలో వాచక పుస్తకమైన పెద్దబాల శిక్షను—ఈ సంకలనంలో చేర్చడం—వచన సాహిత్య ప్రపంచంలో, కని విని యెఱుగని విడ్డూరం!

సంపాదకుల దృష్టిలో—ప్రబంధ రచన తరువాతనే తెలుగులో ప్రత్యేక వచన గ్రంథ రచన ప్రారంభమైనది! (చూడండి! తృతీయ సంపుటి పీఠిక ప్రారంభము). అనగా క్రీ. శ. 18 వ శతాబ్ది ప్రారంభమున అన్నమాట. ఈ కారణవల్ల—ఈ సంకలన సంకల్పమల్లా సమూలంగా అప్రామాణికమైంది. ఇక ఆ సంపుటి భాగాలను గూర్చి వినండి.

---

9. ఈ గద్య హరివంశము ఉత్తర భాగము 10వ ఆశ్వాసంలో 211 సంఖ్యగా నున్నది. ఈ ఒక్క చోటనేగాదు — మొదటి రెండు సంపుటాల్లో గ్రంథాలన్నీ ముద్రితాలైనా, ఒక్క శీర్షికకూ ఆకరాలు లేవు. ఎన్నో ఆశ్వాసంలో—ఎన్నో సంఖ్యయో, ముద్రిత గ్రంథాల్లో ఉన్నా, ఇందులో లేవు. ఉదా: 107వ పుటలో 'మహాభారతము — శాంతి పర్వము — ప్రళయము' అన్న శీర్షిక యున్నది. శాంతిపర్వంలో ఆఱాశ్వాసా లున్నవి. ఇందులో 'ప్రళయము' పది పంక్తులు వెతకడానికి ఎంతకాలము పడుతుందో ప్రాజ్ఞులూహించవచ్చును. సంకలన గ్రంథాలలో ముఖ్యంగా యిట్టి ఆకరాలు అత్యావశ్యకమని సంపాదకులు గ్రహించక పోవడం శోచనీయం.

గ్రంథ వివరణ

ఇట్టి సంకలనగ్రంథములో నుదాహరించిన గ్రంథముల వివరము లుండవలెను. ఇందులో అట్టివి లేకపోవుట సరిగదా—అస్తవ్యస్తముగా నున్నవి చూడండి:

1.	భోజరాజీయము	అనంతభూపాలుడు	భోజరాజీయకర్త అనంతుడుగాని అనంతభూపాలుడు కాడు.
2.	శ్రీ సీతారామాంజనేయ సంవాదము	కర్త పేరు లేదు. ఇవి విషయసూచికలోనివి	కర్త పరశురామపంతులలింగమూర్తి ప్రథమ ద్వితీయ సంపుటములు

తృతీయ సంపుటి

3.	హాలాస్యమాహాత్మ్యము	కళువె నంజరాజు	వివరములు లేవు.
4.	బ్రహ్మోత్తర ఖండము	...	......
5.	ఆంధ్ర వచన భారతము	కళువె వీరరాజు	......
6.	భారత సావిత్రి		

దీనినిగూర్చి పీఠిక 218–219 పుటలలో హెచ్చుగా వ్రాయబడి యున్నది; 218 వ పుటలో 'ఇది సంస్కృతమునుండి తెలుగు చేయ బడినదట—ఎవరు చేసిరో తెలియదు' అనియు, 253 వ పుటలో 'కర్త యెవరో తెలియరాలేదు' అనియు కందు. భారత సావిత్రి తెలుగున రచించిన కవి ఎల్లకర నరసింహకవి; ఈతడే రచించిన మార్కండేయ పురాణ ద్విపదయం దిట్లు తన్నుగూర్చి చెప్పుకొన్నాడు:

'అనఘాత్మ ఎల్లకరాన్వయాంబోధి
పరిపూర్ణచంద్ర శోభనగుణసాంద్ర
నరసింహకవిసర్య వగసమధైర్య
లలిమీఅ తిరుమల లక్ష్మణాచార్యు
చెంగుపాదాంభోజ సేవాధురీణ
ప్రవరవాక్యములచే 'భరత సావిత్రి'
రచియించితివి కవిరాజులు మెచ్చ'

వాక్యములని యున్నది గావున నిది వచనమే. తిరుమల లక్ష్మణాచార్యుడు క్రీ శ. 1511–1568 లో జీవించియున్నాడు. భారతసావిత్రి కర్త ఆ కాలము వాడే.[10] భారత సావిత్రి రచన క్రీ. శ. 1550 ప్రాంతము. ఇది కృష్ణరాయ యుగమున బుట్టిన వచన కావ్యము.

ఈ విషయము తెలియకపోవుటచే గ్రంథము క్రీ. శ. 18 వ శతాబ్ది గ్రంథముగా భావించి తృతీయసంపుటిలో ప్రబంధములైన వెనుక చేర్చారు.

7. కామధేనువు కథ

ఇది పారాయణగద్య కాదు—కథల క్రింద చేర్చ దగినది దీనిని ప్రకటించిన ప్రభాకర శాస్త్రిగారట్లే యభిప్రాయపడిరి.

8. ఉత్తరగోపురము

ఇదియును పారాయణగద్య కాదు. ఇది రామాయణమున యుద్ధకాండమున రావణు డుత్తర గోపురము నెక్కి రామసైన్యమును చూచు సందర్భమున

---

10. ఆంధ్ర వాఙ్మయము. పుట 39. ఆంధ్రగ్రంథమాలాముద్రణము 1954.

కథ దీనికే 'గొడుగుల వచనము' అని నామాంతరము గలదు. దీనిని గూర్చి యీవలనే తెలుపబడినది.[11]

చతుర్థ సంపుటి

భవానీ మనోహర వచనములు

ఇవి శైవులలో బహుళ ప్రచారమున నున్నవి. వీనికి 'శంకర వచనములు' అనిపేరు. ముద్రిత గ్రంథమున 'పురాతన శంకర వచనములు' అని యుండుటయే దీనికి ప్రమాణము. హరిశ్చంద్రోపాఖ్యానమును రచించిన శంకర కవి వీనికి కర్త. ఆతడు క్రీ. శ. 1560 ప్రాంతమువాడు.

శ్రీ వేంకటేశ్వర వచనములు

కర్త పేరులేదు — తిరుపతి దేవస్థానమువారు వీనిని ప్రకటించిరి. కర్త ప్రసిద్ధ సంకీర్తనాచార్యుడైన తాళ్లపాక అన్నమయ్య కొమారుడు పెద తిరుమలయ్య. ఈతడు బహుగ్రంథకర్తయై క్రీ. శ. 1468—1553 మధ్య జీవించియుండెను. ఈ వచనములలో మొదటి 47 వచనములు—రాగతాళములతో పాటలుగా పాడవచ్చును. వీనికి 'వైరాగ్య వచన మాలికాగీతాలు' అన్న పేరున్నది. ఈ ముద్రణమునగల 5 వచనము లిట్టివే.

1. శ్రీ వేంకటగిరిదేవా	గుజ్జరి	ఏకతాళి
2 నందకాయుధధరా	శంకరాభరణము	త్రిపుట
3. అలమేలుమంగాపతి	శ్రీరాగము	ఏకతాళి
4. క్షీరాబ్ధిశయనా	రామక్రియ	రూపకము
5. దామోదరా	లలిత	జంపె

శఠకోప విన్నపములు

ఈ శీర్షిక క్రింద 2 వచనము లున్నవి. అవి 'నమోనమశ్శఠకోపదేశికోత్తమా!' అను మకుటముతో నున్నవి కాని 'శఠకోప విన్నపములు' అను శీర్షిక క్రింద ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారములో నున్నవి యీ మకుటముతో లేవు—చూడండి.

"శఠకోప విన్నపములు"

మొదలు—'అఖిలాండకోటి బ్రహ్మాండనాయకా మీకు పునఃపునః ప్రదక్షిణ నమస్కారంబుచేసి నా తుచ్ఛమనస్సున మిమ్ము వర్ణించెదనన వాక్పతి, బృహస్పతి దివస్పతులకైన వర్ణింపనలవిగాని మీ దివ్య తిరునామములు వర్ణింపుమన్నాడనే.....ఆదిమధ్యాంత రహిత.'

చివర 'శరణాగత వజ్రపంజరా! నా దురితంబులు ఖండించి మీ దాసానుదాసులకు దాసుండనై వర్తించే బుద్ధి పుట్టించి నా దుర్గుణంబులు చూడక మీ పతితపావనబిరుదు ప్రతిష్ఠించి పతితుండనైన నన్ను రక్షింపవే ఆశ్రితజనమందార అఖిల లోకాధార, అఘదూర నమోనమో లక్ష్మీవల్లభా'.[12]

ఈ శఠకోప విన్నపములు — ద్రవిడవేదమని ప్రసిద్ధిగన్న తిరువాయిమొళికి తెలుగు—ఇవి కృష్ణమాచార్య రచితము—'ద్రవిడ వేదంబు తెలుగు గావించు, కృష్ణమాచార్యులను' అని తాళ్లపాక చిన్నన్న పరమయోగి విలాసమున నీ విషయము చెప్పినాడు.

'శఠకోపదేశికోత్తమా' అను మకుటముగల వచనములు వేఱు. దానికి శఠకోప విన్నపములకు సంబంధమేమీలేదు.

గజారణ్యము

ఇందుండి 'గజారణ్యము' అను శీర్షిక క్రింద 21 పంక్తుల వచనమున్నది. అది శీర్షికపేరో లేక గ్రంథముపేరో తెలియదు—ఈ వచనమున గజారణ్యస్థల ప్రశంసమాత్రమే యున్నది—అయినప్పటికి భక్తి

---

11. ఆంధ్ర వాఙ్మయము పుట 62 „

12. Descriptive catalogue of Telugu manuscripts, Govt. Oriental Manuscripts Library, Madras. Volume VI. Vachana Kavyas. No. 1458. P. 1774–75 (1937) ఇందొక్క వచనమే యున్నది. ఈ తరువాత మఱి కొన్ని నేను సేకరించియున్నాను. అవి 'నమో నమో లక్ష్మీవల్లభా' అను మకుటముగలవే.

పరములైన వచనములక్రిందనే చేర్చబడినది. తెలిసిడికై వివరము లిచ్చుచున్నాను. ఇది 'గజారణ్యక్షేత్రమాహాత్మ్యము'[13] అను గ్రంథము నుండి గ్రహింపబడినది. ఈ గజారణ్యక్షేత్రమాహాత్మ్యము వచనముగా నొకటి, పద్యకావ్యముగా నొకటి లభించుచున్నవి. పై నుదాహరించిన వచనభాగ మీ రెండింటిలో దేనియందలిదో తెలియలేదు—వచన గ్రంథకర్త పేరు తెలియరాలేదు. పద్యకావ్యకర్త కవి ధాటి బంభరకవి.[14]

కాశికావచనములు

వీనినుండి ఒక వచన ముదాహరింపబడినది. 'కాశికాధీశ్వరా' అను మకుట ముండుటచేత వీనికి కాశికాధీశ్వర వచనములని పేరు. ఇవి శివయోగపరములు. క్రీ. శ. 1600 ప్రాంతములం దున్న కాశీ చెన్నబసవేశ్వరుడు రచించెనని విమర్శకులు భావించుచున్నారు.

పై గ్రంథములలో మూడు వచనము లైనప్పుడు, మధ్య 'గజారణ్యము' ఎందుకు ప్రసక్తమైనదో తెలియదు. ఈ సంపుటిలో పై వచనములు కాలక్రమమునుబట్టి యిట్లు ముద్రితము కావలెను:

శఠగోప విజ్ఞాపనములు
శ్రీ వేంకటేశ్వర వచనములు
భవానీ మనోహర వచనములు
కాశికావచనములు—

—క థ లు—
కీరబహ త్తరి కథలు

ఈ కథలు శుకసప్తతి పద్యకృతికి వచనానువాదము. దీనిని రచించినది పాటూరి రామస్వామి శాస్త్రి. ఈతడు బ్రౌనుదొరగారి కాలమువాడు. ఈ కథలు శుకసప్తతికథలు అని కర్త పేరులేక ముద్రితమైనవి.

భోజచరిత్రము

మదరాసు ప్రాచ్యలిఖితపుస్తకశాలలో భోజరాజునకు సంబంధించిన కథలుగల గ్రంథములు నాలుగు గలవు—అన్నియున్నియు భోజరాజీయము అను పేరుగలవే—సంఖ్యలు 1443, 1444, 1445, 1446. వీనిలో 1446 లో భోజరాజీయమునుండి పద్యములు లేవు — తక్కినవానిలో నున్నవి. ప్రస్తుత ముద్రణము పుట 299 లో — భోజరాజీయము నుండి పద్యమున్నది. కాబట్టి మొదటి మూడింటిలో నొకదానినుండి గ్రహింపబడియుండవచ్చును. అయితే గ్రంథము పేరు భోజచరిత్రము అని లేదు — అన్నిటియందు భోజరాజీయము అను పే రుండుటచేత, భోజ చరిత్రము అను పేరు సరికాదు.

తోతాకథలు

ఈ కథలకు 'తోతీనామా - చిలుక కథలు' అని ప్రాచ్య వచనకావ్య వివరణ గ్రంథములో నున్నది. దీని సంఖ్య 1418. తోతీనామా కథలే తోతాకథలని రుజువుచేయడానికి ఒక ఉదాహరణ చూపుతున్నాను.

పుట 301. 'కుజస్త్రీ చిలుక దగ్గరకువెళ్లి సెలవు అడిగితే వెళ్లతావుగాని నేను వక కథ చెప్తే తాను విని వెళ్లుమంటే'

సంఖ్య 1418 లో 'రామచిలుక కుజస్త్రీతో చెప్పి యిప్పుడే మంచిసమయం వెళ్లు మన్నంతలో సిద్ధమై గుమ్మంలోకి వచ్చింది.'

ప్రాచ్యలిఖిత పుస్తకశాలలో అన్నిచోట్లా తోతీనామా కథలనే యున్నది. అయితే ఈ గ్రంథమువ వేఱుగా నుండడానికి హేతువేమో?

---

13. గజారణ్యమనగా గజతీర్థము - ఇది దక్షిణమున తిరునల్వేలిజిల్లాలో తామ్రపర్ణినదీసంగమ స్థలమున గలదు. గజేంద్రమోక్షణకథ యిచ్చట జరిగిన కారణమున దీనికి గజతీర్థమనిపేరు వచ్చినది. దీనికి దగ్గఱగానున్న స్థలమే గజారణ్యము. తంజావూరి రఘునాథ నాయకుడు వాల్మీకి చరిత్రలో దీనిని పేర్కొన్నాడు.

14. దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయము. పుట. 401.

బేతాళ పంచవింశతి

303 వ పుటలో నిందుండి ఉదాహరణ యిచ్చినపుడు (మెకంజీ సంకలనము వాల్యూము సంఖ్య 32) అని కలదు. కాని ఈపేరున 1425 నుండి 1431 వఱకు సంఖ్యగల 6 ప్రతులున్నవి. వీనిలో దేనినుండి గ్రహింపబడినదో తెలుపలేదు.

తాతాచార్ల కథలు

ఈ కథలను బ్రౌను దొరగారు క్రీ. శ 1855 లో ముద్రించారు.

పంచమ సంపుటి

కైఫీయతులు

ఇవి వచన సాహిత్యములో చేరవని యీ వఱకు తెల్పితిని. ఇక యిందిచ్చినవన్నియు ముద్రితములే. అముద్రితమైనవాని నిచ్చిన బాగుగా నుండెడిది.

1. చెరువు యొక్క కైఫీయతు: ఇది "Annals of Hande Ananthapur" 'అనంతపుర బుక్కసాగర చరిత్రము' అని వావిళ్లవారిచేత ముద్రితమైనది.

2. చిన్నపువ్వు లేనె కైఫీయతు: ఇది భారతి సం 4. సం. 2 1928 ఫిబ్రవరునెలలో ప్రకటితమైనది.

3. ఏనాది జాతి చరిత్ర కైఫీయతు ఇది గద్య చింతామణిలో ముద్రితము. (1933).

4. కళింగం కైఫీయతు (మెకంజీ వాల్యూం 25) అని కలదు. ఇదే 'పూసపాటి'వారి కైఫీయతు అను పేర— వి. ఆర్. గజపతిరాజుగారిచే 1926 లో ముద్రితము.

ఈ సంపుటిలో పై నాలుగు కైఫీయతులు వరుసగా ముద్రించకుండ మధ్యను ఈ క్రిందివానిని చేర్చారు. ఇవి చారిత్రక గ్రంథాలు.

రాయవాచకము

ఇది ప్రత్యేక చారిత్రక వచన రచన— క్రీ. శ 1540 ప్రాంతమున రచితమైనది దీని ననుసరించియే కుమార ధూర్జటి కృష్ణరాయ విజయము రచించాడు. ఆంధ్ర సాహిత్య పరిషత్తువారు ప్రకటించారు.

తంజావూరి ఆంధ్రరాజుల చరిత్ర

కే. శే. ప్రభాకర శాస్త్రులవారు దీనిని ముద్రించారు.

హైదరు చరిత్ర

దీనిని మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారము వారు ప్రకటించారు.

షష్ఠ సంపుటి

పూర్వపత్రికలు

పూర్వపత్రికలలో క్రీ. శ. 1872 పురుషార్థ ప్రదాయిని—క్రీ. శ. 1874 లోకరంజనినుండి యుదాహరణ లున్నవి. 1872 కు ముందు తెలుగు భాషలో ప్రచారములోనుండిన యీ క్రింది పత్రికల ప్రసక్తియే యిందు లేదు.

1. వర్తమానతరంగిణి క్రీ. శ 1842–1850,
2. సుజనరంజని క్రీ. శ 1864–1866.
3. తత్త్వబోధిని క్రీ. శ 1864–1867.
4. ఆంధ్రభాషా సంజీవని క్రీ. శ. 1870-1883-92-99[15].

పై పత్రికలన్నియు లభ్యమగుచునే యున్నవి. అయినా ఉదాహరణములు లేవు వర్తమానతరంగిణి మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తకశాలలోనే యున్నది.

నీతిచంద్రిక

నేటికీ బహుళప్రచారములోనున్న చిన్నయసూరి నీతిచంద్రికనుండి 9 పుటల గ్రంథభాగ

15 వీనినిగూర్చి సంపూర్ణ వివరములకు— 'Literary Journalism in Telugu' అను నా ఇంగ్లీషు వ్యాసము చూడనగును. History of Telugu Journalism–Narla Shastyabdapurti Commenoration Volume-PP. 120-155.

ముద్రింపబడినది. అంతేకాని క్రీ. శ. 1962 లోనే ప్రకటితమైన చిన్నయసూరి రెండవ వచన గ్రంథము—హిందూధర్మశాస్త్ర సంగ్రహము విషయమే యిందు మృగ్యము.

హిందూధర్మశాస్త్ర సంగ్రహము: ఇది అప్పటి ప్రభుత్వమువారు 'స్ట్రేంజి' అను నాంగ్లేయునిచే రచితమైన ఇంగ్లీషు గ్రంథమునకు తెనుగు అనువాదము అన్నిన్యాయస్థానములందు ప్రధానమగుటచే, సూరి చేసిన ఆంధ్రానువాదము. మొదట 1858 లో ప్రకటితమైనా, క్రీ. శ. 1867, 1869 లో ద్వితీయ తృతీయ ముద్రణములు గాంచినది. రెండవ తరగతి న్యాయవాదులకు పఠనీయగ్రంథంగా ఉండేడిది.

ఈ గ్రంథము కేవలము లోకవ్యవహారమునకు సంబంధించినదేయైనను, సూరి దీనిని సరళము, సుబోధకమునగు గ్రాంథికభాషలోనే రచించియున్నాడు— మచ్చునకు :

వి వా హ ము

'వివాహపూర్తికిం గన్యాదానమును దత్పరిగ్రహమును సప్తపదియు ముఖ్యక్రియలు. ఒక పళ్లెరములో బియ్యము నెఱపి యేడుగీఱ్లుగీచి యాయేడు గీతలమీద వరుఁడు పెండ్లికుమార్తె కాలుపట్టి గీఁతగీత కొక్కొక్కసారి వరుసగా నుంపించుట సప్తపది యనఁబడును. ఇందుచేతనే యిద్దఱు చెలిమి యొడంబడికకయి కూడి యేడడుగులు నడచు నాచారము గలిగినది. కాబట్టి సాప్తపదీనమను శబ్దము సఖ్యమునకు వాచకమయినది. ఈ క్రియలోనే వివాహము పూర్ణమగుచున్నది. హోమము లోనయిన యితర క్రియలు విశేషములుగావు. వరుఁడు కన్యకంఠమందు మంగళసూత్రము కట్టుట లోకాచారముగాని శాస్త్రీయముగాదు.' (గృహ్యసూత్రము) పుట 19, 20

ఇది న్యాయశాస్త్ర గ్రంథము కాబట్టి చిన్నయసూరి దేశీయుల వ్యవహారమునవున్న పదములనే వాడియున్నాడు— 'విల్లు' 'వీలునామా' అనునవి ఇంగ్లీషు పదములు — సూరి ఈ పదమునకు 'ఉయిలు' అని వాడియున్నాడు

ఉ యి ల్లు

'ఉయిలుచేత ద్రవ్యమును వినియోగించు నధికారము ధర్మశాస్త్రమందు గానబడలేదు. ఉయిలను సాధనమునకు ధర్మశాస్త్రమందు వాచకము లేదు ... ధర్మశాస్త్రమందే ద్రవ్యవినియోగమునకయి కావలసిన నియమము లేర్పడియున్నవి. కాబట్టి యుయిలు వ్రాయుట కెడము లేదు.

దత్త ద్రవ్యమునకు పునరాదానము ధర్మశాస్త్రమందు నిషిద్ధము. ఉయి లట్టిదిగాదు. ఉయిలు వ్రాసినవాఁడు వ్రాసినదానికి మరలం బడవచ్చును — ఇట్టి దానము శాస్త్ర సమ్మతము గదు —'పుట 58 – 59.

ఇట్లే జాగరూకతతో సూరి Adoption అనగా 'దత్తత' అని లోక సామాన్య పదము నుపయోగింపక 'పుత్ర స్వీకారము' అని శాస్త్రీయ పదముపయోగించి యున్నాడు. తెనుగు అధికార భాష కానున్న ఈ సమయమున — నీ గ్రంథము పలు విధములుగా నుపకరింపగలదు.[16]

విడిచి పెట్టిన గ్రంథాలు

ఆంధ్ర సాహిత్యంలో క్రీ. శ. 13 వ శతాబ్ది నుండి పద్యవాఙ్మయంతో బాటు అనుస్యూతంగా, అవిచ్ఛిన్నంగా వచన వాఙ్మయంకూడా వర్ధిల్లుతున్నదన్న విషయమును సంపాదక వర్గమువారు గుర్తించకపోవుట చేతనో. లేక, వచన వాఙ్మయాన్ని గూర్చి గ్రంథాలు చూడక పోవుటచేతనో, ఇందెన్నో ప్రసిద్ధవచన గ్రంథాల స్మరణలేకుండా పోయినది[17] ఇందు చేరదగిన కొన్నింటిని వివరిస్తున్నాను—

---

16. ఈ గ్రంథము చిన్నయసూరి జీవితముతో కూడ ముద్రితమై యున్నది.

17. భారతి – పార్థివ — భాద్రపదము — (1945 సెప్టెంబరు); విశాలాంధ్ర అవతరణోత్సవ సంచిక (1950) వెంకటరామా అండ్ కో:

వచనవాఙ్మయ ప్రథమాచార్యుడు
కృష్ణమాచార్యుడు క్రీ శ. 1300

క్రీ. శ. 1295–1323 లో కాకతీయ సామ్రాజ్యాన్ని పాలించిన ద్వితీయ ప్రతాప రుద్రుని కాలంలో వచన వాఙ్మయ ప్రథమాచార్యుడు వెలిశాడు. కృష్ణమాచార్యుడు—వైష్ణవ భక్తిని ప్రచరించడానికి మొదట వచన రచన—వచనముల మూలమున ప్రారంభించినాడు. ఈ వచనములకు 'సింహగిరి నరహరి వచనములు' అని పేరు. మచ్చునకు —

'దేవా జయ జయా వరంధామ! పరమపురుష! పరమాత్మ ప్రకాశ! అమృత అచలాచల! అవ్యక్త! అగణిత దయాంబోధి అనాదిపతియైన స్వామి సింహగిరి నరహరి నమోనమో దయానిధే'...

మీ దాసులకు కులగోత్రం బన్న నేమిటికి ? మా యతిరామానుజముని పరంధాత. అనాదిపతియైన సింహగిరి నరహరి నమోనమో దయానిధే'

ఇంతవఱకు లభ్యములైన ఈ ప్రథమ ప్రశస్త వచనములు ముద్రితములైనవి. కృష్ణమాచార్యుని వేఱొక రచన — శతకోప విన్నపములు. వైష్ణవమత గ్రంథములయందు ప్రసిద్ధుడైన ఇతడు సాహిత్య పరిశోధకు లందఱకు పరిచితుడే – అయినా ఈ గ్రంథంలో ఈతనిగూర్చి లేనేలేదు.

ఏకామ్రనాథుడు క్రీ శ. 1370
ప్రతాప చరిత్ర

కాకతీయరాజ చరిత్రకు ప్రధానాధారమైన ప్రతాపచరిత్ర తెలుగున మొదటి వచన చారిత్రక గ్రంథము—దీనిని రెండు సంస్థలు ముద్రించినవి

శ్రీనాథ;కృష్ణరాయయుగములు 1400–1640

శ్రీ వేంకటేశ్వర వచనములను గూర్చి చెప్పినపుడు క్రీ. శ. 1468-1553 లోనున్న తాళ్ళపాక తిరుమలయ్యనుగూర్చి తెలిపితిని. ఇక కృష్ణరాయ యుగమున వెలసిన వారినిగూర్చి తెలిపెదను. ఈవఱలో చెప్పిన నరసింహకవి, శంకర కవి, కాశీ చెన్న బసవేశ్వరుడుగాక ఈ క్రింది వేదాంత వచన గ్రంథము లీ యుగముననే వెలువడినవి.

1. దత్తాత్రేయ యోగి – వేదాంత వ్యవహార సార సంగ్రహము.
2. బసవగోస్వామి—పరమానంద బోధ ప్రకరణము.
3. కాశీ చెన్నబసవేశ్వరుడు– వివేకసింధువు.
4. పరమానందయతి 1. వేదాంతవార్త్తికము: ఇది తమిళభాషలోని అనువదింపబడినది.18

2. బ్రహ్మవిద్యా సుధార్ణవము: 13 ప్రకరణముల గ్రంథము.

సంస్థాన పరిపాలనయుగము 1600–1800

1. వచన విచిత్ర రామాయణము—దొంకా గోపీనాథకవి. క్రీ. శ. 1650

2 భాగవతసారము– పుష్పగిరి తిమ్మన—

తిమ్మన సమీర కుమారవిజయ ప్రబంధరచన తప్ప, ఈ వచన గ్రంథరచన లోక మెఱుగదు— ఇదియు తమిళభాషలోని అనువదింప బడినది.

3. బ్రహ్మాండ వచనము...

మాచవరపు పావనామాత్యుడు క్రీ. శ. 1750 ప్రాంతమున రచించెను. ఇందు బ్రహ్మాండ నిర్మాణ క్రమము, లోకాలోక వివరణము మున్నగు అద్భుత విషయము లెన్నోగలవు.

4. సాత్త్వక బ్రహ్మవిద్యా విలాసము — వైష్ణవము—క్రీ శ. 1750.

5. సాత్త్వక బ్రహ్మవిద్యా విలాస నిరసనము శైవము క్రీ. శ. 1750

6. బుద్ధిరాజు పేరయామాత్య విరచితము.19

---

18. దీనిని మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమువారు ప్రకటించిరి.

19. ఈ గ్రంథము క్రీ. శ. 1885 లో— రాజమహేంద్రవరమున చింతామణి ముద్రాక్షరశాలలో ముద్రితమైనది.

7. అజ్ఞానధ్వాంత చండభాస్కరము— కంభం పాటి అమరేశ్వరశాస్త్రి—క్రీ. శ. 1760

8. ముముక్షు జన చంద్రహాసము.

9. సత్క్రియానుష్ఠానము.

10 ఆత్మబోధ ప్రకరణము. వ్యాఖ్య—చివరి మూడు — పరశురామపంతుల బ్రహ్మానందరాజయోగి రచనలు—క్రీ. శ 1800.

దక్షిణాంధ్ర వాఙ్మయము
క్రీ. శ. 1650–1800

వచనవాఙ్మయం మొదట హెచ్చుగా రూపొందింది దక్షిణాంధ్రయుగమువందే. అందు కొన్నింటిని తెలుపుదును.

1. ధేను మాహాత్మ్యము: క్రీ. శ. 1660. సత్యభామాసాంత్వన కృతికర్త లింగనమఖి శ్రీ కామేశ్వరకవి రచితము—ఆవులనుగూర్చి తెలుపు చక్కని రచన.

2. సారంగధర చరిత్ర—క్రీ. శ. 1730. సముఖము వెంకటకృష్ణప్పనాయకుడు. చేమకూర సారంగధర చరిత్రకు వచనానువాదము

3. కాశీ మహిమార్థ దర్పణము.

ఇది స్కాందపురాణ కాశీఖండమునకు తూచా తప్పని వచనానువాదము – సంస్కృతము ననుసరించి, అధ్యాయములుగా రచితమైనది. శ్రీనాథ మహాకవి కాశీఖండ కవితా విమర్శనమున కెంతయు తోడ్పడును ఇది నంజరాజకృతి. అతనివే మఱి రెండు వచన కృతులు.

శివభక్తి విలాసము – ఇది 75 అధ్యాయముల పెద్ద వచనకృతి.

గరళపురీమాహాత్మ్యము – (నంజన్ గూడు).

కాబట్టి నంజరాజా తెలుగు వచనరచనలు లయిదు.

4. రామాయణ వచనము — శ్యామరామకవి.

5. హాలాస్య మాహాత్మ్యము—శ్రీపతి రామభద్రకవి సంస్కృతపద జటిలరచన.

6 భగవద్గీత—తుపాకుల అనంతభూపాలుఁడు. ఇది భగవద్గీతకు చక్కని తెలుగు వచనరచన—ముద్రితమై చాలా ప్రచారమున నున్నది.

కుంపిణీ పాలన–1800–1850 బ్రౌనుయుగం
రావిపాటి గురుమూర్తిశాస్త్రి (1770–1837)

ఇంగ్లీషువారి పాలన ప్రారంభంలో రావిపాటి గురుమూర్తిశాస్త్రి ప్రసిద్ధవచనరచయిత. ఇతనివి రెండు గ్రంథాలు.

1 విక్రమార్కుని కథలు

మొట్టమొదట తెలుగులో అచ్చయినవి విక్రమార్కుని కథలే—కాలము క్రీ. శ. 1819. ఇవి యావెనుక నాలుగుసారులు ముద్రితమైనది.

2. పంచతంత్రి కథలు

చిన్నయసూరి నీతిచంద్రిక రచనకు మార్గదర్శకమైన రచన. 1834 నుండి 5 సారులు ముద్రితమైనది. ఈ రెండును సరళమై, సులభమైన గ్రాంథికరచన—పాఠశాలలలో నా కాలమున నివియే తెలుగు పఠనీయగ్రంథాలు. బ్రౌనుదొర కీతని యందు మిక్కిలి గౌరవము.

హంస వింశతి

ధూర్జటి లక్ష్మీపతికవి రచితమైన హంస వింశతి వచనము చక్కని గ్రాంథికశైలిలో నున్నది. ఇది క్రీ. శ. 1842 లో ముద్రితమైనది.

భారతము–ఆదిపర్వము వచనము

పరవస్తు చిన్నయసూరి, వైయాకరణము రామానుజాచార్యులు—తొలుత భారతము ముద్రణ ప్రారంభించిరి. పద్యమూలము చిన్నయసూరి పరిష్కరింపగా, వైయాకరణం రామానుజాచార్యులు—వచనముగా రచియించినాడు. రెండు నెదురెదురుగా ముద్రితములైనవి. క్రీ. శ. 1847. ఈ రచన గ్రాంథికమని వేఱుగ చెప్పనక్కరలేదు.

శివ రహస్యఖండము

ఈ ప్రశస్త గ్రాంథిక వచనగ్రంథము—ముదిగొండ బ్రహ్మయలింగారాధ్యుడు రచించెను. క్రీ. శ. 1852 లో ముద్రితమైనది. ఇది తిరిగి 1896లో ముద్రితమైనది. చిన్నయసూరికి ముందురచన.

ఇంతవఱకు చిన్నయసూరికి ముందు వెలసిన వచన వాఙ్మయమును గూర్చి సంగ్రహముగా తెలిపితిని. ఇక చిన్నయసూరికి వెనుక నేటివఱకు చిన్నయసూరి గ్రాంథిక పద్ధతిని వచన రచనలు సాగుచునేయున్నవి— తడకమళ్ల వెంకట కృష్ణరావు, కొక్కొండ వెంకటరత్నము, చిలకపాటి వెంకట రామానుజశర్మ, నాగపూడి కుప్పుస్వామయ్య, వేటి సుబ్బారాయశాస్త్రివంటివారి వచనగ్రంథాలు వచన వాఙ్మయ చరిత్రకారులకు పరిచితములే. తప్పులులేకుండా చిన్నయసూరి తరువాత గ్రాంథిక వచన రచన చేయగల సమర్థుడని గిడుగు పంతులుగారిచేత యోగ్యతాపత్రాన్ని పొందిన శుకనీతిసార గ్రంథకర్త పురాణపండ మల్లయ్యశాస్త్రి క్రీ. శ. 1925 లో కీర్తిశేషుడయ్యాడు. ఆధునిక సాహిత్యంలో గ్రాంథిక భాషలోనున్న కాశీమజిలీకథలకు, పానుగంటివారి సాక్షి వ్యాసములకున్న వ్యాప్తి, ప్రచారము, విమర్శకు లెఱిగినదే. విస్తర భీతిచేత విరమిస్తున్నాను.

లిఖిత భాగాలు

ఈ గ్రంథంలో లిఖిత గ్రంథాలనుండి — అనగా అముద్రిత గ్రంథాలనుండి భాగాలు సేకరించినట్లు దానికొఱకు విశ్వనాథవారు చాలా శ్రమ తీసుకొన్నట్లు మున్నుడిలో వ్రాశారు. అయితే ఈ 356 పుటల గ్రంథభాగములలోను అముద్రిత భాగం కంటె—ముద్రితభాగమే హెచ్చుగా నున్నది.

ప్రథమ ద్వితీయసంపుటములలో గ్రంథాలన్నీ ముద్రితాలు — అవి —

(55 + 133)	188	పుటలు
తృతీయ చతుర్థ సంపుటములో ముద్రితములు (వివరాలు ముందుతెలిపెను) (45 + 49)	94	
పంచమ షష్ఠ సంపుటములు. (50 + 24)	74	
	356	

ఈ 356 పుటలలో—

హాలాస్య మాహాత్మ్యము బ్రహ్మోత్తర ఖండము	–	10	పుటలు
తులా కావేరీ మాహాత్మ్యము	–	3	,,
ఉత్తరగోపురము, రఘువీరగద్య	–	8	,,
గజారణ్యము–నాసికావచనములు	–	3	,,
శఠగోపవిన్నపములు–భోజచరిత్ర	–	5	,,
దిలారాంకథ		6	,,
		35	పుటలు

అను 35 పుటల గ్రంథభాగాలు మాత్రమే—అముద్రితాలు.

ఆంధ్రగద్యచంద్రిక; సంకలన కర్తలు: శ్రీ విశ్వనాథసత్యనారాయణ; ఎం. ఏ; విద్వాన్ శ్రీ ఎ. శరభయ్యశర్మ; శ్రీ సి జమదగ్నిశర్మ ఎం. ఏ; శ్రీ టి. భాస్కరరావు బి ఏ. (ఆనర్స్) ప్రచురణ: ఆంధ్రప్రదేశ్ సాహిత్య-అకాడమీ; కళాభవన్, సైఫాబాద్, హైదరాబాద్-5. వెల: రు 8-00 లు.

విక్రమ శశాంకము

శ్రీ శనగన నరసింహస్వామి

ఓహో శరచ్చారుతరవేళ - ఈ ప్రశాంత
పౌర్ణిమా నిశ - అతిరోజ్జ్వలములౌచు
మామకీనార్ద్ర మానసాంబరమునందు
క్రందుకొను చంద్రమండల క్రమణకథలు!!!

యుగ యుగంబులనుండి మా యూహలందు
రచన మొనరించు నీ యశఃపటహ మిపుడు
విఱిగి ధరఁగూలె శాస్త్ర దిగ్విజయ యాత్ర
బట్టబయలయ్యె నీ స్వరూపప్రభూతి.

సాహసులు నీ యెడందపై చరణమూన
ముజ్జగంబులు పులకించి మూగవోయె
నిది మహాద్భుత మిది మర్త్యసదనశాస్త్ర
శౌండిమ కపూర్వఫల మింద్రజాలసఖము.

శాస్త్రఘోషలయందు నీ జాడలెల్ల
నరసినన్నాడు లవమేని సరకుగొనని
జగతి కేమిటి కిన్నాడీ సంభ్రమములు
మహితసత్యము లింత దుస్సహములగునె!

ఉదయమందిన చాడిగా నొక్క నిముస
మాగకుండగ భయదరోదోంతరమున
పయన మొనరించు నొంటరి బాటసారి!
చంద్ర! నీ కిపుడబ్బె స్పర్శనసుఖంబు.

పాలమున్నీటి కెరటాలబోలు శీత
రశ్ములిలజార్చు మృదుమధురస్వరూప!
పవన జలశూన్య కఠినస్వభావ మెట్లు
పాదుకొనె నోయి! నీ మనఃప్రాంతమందు?

విక్రమశశాంకము

నిశ్చల నివాత నిర్మల నిష్ప్రమాన
దీపశిఖలీల నీయందు తేజరిలునె
తావక ప్రథమాతిథి ధన్యమాన
వప్ర లిప్తిత విజయాంక వైజయంతి?

ఎన్ని యెన్ని రహస్యము లున్నతములు
నీ శిలా చిత్రసీమల నెలవుకొనెనో!
ధీరమానవ గగనయాత్రిక సఖులకు
ముందు ముందైన కాన్పునో చందమామ!

విశ్వసాహిత్యనందన వీథులందు
నిత్యనూతన సౌరభవిథులు వీచు
పారిజాతలతాంతమా! నీరజారి
బింబమా! నీకు మాకు శుభంబులౌత!

మంచిగందము కంటె క్రొమ్మించుకంటె
పూలరేకులకంటె కప్పురము కంటె
చలువ వెదజల్లు నీ కరస్పర్శకంటె
కలదె ప్రాణుల కానందకంద మొండు?


కవనమల్లుట మొదలుగా కల్పనైక
నిపుణత నటింప నిన్ను వర్ణించి మించు
కవుల కరములనుండి దుఃఖంబు మీఱ
జారె లేఖినులకట! శశాంక! నేడు!

అలసి సొలసిన డెందములందు మధుర
కాంతిఁ గల్పించు నీ సుధాస్వాదువృష్టి
విరహాలకు వేడిజాలుగా వెగటుగొల్పు
నేడుఁ గవికేల యీ వృథానిస్పృహమతి?

కంతు డెక్కడ! — ఎచట వసంతు డెందు
అల జయంతుడు ప్రాణవయస్యు లేడ
తార లెట నీవు! దూర శృంగారగాథ!
ఓయి! తారామనోహరా! ఊహమహిమ!

శాస్త్ర మొకదారి – కల్పనాశక్తి యొక్క
దారి–దర్శన బలమొక్క దారి కాదె?
శర్వరీ సార్వభౌమ తుషారచారు
సాంద్ర గాథల కేల మృషాభినింద?

శరనిధి శుక్తిగర్భమున జన్మము గాంచిన ముత్తియంబు, నిర్జరులకు నిత్యమైన మధుశాల, చకోరవిహంగమప్రపా శరణము, సస్యసంతతుల సాకి వెసం బెరిగించుచుండు చందురుడు భవత్సుఖంబుల ననూనముగా వెలయించుగావుతన్ !



అమరచంద్రుని ఛందోరత్నావళి

శ్రీ ఈయుణ్ణి వేంకటవీరరాఘవాచార్యులు

శబ్దశాస్త్రమువలెనే ఛందశ్శాస్త్రమును వేదాంగ షట్కమున నొకటి. ఛందస్సు అనగా వేదము. ఛాందసుడనగా వేదవేత్త. క్రమముగా ఛందశ్శబ్దమునకు లౌకిక వ్యవహారజ్ఞానశూన్యుడని నికృష్టార్థము సంక్రమించినది. తద్దినము, నాందీశ్రాద్ధము, 'ఫూల్, ఫెలో' ('Fool, Fellow) మొదలగు మాటలకు మొదటి సదర్థము తొలగి అపార్థ—నింద్యార్థములు వచ్చినవి. ప్రతిభాషయందు నిట్టివి కనబడుచున్నవి. వైదికచ్ఛందోవిచారము ప్రాగైతిహాసిక కాలమునకు చెందియుండవచ్చును. పద్యనిర్మాణమునకు చెందిన లౌకిక — ఛందశ్శాస్త్ర నిదాన బీజములు వైదికవాఙ్మయముననే పొడగట్టును. సామవేద—నిదాన సూత్రము, శాంఖ్యాయన—శ్రౌత సూత్రము, ఋక్ప్రాతిశాఖ్య, కాత్యాయనుని అనుక్రమణి — అను వైదిక గ్రంథములలో ఈ బీజములు కన్పట్టుచున్నవి. వైదికచ్ఛందోరచన కాలక్రమమున మార్పుచెంది, లౌకిక—కావ్యమున గణబద్ధములగు పాదములు, గణసామ్యముగల నాల్గుపాదముల వృత్తములుగా, మొదటి చరణములు రెండును తరువాతి చరణములు రెండును సమానలక్షణములకలవై, పాదావసానమున విశ్రాంతి కలవిగా నెట్లు పరిణతినందినవో స్పష్టముగా తెలియదు.

పింగళుని సూత్రములు లౌకికచ్ఛందో విచారకములేకాని, ఇందొక ప్రకరణమున మాత్రము వైదికచ్ఛందశ్చర్చ కలదు. సప్తర్షులవంటి ఈ క్రింద పేర్కొనబడిన—'క్రౌష్టుకి, టండిన్, యాస్క, కాశ్యప, సైతవ, రాత, మాండవ్య'లు అను ప్రాచీన ఛందోగ్రంధకారులను పింగళుడు పేర్కొనెను. సంజ్ఞా—వాచకమగు కాళిదాసశబ్దము కవి పర్యాయముగా మారినట్లే, పింగళపదము ఛందశ్శాస్త్ర పర్యాయముగా పరిణమించెను. ప్రాకృతపద్య విచారకమగు నొక ప్రఖ్యాత గ్రంథనామము ఇందులకుదాహరణము. ప్రాకృత పింగళము—(క్రీ. 13; 14 శతాబ్దములకు చెందినది కావచ్చు). భరతుని నాట్యశాస్త్రమున ఛందోవిచారకములగు 14; 15 అధ్యాయములకలవు, అగ్నిపురాణమున ఛందశ్శాస్త్రమును చర్చించు ప్రకరణముకలదు. పింగళాచార్యుడు ప్రాచీనుడని విద్వాంసుల విశ్వాసము. పై గ్రంథములకు పిమ్మట ఛందోగ్రంథము లనేకములు బయలుదేరినవి. వీనిలో కాళిదాస రచనముగా మనకు లభించిన 'శ్రుతబోధ' అను లఘుగ్రంథ మొకటి. కాని శాకుంతలము మొదలగు గ్రంథములు రచించిన కవికులగురు ప్రథితుడే పై గ్రంథమును నిర్మించెననుటకు ప్రమాణములు లేవు.

వరాహమిహిరుడు క్రీ. 550 ప్రాంతమున 'బృహత్సంహిత' అను జ్యోతిశ్శాస్త్ర మహాగ్రంథమును నిర్మించెను. ఇందు 104 వ ప్రకరణమున అనుషంగికముగా అనేక వృత్తముల రచించెను. వీనికి నానావృత్తముల లక్షణమేకాక వివిధగ్రహగతులును విశదమగును. ఈ గ్రంథమున భట్టాచార్య—ఉత్పలుడు నిర్మించిన వ్యాఖ్యలో ఛందోవిషయములు జ్యోతిర్విషయములును చర్చింపబడెను. వరాహమిహిరుడు మొత్తము 64 పద్యజాతుల నిందువాడెను. వీనిలో 11 మాత్రమూల పద్యజాతులు. బృహజ్జాతకమున ఈయన వాడిన పద్యజాతులు 33 ఛందోగణితమును బట్టి 13 కోట్లు, 42 లక్షల, 17 వేల ఏడు వందల ఇరువదియారు (13, 42. 17, 726) సమవృత్తపద్యభేదము లున్నట్లు తెలియుచున్నది.

అతిమానుషధిషణాసంపన్నుడగు నే మానవునకైనను, కొల్లకొలది కల పైపద్యభేదముల లక్షణములను గుర్తించుటకైనను దీర్ఘమగు జీవిత కాలముగాని, ఓపటిమగాని చాలదు. దీనిబట్టి మన ప్రాక్తనసంస్కృతకోవిదు లేశాస్త్రమునకాని లోతుపాతులను కనిపెట్టుట కెంతటి అగాధవ్యాసంగముచేసి, శాస్త్రీయవినోదమునకైనను (For Academic interest) సునిశితములగు నెట్టి విషయములను ఆవిష్కరించెడివారో గుర్తింపదగును. వారి తీక్ష్ణప్రతిభ శిరోజమునైనను చీల్చుటకు సమర్థమైనది. అందువల్లనే ఏశాస్త్రమునకైనను మానవుడు జీవితకాలమున పూర్తిగా మథింపజాలని గ్రంథజాలము సంస్కృతమున బయలుదేరినది.

కాశ్మీరదేశమున క్రీ. 11 వ శతాబ్దమున నివసించిన మహామహుడు, విద్యాసముద్రుడు నగు క్షేమేంద్రుడు నిర్మించిన గ్రంథజాతమున ఈ క్రింది లఘు—రత్నత్రయ మిట పేర్కొనదగును. ఔచిత్యవిచారచర్చ, కవికంఠాభరణము, సువృత్తతిలకము'. వీనిలో మొదటిది సాహిత్యశాస్త్రవిచారకము; రెండవది భవిష్యత్కవి కుపకరించు ప్రశస్తకవిశిక్షాగ్రంథము; మూడవది చమత్కారమగు ఛందోగ్రంథము. ఇది రచనాదృష్టినుండియేకాక కళాదృష్టినుండియు ప్రశస్తమైన లఘు—రచన. ఏఘట్టమున నేవృత్తము శోభించునో, ఏవృత్త మెట్లు నిర్మించిన రాణించునో యిందు నిరూపింపబడెను. పిమ్మట కవికాలసర్వజ్ఞుడగు ఆచార్యహేమచంద్రుడు సుసంస్కృతము, స్వోపజ్ఞవృత్తిసహితము నగు ఛందోనుశాసనమును రచించెను. ఇందు సువిపులముగా ప్రాకృతాపభ్రంశగాథలు చర్చింపబడుటచే దీని ప్రాముఖ్య మినుమడించెను.

ప్రాచీన కాలమునుండియు భారతవర్షమున రాజాధిరాజులును మహారాజులును మాత్రమేకాక వారి మహామాత్యులును కవులు, పండితులునై కవికోవిదులను ఏనుగుపాడిగా దానాదులచే పోషించుచుండెడివారు. అట్టివారిలో వస్తుపాల—తేజపాలురను సోదరులు వాఘేల వీరధవల ప్రభు సన్నిధిని మహామాత్యులు. వీరధవళ ధరణీశ్వరుడు ధవళక్క (=Dholka in Ahmedabad dt.) నగరము రాజధానిగా రాజ్యపాలనము చేయుచుండెను. వీరధవళప్రభువు గుజరాత్ దేశమును పాలించిన చాళుక్యరాజవంశీయుడగు రెండవ భీమదేవమహాప్రభువునకు (క్రీ 1179—1242) సామంతుడు.

వస్తుపాలమహామాత్యుడు విద్వచ్చూడామణి కవిశిరోమణియై 'సరస్వతీ ధర్మసూనుః శారదాప్రతిపన్నాపత్యః, కూర్చాల సరస్వతీ (Sarasvati with a beard), సరస్వతీకంఠాభరణ, కవికుంజర, కవిచక్రవర్తి'—ఇత్యాదిబిరుదములచే ప్రఖ్యాతి నందెను. ఆయన దర్బారున కవిశేఖరులగు బాలచంద్ర—సోమేశ్వర—హరిహరులు తమతమ కావ్యములందు వస్తుపాల శబ్దమును వసంతపాలపదముగా మార్చిరి. సాహిత్యవ్యసని, కవితోన్మాదియు నగు వస్తుపాలుని విద్వద్గోష్ఠిలో నాటి గుజరాతదేశమునగల సాహిత్యమహారథులగు కవికోవిదులనేకులు కలరు. ఆ యగ్రశ్రేణికి చెందినవారిలో అమరచంద్రు డొకడు. ఈ మహాకవి రచనలు 12 కలవని తెలియుచున్నవి.[1] వీనిలో 6 ముద్రితములు; జాడ తెలియనివి 4; వ్రాతప్రతులుగా నున్నవి 2. ఈయన రచించిన కవిశిక్షాగ్రంథములు, తద్వ్యాఖ్యలు 4. వీనిలో 2 మాత్రము ముద్రితములు. తద్రచితములగు లక్షణగ్రంథములు (ఛందో వ్యాకరణాలంకారములు) 3. వీనిలో 'అలంకార ప్రబోధ' మున్నది. 'స్యాదిశబ్ద సముచ్చయ' మను శబ్దశాస్త్ర రచన అచ్చుపడినది. 'ఛందోరత్నావళి' ఇంకనూ సూర్యాలోక భాగ్యము నందలేదు. గుజరాత్ వాసి, జైనాచార్యుడు నగు హేమచంద్రుడు (1080 to 1173 A. D.) అమరచంద్ర సూరికంటె నించుమించు ఒక శతా

1. చూ. 'సంస్కృత సారస్వతమున జంట కవులు'—అను నా వ్యాసము. పుటలు 37—41. (భారతి-ఫిబ్రవరి, 1968.)

బ్దము పూర్వుడు. వీ రుభయులును ఏకమతాను యాయులు, ఏకదేశవాసులును కాన, హేమచంద్రుని ఛందోనుశాసనము అమరచంద్రుని ఛందోరత్నావళికి చాలవఱకు ఉపజీవ్యమైనది. కొన్ని కొన్ని ఘట్టములలో అమరచంద్రుడు హేమచంద్రుని కృతి నుండి విశేషభాగములను స్వీకరించెను. హేమచంద్రుని గ్రంథము సువిపులమైనది. దీని గ్రంథమానము (స్వోపజ్ఞవృత్తితో) 3124 శ్లోకములు. అమరచంద్రుని గ్రంథము 820 శ్లోకముల పరిమాణము కలది. అనగా ఛందోరత్నావళికంటె ఛందోనుశాసనము నాలుగురెట్లు విపులమైనది. రచనా విధానమున అమరచంద్రుడు హేమచంద్రుని గ్రంథమునే బాగుగా ననుసరించెను. ఛందోనుశాసనమున విపులముగా చర్చింపబడిన ఘట్టములను ఛందోరత్నావళి సంగ్రహముగా వివరించెను. కవి తన కావ్యకల్పలతావృత్తి యందు ఛందోరత్నావళిని ఉల్లేఖించుకొనెను. కావ్య రచనామార్గమున వ్యాసంగము చేయువారి కీరచనలు రెండును పరస్పర సహకారకములు (Companion Volumes).

ఛందోరత్నావళి—విషయవివేకము

ఛందోరత్నావళియందు 9 అధ్యాయములు కలవు. దీని గ్రంథాగ్రము ఇంచుమించు 820 శ్లోకములు.

అధ్యాయ వివరణము : 1. సంజ్ఞాధ్యాయము:— వర్ణగణ—మాత్రాగణ—వృత్త—సమవృత్త—విషమవృత్త—అర్ధసమవృత్త—పాద—యతి—ఇత్యాది సాంకేతికపదము లిందు వివరింపబడెను.

2. సమవృత్తాధ్యాయము : ఇందు సమవృత్తముల రకములు, నానావిధదండకములు, వీనియందలి వివిధగణవిన్యాసములును విశదీకరింప బడెను.

3. అర్ధసమవృత్తాధ్యాయము : ఇట్టి వివిధము లగు అర్ధసమవృత్తములు విచారింపబడెను.

4. విషమ వృత్తాధ్యాయము : దీనియందు నానాజాతివిషమవృత్తములు చర్చింపబడెను

5. మాత్రావృత్తాధ్యాయము : ఇందు ఆర్యా—గీతి మొదలగు మాత్రావృత్తలక్షణములు, తదవాంతర భేదములును తెలుపబడెను

6. ప్రస్తారాధ్యాయము : ఛందోగణితమువల్ల వివిధగణవిన్యాసముచే గణముల కూర్పు మార్పులచే (Permutation and Combination) కలుగు విశేషములు చూపబడినవి.

7. ప్రాకృతచ్ఛందోధ్యాయము : ఇందు వివిధ ప్రాకృతభాషలయందు మాత్రాగణబద్ధములగు గాథా, ఆర్యా, గళిత, ఖంజక, ద్విపదీ, ఖండగీతి మొదలగు పద్యజాతులను, తదవాంతరభేదములును విమర్శింపబడెను.

8. ఉత్సాహాదిప్రతిపాదనాధ్యాయము: ఉత్సాహా, రాసకాదులు వివరింపబడెను.

9. షట్పదీ—ద్విపదీ—చతుష్పదీ వర్ణనాధ్యాయము : ఇందు ద్విపదీ—చతుష్పదీ—షట్పదీ త్యాదులు, రాసవలయ, అడిలా, వస్తు, కర్పూర, కుంకుమ, వదనకములును, ధవళమంగళ, ఫుల్లదక, ఝంబదక, ఉల్లాల, చతుష్కళ, షట్కలాదులగు పద్యభేదములును తదవాంతరజాతులును అనేకములు విశదీకరింపబడెను. గణములను అనులోమవిలోమముగా మార్చి కూర్చుటవలన పైవానియం దెన్ని అవాంతర భేదములు కల్గునో ప్రదర్శింపబడెను. అపభ్రంశ కథాకథనవ్యానిర్మాణమున ప్రధానములగు ధ్రువా—సంధి—కడవకముల లక్షణములు విస్పష్టములు.

పై గ్రంథమున ప్రమాణీకరించుకొనబడిన గ్రంథ—గ్రంథకారులు : మొదటి రెండధ్యాయము

---

2. సింఘీజైన గ్రంథమాల, 49 (భారతీయ విద్యాభవనము, బొంబాయి)—1961. ఛందో గ్రంథములకు దీనివలె సుపరిష్కృతము (Critical) సర్వాంగ సమలంకృతము అగు ప్రచురణము ఇంతవఱకు వెలువడ లేదు. ఇందు స్వోపజ్ఞవృత్తియేకాక, 6 అనుక్రమణికలును పరిశిష్ట రూపమున 4 సూచికలును కలవు.

లందు పింగళ–భరత - స్వయంభూ—జయదేవకవుల యభిప్రాయములు; ముఖ్యముగా ఆయాపద్యనామములకు పర్యాయనామములను పేర్కొను నవి యుల్లేఖింప బడెను.

స్వయంభూకవి : క్రీ. 701–1000 నడుమ జీవించిన ప్రఖ్యాతులైన అపభ్రంశ కవులు ఇరువురు కలరు–చతుర్ముఖ–స్వయంభూకవి, తత్తనయుడు త్రిభువన - స్వయంభూకవి. ఈ యిరువురిలో నేయొక్కడైనను అమరచంద్రునిచే పేర్కొనబడినకవి యగునో కాదో నిశ్చయింపలేము.[3] స్వయంభూ ఛందస్సు, 1935 క్రీ. వఱకు అసూర్యంపశ్యయై అజ్ఞాతవాసము చేయుచు ఆచార్య హరి.దామోదర వెలంకర్–సేవాఫలముగ 2 సార్లు ప్రకటింపబడెను[4].

జయదేవకవి : ఈయన సూత్రములుగా నొక ఛందోరచనమును నిర్మించెను. అభినవగుప్తపాదాచార్యులచే[5] (క్రీ. 1000) ఛందస్సంగీత శాస్త్రములకు ప్రామాణికునిగా పేర్కొనబడుటచే జయదేవుడు క్రీ. 1000 కంటె ప్రాక్తనుడగుట నిశ్చయము. గీతగోవిందకర్త (క్రీ. 1150–1200), చంద్రాలోకమును, ప్రసన్న రాఘవమును రచించిన జయదేవుడును (క్రీ. శ. 1309) ఛందోగ్రంథకర్త[6]యగు జయదేవునికంటె భిన్నులు అర్వాచీనులును.

మూడవ అధ్యాయమున ధనపాలునివి (క్రీ. 1000) ఆచార్యహేమచంద్రునివి (క్రీ.1083–1173) శ్లోకము లుదాహృతములు.

సప్తమాధ్యాయమున ప్రాకృత + అపభ్రంశ పద్యజాతులు వివరింపబడెను. ఇందు హేమచంద్రుని ఛందోనుశాసనము (=ఛందశ్చూడామణి)[7] తన కుపజీవ్యమని అమరచంద్రుడు కంఠోక్తముగా చెప్పియున్నాడు. ఇందు హర్షవర్ధనుని రత్నావళినుండి యొకప్రాకృతగాథను,[8] మహారాజ — కుమారపాలుని (క్రీ. 1143–74) ప్రశంసించు నింకొక ప్రాకృతగాథను కవి ఉల్లేఖించియున్నాడు.[9]

అష్టమ - నవమాధ్యాయములు అపభ్రంశపద్యజాతులను విశదీకరించును. సాహిత్యదృష్టిచే నీరెం డధ్యాయములును విశేషప్రాముఖ్యము కలవి. ఇం దపభ్రంశసారస్వతమునుండి అనేకపద్యము లుల్లిఖితములై యున్నవి. ఇందు కొన్ని కవి తన కెంతయో ఉపజీవ్యమగు హేమచంద్రుని ఛందోనుశాసనమునుండి ఉద్ధృతములు. ఈ శ్లోకములనుండి సార

---

3. M. C. Modi - Bharatiya Vidya- (Hindi & Gujarati Quarterly, Vol. I. pp. 157 ff.)—Bombay.

4. A. Edited & published by Prof. H. D. Velankar, in the Journal of the Bombay B. of the R. A. Society (1935).

B. Prof. H. D. V.—Journal of the Bombay University-Vol. V. No. 3. pp. 72-93. (Nov, 1936)

C. Prof. Velankar's ed in book- form. Rajastan Puratana Granthamala—Jodhpur (1959-60 ?)

5. భరతుని 'నాట్యశాస్త్ర' వ్యాఖ్యయగు 'అభినవ భారతి'యందు.

6. Prof. H. D. Velankar's Jayadaman contains Jaydeva-cchandas, besides 3 other works: Jayakirti's Chandonusasana, Hemacandra's Chandonusasana and Kedara's Vrtta—Ratnakara. (Bombay) 1949.

7. 'ప్రాకృతాద్యుపయోగీని ఛందాసి కతిచిత్ బ్రువే । ఏషాంచ లక్షణం లక్ష్యం లిఖిష్యామి పృథక్ పృథక్ ॥ శ్రీ హేమసూరి రచిత– ఛన్దశ్చూడామణేరిహ, కించిత్కించ న చాన్యస్మాల్లక్ష్యం ఛన్దోఽభిధాస్యతమ్'—(7. 1—2.)

8. 'కుసుమాఉహపిఅమూలఅ.' (1. 13)

9. 'సిరిమూలరాయ— భరావ ఓకులగయణమయంక.'

స్వతేతిహాస ప్రాముఖ్యము గల్గిన కొన్నిగూర్చి ఇట విశదీకరింపబడును.

ఛందోరత్నావళియందు (అధ్యాయ 9) ముంజ కవిశేఖరుని 'దూహా' పంచకము మదనుని పంచ బాణములవలె నుండునని చెప్పబడెను—

'చూడుల్లఉ, బాహెూహజలు, నయణా, కంచువి, సమఘణ' అనుపదములతో కూడిన ఈ 'దూహా'లను పంచబాణుని బాణపంచక సదృశములని ఇట్లు తెల్పబడెను.

'చూడుల్లఉ, బాహెూహజలు,
నయణా, కంచువి, సమఘణ,
ఇయ ముంజి రఇయా దూహడా
పంచ వి కామహు పంచ సర.'

పై 'దూహా' పంచకమునుండి ఈ క్రిందివి రెండును ఛందోరత్నావళియం దుల్లేఖింపబడెను.

'చూడుల్లఉ చుణ్ణీ హోఇసఇ ముద్ధి కవోలి విహిత్తఉ,
నిద్దద ఉ సాసానలిణ బాహసలిలసంసిత్తఉ'10

(భావము : లజ్జాన్వితా! నీ హస్తమున కున్న కంకణము [గాజు] చెక్కిలిపై నుండుటవల్ల ఉష్ణమగు నీ—శ్వాసానిలమున బాగుగా కాగి, నీ బాష్పధార అనవరతముగ పడుచుండుటచే చిట్లిపోవును సుమా.)

'తం తేత్తిఉ బాహోహజలు
సిహిణం సరు వి న తిత్తు,
ఛిమ ఛిమవి గండత్థవిహిం
సిమసిమివి సమత్తు'11

(భావము : మిక్కిలివేడి యెక్కిననీ చెక్కిళ్లపై పడుటవల్ల సంతతము జాలువారు నీ కన్నీళ్లు చుంయి చుంయి ఏమచు ఆవిరియైపోయినవి కాని నీ కుచమండలమును తాకనైనను తాకలేదు.)

పై దోహాలను నిర్మించిన కవిముంజు డెవరో చెప్పలేము. మేరుతుంగుని ప్రబంధ చింతామణి యందు ముంజరచితములుగా తొమ్మిది అపభ్రంశ పద్యము లుల్లేఖింపబడియున్నవి. ఈ ముంజుడు స్వయముగా కవియు, కోవిదుడును, విద్వత్కవిపోషకుడును, క్రీ. శ. 10వ శతాబ్దమున మాళవదేశాధీశుడును, భోజుని పెదతండ్రియును అగు ముంజుడేయని నిశ్చయముగా చెప్పవచ్చును. హేమచంద్రుడును అమరచంద్రుడు నుదాహరించిన పై శృంగారాత్మక పద్యముల రచయిత రాజకవియగు నీ ముంజుడే అనుట సత్యదూరము కాకపోవచ్చును.

పరిశిష్టము —1

అమరచంద్రుని కావ్యకల్పలత, స్వోపజ్ఞవృత్తిద్వయము : కావ్యకల్పలతపై కవిశిక్షావృత్తి, పరిమళము అను రెండు వ్యాఖ్యలు మూలకర్తచేతనే నిర్మింపబడెను. భవిష్యత్కవి నేర్పవలసిన విషయము లనేకము లిందు విశదీకరింపబడెను. కవిశిక్షావృత్తి మూలముపై అన్యూనానతిరిక్తముగ రచింపబడుటచే కీర్తివ్యాప్తులనంది, పలుమారు ముద్రింపబడెను.

మనకు లభించిన కవిశిక్షాగ్రంథములలో సుప్రాచీనకృతులలో నిది యొకటి. కావ్యనిర్మాణకళాభ్యాసంగము చేయదలచిన భవిష్యత్కవుల కాచరణార్హమైన విధినియమముల నుపదేశించు నీ గ్రంథము పరమప్రమాణముగా ఖ్యాతినంది, విద్వల్లోకసమాదరణము నందెను. కారికారూపమునగల దీనియందు 798 కారికలు గలవు. కవిశిక్షావృత్తి కేవలమూలానుసారియగు ధావద్వ్యాఖ్యానము (Running Commentary); పరిమళమను నితర రెండవ వ్యాఖ్య కారికలకు స్వేచ్ఛావిచారచర్చ. కవిశిక్షావృత్తి గ్రంథమానము 3357 శ్లోకములు. కవిశిక్షాగ్రంథముల స్వరూపస్వభావములను, విషయవ్యాప్తిని (General

---

10. పై పద్య మించుక పాఠభేదములతో హేమచంద్రుని ప్రాకృత వ్యాకరణమున ఉద్ధృతము. (4 365)

11. హేమచంద్రుని ప్రాకృత వ్యాకరణమున (4 అధ్యాయ) ఉదాహృతము.

Speco) తెలిసికొనుటకై కావ్యకల్పలతా విషయము లిట దిక్సూచకముగ తెలుపబడును.

ఇందు ప్రతానము లనబడు 4 ప్రకరణములు కలవు :

1. ఛందఃసిద్ధి. 3. శ్లేషసిద్ధి.
2. శబ్దసిద్ధి. 4. అర్థసిద్ధి.

ప్రతిప్రతానమును కొన్ని స్తబకములుగా విభజింపబడెను.

ఛందస్సిద్ధిలో నాల్గు స్తబకములు కలవు.

1. అనుష్టుప్-శాసనము.
2. ఛందోభ్యాసము.
3. ఛందఃపూరణము.
4. వాదశిక్ష.

1. అనుష్టుప్-శాసనము:—సంస్కృత శ్లోకములందు అనుష్టుప్పు విశేషాదరముగా సామాన్య పద్యజాతి యగుటచే దీని రచనను గూర్చి మొట్టమొదట వివరింపబడెను. తద్రచన కనుకూలములగు పదములను సూచించి మాత్రాగణవిభేదమును కవి నిరూపించెను.

2. ఛందోఽభ్యాసము: పాదమునకు 9 మొదలు 21 గణములవరకు కలవృత్తములును, ఆర్యా పద్య లక్షణములు విశదీకరింపబడెను. పద్యనిర్మాణ కౌశల మలవడుటకై — కథా కథనము, నగర వర్ణనము, దైనందిన కార్యకలాపము, ప్రాపంచిక ప్రకృతి — ఇత్యాదులను వర్ణించుచో కవి వైదుష్యమునకు గాంభీర్య వైపుల్యములు కలుగును. కవికుమారుడు తన భావములకు ఛందోబద్ధరూపమును, ఇతర కవుల పద్యముల కాయావృత్తములలోనో, వృత్తాంతర ములలోనో అనుకరించి, రచింపదగును. ఒక వృత్తమును ఇంచుక దానిని బోలిన వృత్తాంతరమున అనువదింపవలెను. (ఉదా. చంపకోత్పలములను పరస్పరీకరము మార్పదగును. అట్లే మత్తేభ-శార్దూలవిక్రీడితముల నన్యోన్యముగా మార్చి రచింపవలెను.) వృత్తముల పరస్పర వినిమయాభ్యాసమున కుదాహరణము లనేకములు చూపబడినవి. ఆచరణానుకూలములైన యిట్టి యుదాహరణములు బాలకవుల కెంతో ఉపకరించును. వివిధ వృత్తములు రచించుట యందు నైపుణ్యము కలిగిన తర్వాత రచయిత వృత్త మర్మములను గుర్తించి, సామ్యవైషమ్య దృష్టిని నానావృత్తములను పరిశీలించును, ఇతర వృత్తములను రచించుటలో నిష్ణాతుడగును.

ఉదా—చివర రెండుగురువులను చేర్చుచో భద్రికా వృత్తము రథోద్ధతగా మారును; చివరనొక్క లఘువునే చేర్చుచో నది లలితావృత్తమగును. వంశస్థమున ఏడవ యక్షరము తుది నొక లఘువునుచేర్చిన మంజుభాషిణిగా మారును.

ఇట్లు కొన్ని వృత్తముల నేర్చినచో వర్ధమానకవి ప్రధానవృత్తముల నన్నిటిని నడపుటలో కృతహస్తుడగును. స్తబకాంతమున వృత్తమున యతిస్థాన విచారము చేయబడెను.

3. ఛందఃపూరణము: ముఖ్యముగా ఆశుకవిత్వమున పాదపూరణమున కుపకరించు సామాన్య శబ్దజాల మొసగబడెను. అనుష్టుప్పు మొదలగు పద్యజాతుల మొదట కూర్చుటకై ఒకటి మొదలు నాలుగక్షరముల పదములు ప్రదర్శింపబడెను. ఇట్లనుష్టుప్పు పూర్వోత్తరార్ధ రచనా పద్ధతిని నిరూపించి, ప్రధానములగు ఇతర వృత్తములను రచించు విధానముకూడ వివరింపబడెను.

కవిశిక్షావృత్తిలో కేవలము ఛందో విచారకములగు పై మూడు స్తబకములే ప్రకృతోపయుక్తములు. ఛందస్సిద్ధిలో చతుర్థస్తబకము వాదశిక్ష ఇట నప్రస్తుతము

పరిశిష్టము—2

కావ్యకల్పలత—కవిశిక్షావృత్తి

ముద్రిత మూలవ్యాఖ్యాన దర్పణము
(Bibliography of the Text and Commentaries)

అరిసింహకవి మూలగ్రంథము కావ్యకల్పలత; దీనిని తదంతేవాసి యగు అమరచంద్రుడు పూరించి,

కవిశిక్ష అనువృత్తిని నిర్మించెను. 1. ప్రతానము. 1-2 శ్లోకములను బట్టి అరిసింహుని మూల కారికలకు కవితారహస్య మరియు, అమరచంద్రుని వృత్తికి కావ్యకల్పలత యనియు పేళ్లని ఆచార్య జార్జి-బ్యూలర్ (Dr. G. Buhler) అభిప్రాయము.

మూలగ్రంథ ముద్రిత ప్రచురణములు :

1. రామశాస్త్రి పరిష్కృతము. బనారస్. 1886 క్రీ.
2. వామనశాస్త్రి పరిశోధితము. బొంబాయి. 1891.
3. జగన్నాథశాస్త్రి—హోసింగ్ పర్యవేక్షితము. (చౌఖంబా సంస్కృత గ్రంథమాల) బనారస్ 1931.

వ్యాఖ్య : మకరందము. శుభవిజయగణి నిర్మితము. ఈయన అక్బర్ చక్రవర్తి కాశ్రితుడును, తాపగచ్ఛమునకు చెందిన ఆచార్యుడు నగు హీరవిజయ సూరి కంతేవాసి. శుభవిజయగణి సలీ మనబడు జహంగీర్ సార్వభౌముని కాశ్రితుడు. విజయదేవ సూరి ఆదేశమున నీయన ఈ వ్యాఖ్యను రచించెను. అముద్రిత మగు దీని ప్రాతప్రతి 'ఆక్స్ఫర్డ్' నగరమున బోడ్లియన్ - లైబ్రరీయం దున్నదని డాక్టర్- ఏ బి కీత్ పండితుని లిఖితగ్రంథ వివరణాత్మక సూచికనుబట్టి (A. B. Keith's Catalogue of SKT. Mss in the Bodleian Library—Vol. I. Appendix—Oxford, 1909) తెలియుచున్నది.

పరిశిష్టము - 3

Bibliography of works on Prosody

సంస్కృతచ్ఛంద స్సారస్వత తరంగిణి (ముద్రితా ముద్రితములు)

క్రమ సంఖ్య	గ్రంథనామము	కర్త—(పరిష్కర్త)	స్థలాదులు	ముద్రణ వత్సరము
1.	అజితశాంతిస్తవ (కవిదర్పణమున 8వ పరిశిష్టము)	అజ్ఞాతకర్తృక (పరిష్కర్త: ఆచార్య హరి—దామోదర—వెలంకర్, యం. ఏ.)	రాజస్థాన పురాతన గ్రంథ మాల - జోధ్ పుర్	క్రీ. శ.
2.	అభినవవృత్త రత్నాకర (= వృత్త చంద్రోదయ)	భాస్కరరాయ (20 వేల శ్లోకముల పరిమితి)	(Asiatic Society of Bengal)	1959
3.	కవిదర్పణ (1 వ ఆవృత్తి)	కర్తృనామరహితము (హ. దా. వెలంకర్)	రా. పు. గ్రం- జోధ్ పుర్	1959
4.	గాథాలక్షణ (నందితాఢ్యకృత ?)	రాజశేఖర (హ. దా. వెలంకర్)	,, జోధ్‌పూర్	1959
5.	ఛందఃకోశ (కవిదర్పణ—2 పరిశిష్ట)	రత్నశేఖర (వెలంకర్)	,, ,,	1959
6.	ఛందఃకౌముదీ (ఆవృత్తి- 4)	కర్త ?		
7.	ఛందఃకౌస్తుభ	నిర్మాత	Ms. in Bhandarkar O.R. Institute, Poona	
8.	ఛందశ్చంద్రికా	కవి ?	Ms. in Bhandarkar O.R. Institute, Poona	
9.	ఛందఃశాస్త్ర (కావ్యమాల-91) ఆవృత్తి 3	పింగళ	నిర్ణయసాగర్—బొంబాయి	1938
10.	ఛందశ్శేఖర (స్వయంభూఛందస్—పరిశిష్ట 1)	రాజశేఖర (ఆచార్య వెలంకర్)	రా. పు. గ్రం. జోధ్‌పూర్ / బొంబాయి	1959 / 1946
11.	ఛందోమంజరి (దీనిపై వ్యాఖ్యలు-13)	గంగాదాస	1. కాశీసంస్కృత— సీరీస్—55.	1927
			2. Metropolitan Publishing House, Calcutta	1935
		ప్రభా (=సంస్కృతవ్యాఖ్య) రుచిరా (=హిందీ)	హరిదాస్ సం. సీరీస్-115.	1948
		వ్యాఖ్యాత: అనంతరామశాస్త్రి —వేతాళ	కాశీ.	1940

ఛందోమంజరీ—వ్యాఖ్యాః

1. అనంతరామశాస్త్రి—వేతాళ్	ప్రభా (సం.) రుచిర (హిం)	అనంతరామశాస్త్రి—వేతాళ (హరిదాస్-సం. సీరీస్-15.—కాశీ.	1940
2. కృష్ణరామ		(See Vol. I. p. 465 of Dr. P. K. Gode's 'Studies in Literary History?)	
3. గురునాథ విద్యానిధి	వికాస		1909
4. గోవర్ధనదాస		(Vide. p. 465 of Vol. I. of Dr. Gode's 'S. L. History.')	1915
5. చంద్రశేఖర	ఛం. మం. 'జీవన'	Vide Dr. Gode's Vol. I. 'S. L. H')	
6. జగన్నాథసేన కవిరాజ (=జటాధర కవిరాజతనయ)			
7. జీవానంద విద్యాసాగర		క్రీ. 1887 కలకత్తా 8thed.	1915
8. తారానాథ—తర్కవాచస్పతి			
9, దాతారామ—న్యాయవాగీశ	'భావార సందీపగీ'		1888
10. రఘునందన గోస్వామిన్	'వ్యాఖ్యాన కౌముదీ'		
11. రమతారణ—శిరోమణి	'మంజరీ విప్పతి'		1875
12. వంశీధర			
13. వైద్యనాథ శాస్త్రి—వరకాశే.			

క్రమ సంఖ్య	గ్రంథనామము	కర్త—పరిష్కర్త	స్థలాదులు	ముద్రణ వత్సరము
12.	ఛందోమఖాంత	పురుషోత్తమ		
13.	ఛందోరత్నాకర	రామేశ్వర వాచస్పతి (=వాసుదేవ సార్వభౌమ తనయ)		
14.	ఛందస్సార	కవి ?		
15.	ఛందస్సార సంగ్రహ	సి. యం. ఘోష్	కలకత్తా ?	1893
16.	ఛందస్సుధా	కర్త		
17.	ఛందస్సూత్ర (హలాయుధ వ్యాఖ్యతో)		B. Indica, కలకత్తా	1874
18.	ఛందోనుశాసన (జయదామ మను ఛందో గ్రంథచతుష్కమున ప్రప్రథమముగా ప్రకటితము)	జయకీర్తి (పరిష్కర్త : ఆచార్య—హ. దా. వెలంకర్)	బొంబాయి	1949
19.	ఛందోనుశాసన ('ఛంద శ్చూడామణీ'—అను స్వోపజ్ఞవృత్తితో) —విపులాంగ్ల భూమిక, 6 అనుక్రమణికలు, 2 పరిశిష్టములతో సర్వాంగసుందర ముద్రణము)	ఆచార్య హేమచంద్ర (పరిష్కర్త) : ఆచార్య—హ. దా. వెలంకర్)	భారతీయ విద్యాభవన్, బొంబాయి N. S. P.ed., Bombay	1961 1912

క్రమ సంఖ్య	గ్రంథనామము	కర్త - పరిష్కర్త	స్థలాదులు	ముద్రణ కాలము
20.	ఛందోనుశాసన (జయకీర్తి—హేమ చంద్రుల రచనకంటె వేఱు)	విర్మాత?		Ms
21.	ఛందోऽమృతలతా	కర్త ?		Ms.
22.	ఛందోరత్న	పద్మనాభ (సౌపద్మ వ్యాకరణ నిర్మాత)		
23.	ఛందో రత్నావళి	అమరచంద్ర		Ms.
24.	ఛందోऽలంకారమంజరి (ఆధునికము)	ప్రొఫెసర్ సంసారచంద్ర		1900
25.	ఛందో విచితిభాష్య (=పింగళ చ్ఛందస్సూత్ర భాష్య)	యాదవప్రకాశ(క్రీ.శ.1000)Ms	Calcutta, Adyar etc. Berlin Academy ed.	
26.	ఛందోవిచితి	మిత్రధర (Ed. Dr. Schlingloff)		1958
27,	ఛందోవిచితి నామకములు మొత్తము 6 కలవు.			
28.	ఛందోవిచితి (ఉత్పన్నము)	ఆచార్యదండి		
29.	ఛందోవింశతికా	విర్మాత ?		
30.	ఛందఃపీయూష	కవి		Ms.
31.	జగద్విజయ.చ్ఛందః	?	G. O. Series, బికానేర్	1945
32.	జనాశ్రయీ—ఛందోవిచితి	జనాశ్రయ		
33.	జనాశ్రయీ	జనాశ్రయ (పరిష్కర్త : మానవల్లి రామకృష్ణకవి.	తిరువానూర్కారు తిరుపతి	1949 1950
34.	జయదామ (=ఛందోగ్రంథ చతుష్కము) 1. జయదేవచ్ఛందస్. 2. జయకీర్తి: ఛందోऽనుశాసన. ప్రప్రథమముగా ముద్రితములు. 3. కేదార వృత్తరత్నాకర. 4. హేమచంద్ర : ఛందోऽనుశాసన. (బహుపరిశిష్టశోభిత ముద్రణము)	కవి చతుష్టయము; పరిష్కర్త: ఆచార్య; హ. దా. వెలంకర్	బొంబాయి	1949
35.	జయదేవచ్ఛందస్. (చూ. జయదామ)	జయదేవ; పరి : వెలంకర్	బొంబాయి	1949
	,, ,, (హర్షటవ్యాఖ్యతో)	కర్త?		Ms.
36.	నాట్యశాస్త్ర (మూలసూత్రము)	భరత	కాశీ సంస్కృత సీరీస్ 60 కాశీ.	1929
37.	నాట్యశాస్త్ర (అభినవ భారతితో) II సంపుట—14—15 అధ్యాయములు — వ్యాకరణ చ్ఛందస్సులు.	భరత; ఆచార్య—అభినవ గుప్తపాద. పరిష్కర్త—శ్రీ మానవల్లి రామకృష్ణ కవి, M. A.	Gackwad Oriental Series—బరోడా	1934

క్రమ సంఖ్య	గ్రంథనామము	కర్త—(పరిష్కర్త)	స్థలాదులు	ముద్రణ కాలము
38.	నాట్యశాస్త్ర (ఆంధ్రవ్యాఖ్య—గుప్త భావప్రకాశికతో); ప్రకరణ 14. ఛందస్ (పు. 95—404); ప్రకరణ 15 ఛందస్ (పు. 405—40)	డా॥ పో. శ్రీరామ అప్పారావు, M.A. Ph. D.	హైదరాబాద్	1959
39:	నేమిరంగ రత్నాకర ఛ్ఛందస్	కవి లావణ్యసమయ	Rs. 6/-	1965
40.	పింగళ-ఛ్ఛందస్సూత్ర (వ్యాఖ్యా : మృతసంజీవనీ)	పింగళ (వ్యాఖ్యాతా—హలాయుధ.)	B. I. Series— Calcutta	1873
41.	పింగళ సారవికాసినీ	రవిమిశ్ర (=వైద్య శీలుడగు స్మృతికారుడు చండేశ్వరుడు పితామహుడు.)		
42.	ప్రస్తారశేఖర	శ్రీనివాస.		
43.	ప్రాకృతపైంగల (3 సంస్కృత వ్యాఖ్యలు, 1 హిందీ వ్యాఖ్యతో) 2 Vols.	పింగళ పరిష్కర్త—Dr. భోలాశంకర్—వ్యాస	వారాణసీ	196—
44.	[బృహత్సంహితా — (అధ్యాయ 104); వ్యాఖ్య పద్యాత్మక వివృతి] భట్టోత్పల వివృతికి యోగిరచించిన గద్యమయ వ్యాఖ్య 'ఉత్పల పరిమళము.'	వరాహమిహిర భట్టోత్పల	Vijayanagaram SKT. Series—X Benares	1895 ff.
45.	భాష్యరాజ (పింగళఛ్ఛందస్సూత్ర భాష్య)	భాస్కరరాయ దీక్షిత		
46.	వృత్తచంద్రోదయ (చూ. అభినవ వృత్తరత్నాకర)	భాస్కరరాయ	(Ms.) Bengaa Asiatic Society)	
47.	మందారమరంద	కృష్ణకవి	N. S. P. Bombay	
48.	వాగ్వల్లభ (వరవర్ణినీ వ్యాఖ్యతో)	దుఃఖభంజనకవి (వ్యాఖ్యాత-తత్తనయుడు మ. మ., కవిచక్రవర్తి దేవీ—ప్రసాద శుక్ల	Rs. 5/- Benares.	
49.	వాణీభూషణ	దామోదరమిశ్ర	N, S. P—Bombay	
50.	వృత్తజాతి సముచ్చయ (సవ్యాఖ్య)	విరహాంక	Rs 5/—25	1960?
51.	వృత్తముక్తావళీ	శ్రీకృష్ణభట్ట	Rs. 3/75	
52.	వృత్తవార్త్తిక	భట్టచంద్రశేఖరః (తండ్రి) లక్ష్మీనాథ పరిపూరితము.		Ms.
	1, వ్యాఖ్యా—దుర్గమబోధ	మేఘవిజయగణి	} గ్రంథాగ్రము : 6 వేల	
	2. ,, దుష్కరోద్ధార	——		
	3 ,, వార్త్తిక	భట్టలక్ష్మీనాథ		
53.	వృత్తరత్నాకర (దీనిపై వ్యాఖ్యలు అముద్రితములతో—45)	భట్టకేదార	N. S. P. 5th ed. Bombay.	1936
	1. ఆదర్శ	దివాకర (రచన—క్రీ. 1684)		
	2. ఉపాధ్యాయ నిరపేక్షా	ఆనడ (భోజరాజాశ్రితుడు)		
54.	(వృత్తరత్నాకర)			
	3. కవిచింతామణి	కరుణాకరదాస		

క్రమ సంఖ్య	గ్రంథనామము	కర్త—(పరిష్కర్త)	స్థలాదులు	ముద్రణ కాలము
	4. ఛందోలక్ష్యలక్షణ	శ్రీనాథ		
	5. జ్ఞానదీప	గార్గ్యగోపాలమిశ్ర		
	6. ోధినీ	శ్రీనాథకవి శార్దూల (గోవిందభట్ట తనయ)		
	7. పంచికా	రామచంద్రకవి భారతి	N. S P.—2nd ed. 3rd 5th Bombay.	1913 1926 1936
	8. నౌకా	అయోధ్యప్రసాద		
	9. ప్రభా	విశ్వనాథకవి (=శ్రీనాథతనయ) ?		
	10. ప్రాజ్ఞతోషిణీ			
	11. ప్రాణతోషిణీ (ఆధునిక)	శ్రీధరానందశాస్త్రి	లాహూర్ (సంవత్: 1994)	1937
	12. బలబోధ (,,)	రామచంద్రశుక్ల		
	13. బాలావబోధ	మేరుసుందర		
	14. భాగవతీయ వృత్తరత్నార్ణవ	నృసింహ భాగవత		
	15. భావార్థదీపిక	జనార్దన విబుధ		
55.	(వృత్తరత్నాకరం)—			
	16. మణినిధి	నారాయణ పురోహిత		
	17. [మణిమంజూ (హిందీ)]			
	18. రత్నప్రభా	నృసింహదేవశాస్త్రి	(ముద్రిత)	
	19. వృత్త రత్నావళి			
	20. సుకవిహృదయానందినీ	సుల్హణ		
	21. సుగమవృత్తి	ఉపాధ్యాయ—సోమసుందరగణి	(సంవత్ 1694—క్రీ.1637)	
	22. సుధా	చింతామణి		
	23. సేతు	హరిభాస్కర		
	24. సౌభాగ్యవతీ ఆధునిక)	నృసింహదేవశాస్త్రి	లాహోర్	
56.	వృత్తరత్నావళి	సదాశివముని—సారస్వత (విశ్వనాథ—తనయ)		
57.	వృత్తరత్నావళి	కాళిదాస		
58.	వృత్త రత్నావళి (సంస్కృత వ్యాఖ్యతో)	వేంకటేశ (పరి—Dr. H. G. Narahari	మద్రాస్ — అడయార్	19..
59.	వృత్తివార్తికా	రామపాణివాద	తిరువాన్కూర్	1937
60.	1. శ్రుతబోధ (జీవానంద విద్యాసాగర వ్యాఖ్యతో)	కాళిదాస	కలకత్తా	1883
	2. శ్రుతబోధ (విమలా—సంస్కృత హిందీ వ్యాఖ్య)	కాళిదాస		
	3. శ్రుతబోధ (,, ,,)	కాళిదాస (విద్యార్థిప్రతి)	(అశ్లీల శ్లోకవర్జితము)	
	4. శ్రుతబోధ (ఆశుబోధినీ—హిందీ సంస్కృతవ్యాఖ్యలతో, సంక్షిప్త ఛందో గణితముమ)	కాళిదాస		
61.	స్వయంభూ ఛందస్	స్వయంభూ (పరిష్కర్త: హరి దామోదర—వెంకర్)	Rajasthan Puratana Granthamala, Jodhpur	1960

పరిశిష్టము - 4

ఈ క్రింది గ్రంథములు పదియును ప్రాకృత గాథా భేదములను వివరించునవి :

			ముద్రణ
1. అజితశాంతిస్తవ	రచయిత?	జోధ్‌పూర్	1959
2. కవిదర్పణమ్	నిర్మాత?	,,	1959
3. గాథాలక్షణ	నందితాఢ్య	,,	1959
4. ఛన్దఃకోశ	రత్నశేఖర	,,	1959
5. ఛన్దఃశేఖర	రాజశేఖర	,,	1959
6. ఛన్దోఽనుశాసన	హేమచంద్ర	బొంబాయి	1961
7. (జనాశ్రయీ)	జనాశ్రయ	తిరువాన్కూరు	1949
8. (ప్రాకృతపైంగళమ్.)	పింగళ	కలకత్తా	1902
9. వృత్తజాతిసముచ్చయ	విరహాంక	జోధ్‌పూర్	1959
10. స్వయంభూచ్ఛందస్	స్వయంభూ	,,	1959

గమనిక : (పై వానిలో 7, 8 సంఖ్యలు కలిపి తప్పతక్కిన ఎనిమిదియు ఆచార్య—హరిదామోదర—వెలంకర్ పండితునిచే సమ్యక్ పరిష్కృతములు.)


పరిశిష్టము - 5

ఉపజీవ్యగ్రంథ ముక్తావళి

(Bibliography) of books consulted and Aids to further study.

1.	Abhinavabharati (Com. on Bharata's Natya-Sastra) Vol. II.	By Abhinava gupta.	Editor: M. R. Kavi, M. A., G. O. Series-Baroda.	1934
2.	Bharatiya Vidya (Hindi & Gujarati Quarterly) Vol. I.		Bharatiya Vidya Bhavan Bombay.	19...
3.	Chandonusasana.	By Hemacandra	Ed. Prof. H. D. Velankar, M. A. (Singhi Jain Series-Vol. 49) Bombay.	1961
4.	History of Sanskrit Poetics (II ed. Revised)	By Dr. S. K. De.	Calcutta.	1960
5.	History of Sanskrit Poetics (III ed.)	By Mm. Dr. P. V. Kane.	Matilal Banarsi Dass Delhi—6.	1961
6.	Jayadaman (A Collection of 4 Works on Prosody i. Jayadeva's Chandas. ii. Jayakirti's Chandonusasana. (i, ii: Printed for the first time)		Editor: Prof. Hari Damodara Valankar, Bombay.	1949

	III. Kedara's Vrtta-Ratnakara. IV. Hemacandra's Chandonusasana.			
7.	Journal of the Bombay B. of the Roy. Asiatic Society.		Bombay.	1935
8.	Journal of the Bombay University Vol. V. No. 3.		Bombay. (Nov.)	1936
9.	Joint Authorsin Sanskrit (Article in Telugu)	By E. v. V. Raghavacharya	Bharati-(Monthly in Telugu) Madras. (Feb.)	1968
10.	Jothing on Sanskrit Metrics.	Prof S. P. Bhattacharya	Calcutta Skt. College Research Series- No. XXVII (Studies No. 13.)	1963
11.	Kavyakalpalatha with 2 auto-Commentaries	By Amaracandra	Ed. Jagannatha Sastri Hoshing (Chowkhamba Skt. Series) Benaras.	1931
12.	Litarary Circle of Mahamatya Vastupala and its Contribution to Sanskrit Literature.	By Dr. Bhogilal J. Sandesara, Ph. D.	Singhi Jain Series-33. Bharatiya Vidya Bhavan, Bombay.	1953
13.	Lives of Sanskrit Poets-Vol. I (in Telugu) (-Samskrta-Kavi-Jivita)	Pt. M. Suryanarayana Sastri	VenkatRama & Co., Vijayawada.	1950
14.	Prakrta-Sabdanusasana.	By Hemacandra	Ed. Dr. P. L. Vaidya. poona.	1928
15.	Svayambhu-Chandas.	By Svayambhu	Ed. Prof H. D. Velankar. (Rajasthan Puratena Granthamala, Jodhpur.)	1960



నన్ను గురించిన నిడుదవోలువారి చెనకు

శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ

కడచిన ఏప్రిలునెల (1969) భారతిలో శ్రీ నిడదవోలు వేంకటరావుగారు వ్రాసిన వ్యాసము, 'నన్నెచోడకవి శైవసంప్రదాయము' అనునది, ఈవలనే నా కంటికి పడినది.

దానిలో రెండు తడవలు నా యభిప్రాయాలను చెనకినారు; మొదలు పేరుచెప్పక, రెండవతూరి పేరుచెప్పి. వానిగూర్చి నా మాటలుగా ఇందు కొంత వ్రాయవలసియున్నాను.

మొదటిది: శ్రీ వేదం వేంకటరాయశాస్త్రి (ఎమ్. ఏ)గారు నన్నెచోడునిగూర్చి విమర్శగ్రంథము వ్రాసి దానికి ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీనుండి బహుమతిని గెల్చుకొన్నారు—సుమారు పదకొండేండ్ల క్రిందట. అందు నన్నెచోడుని శైవమతస్వరూపము చర్చించుచు 'ఈతనిది వీరశైవముగాదు... ద్రావిడ శైవమునకు, కాశ్మీరశైవమునకు సన్నిహిత సంబంధము గలదు. ఈతడు 'గౌరి కాశ్మీరుండగు నీశుం గనుడు' అని మాయావటువు శివుడుగా ప్రత్యక్షమైన సందర్భమున ధ్వనిచే వ్రాయుట ఇందులకు బలము నిచ్చుచున్నది' అన్నారు. (ఇది ని. వే. గా ఉద్ధరించినమాట. భార. పు. 57)

పై పద్యమున (కుమా. 7.65) ఈతడు—కాశ్మీరుడు అను విశేష్యవిశేషణభావము అసంతృప్తికరమనుట స్పష్టమే. కాని మానవల్లివారి మొదటి ప్రచురణమందును, దానిని ఎంతో పరిష్కరించి మద్రాసు విశ్వవిద్యాలయముద్వారా శ్రీ కొరాడ రామకృష్ణయ్యగారు ప్రకటించిన ప్రతియందును ఆ పాఠమట్లే యున్నది. తమ 'తండ్రిగారు సంపాదించియుండిన' వ్రాతప్రతితో సరిచూచి వావిళ్ల వేంకటేశ్వరులు వెలువరించిన రెండు ముద్రణములందుగూడ (1949, 1953) అది యట్లే కాలూది నిలిచినది. ఉన్న దానికేదో ఉపపత్తి చూపు చిత్తవృత్తితో శ్రీ కొరాడ రామకృష్ణయ్యగారు 'కాశ్మీరుండగు—కుసుంభరాగముగలవాడు' అని టీకించి వదలినారు. (పదముల పట్టిక—అర్థాదులు పు. 9.). వేదంవారు అంతటితో తృప్తిపడక, ఈశుడు కాశ్మీరుడనుట నన్నెచోడుని శైవమతమునందలి కాశ్మీరశైవప్రభావమును ధ్వనింపజేయుచున్నదని ఊహను సాగించినారు. నన్నెచోడునిది మల్లికార్జున పండితారాధ్యులు ప్రవచించిన ఆరాధ్యశైవమేయని సిద్ధాంతము చేసుకొన్న నిడదవోలువారు, 'వ్రాతప్రతిలో కాశ్మీరుడను పాఠములేదు. అచట నున్నది 'ఆత్మేశు'డనునది' (భార. పు. 57) అని వ్రాసినారు. వారే వావిళ్లవారి రెండవ ముద్రణములో 'పాఠభేదములు' అను శీర్షికక్రింద 'గౌరి కాశ్మీరు--గౌరి కాత్మేశు' అను సవరణ చూపినారు. కాని అది వ్రాతప్రతిలోని పాఠముగా సూచింపలేదు. 'ఒప్పులని యందు సూచించినవి ముద్రిత పాఠములకన్న కవి హృదయసమ్మతములని తోచునవియని తలపనగును' అనిమాత్రమే అక్కడివారి తొలిసూచన (పు. 45), ఇప్పటికి మనకు చేజిక్కిన ఒకటేయొక తంజావూరు సరస్వతీభండారపు తాటాకుప్రతిలోగాని, మానవల్లివారు తమకు దొరకినవని చెప్పుకొన్న రెండు వ్రాతప్రతులలోగాని, ఆ పాఠ ముండియుండినచో వారుగాని కొరాడవారుగాని దానిని గమనింపక 'కాశ్మీరు'డను వింతపాఠము సృష్టించి ప్రకటించిరని మనము నమ్మలేము. ఇక వావిళ్లవారు చెప్పుకొన్న సొంత

వ్రాతప్రతిలో ఏమున్నా ఏమిలేకున్నా ఈ 'ఆత్మేశు' పాఠమున్మాత్రము లేదని నిశ్చయముగా చెప్పవచ్చును, వారి రెండు ముద్రణములలోను 'కాశ్మీరు' అనునదే కానవచ్చుచున్నదిగనుక. అందువల్ల 'ఆత్మేశు' అను పద నిడుదవోలువారికి తోచినపాఠమేగాని మూలవినది గాదనుట నిశ్చయము. ఎట్లైనా అది మంచి పాఠమే; దానికి వారభినందనీయులు

కాని యీ ప్రస్తావమున 'గ్రంథకర్త మాట యట్లుండనిచ్చి, ఈ గ్రంథ బహుమతి నిర్ణేతలును నన్నెచోడని కవితా మూలతత్త్వమును నవగాహన చేసికోలేదన్నమాట వాస్తవమగుచున్నది' (భార. 58) అని ని. వే. గారు వ్రాయుటమాత్రము అధికప్రసంగము. అవగాహన చేసికోలేదని యెవరైనా ఇదివరలో అన్నారా? లేక తామే అని దానిని తామే, ఇంకెవరైనా వాస్తవము కాదందురేమో అనుకొని, ఔనని గట్టించడమా! ఈ 'ఆత్మేశు' అను పాఠము నూహించుటకు ని. వే. గారి కాధారమైనది ఇదే పదమునే నన్నెచోడుడు ఇంకొకచోటను ప్రయోగించియుండుట! (కు. 9-48) ఇట్టిది వారు పట్టి పెల్లగించి పైకెత్తిన నన్నెచోడని, కవితా మూలతత్త్వము!

పై పదంవారి గ్రంథమునకు అకాడమీపరముగా బహుమతిని నిర్ణయించిన యిద్దరిలో నేనొక్కడను; ఇంకొక్కరు సుగృహీత నామధేయులగు శ్రీ ఆదిరాజు వీరభద్రరావుగారు. తెలిసియో తెలియకనో ని. వే. గారు మమ్ము పేర్కొనలేదు. ఆ 'పోటీ'కి వచ్చినవి ఐదో ఆరో రచనలు. వానిలో విషయసంగ్రహము, వేర్పాటు, విమర్శ, వాదము, శైలి, మొదలైన వస్తువులు గమనించి ఉత్తమమని తోచిన రచన బహుమాన్యముగా సలహా చేసినాము. ఎవరు నిర్ణేతలుగానుండినా చేయగలిగినదంతే. పాఠశోధనమువంటి విషయములను, కర్తల సిద్ధాంతములను అటువంటి రచనలలో ప్రధానముగా గమనింపలేము. నన్నెచోడని 'కవితా మూలతత్త్వము' అతని శైవశాఖాభేద ప్రధాన ప్రతితంత్రమైనచో, అది 'ఆత్మేశ'పదమువంటివానితో నిర్ధరింపవలసినదైనచో, దాని నవగాహనచేసికొను శక్తి వైష్ణవ సంప్రదాయమువాడనైన నాకు లేకపోవుట అసహజమేమియుకాదు. మరి శ్రీ ఆదిరాజువారికైనా కలదో లేదో చెప్పలేను. ఇది మా యిద్దరికిమాత్రముగాక మమ్ము నియమించిన ఆంధ్రప్రదేశ సాహిత్యాకాడమీ రసికులందరికిని చెల్లవలసిన వద్దన.

ఈవల అకాడమీవారు ప్రచురించిన సులభ గ్రంథమాలలో ఈ కుమారసంభవముగూడ వెలువడినది. దానిలో ఈ 'ఆత్మేశ' పదము 'ఆత్మీయ'గా మారినది. (7-63) ఎట్లో చెప్పలేను. 'ఆత్మేశ' పదమే మేలైనదని చెప్పబడలేదు.

ఇక రెండవది: పై అకాడమీ సులభగ్రంథ మాలకై కుమారసంభవమును సిద్ధపరచినది మిత్రులు శ్రీ కోరాడ మహాదేవశాస్త్రిగారు. ఆ గ్రంథ

మాలనుగూర్చిన అకాడమీవారి సూచన ప్రకారము
శ్రీ శాస్త్రిగారు పాఠభేదముల విమర్శన మొదలైన
గొడవలకుపోక సామాన్యముగానే చూచి గ్రంథమును
సిద్ధపరిచి యిచ్చినారు. కాని నా వేడికోలుమీద,
నేనప్పుడప్పుడు తగినవని గుర్తుచేసుకొన్న పాఠముల
సవరణలు కొన్ని ఆ ప్రతిలో ప్రకటించుటకు విశ్వా
సముతో అంగీకరించిరి. (పు. 54, 55, 56 వారి
పీఠికానుబంధము). గ్రంథమును కీ. శే తండ్రిగారు
శ్రీ రామకృష్ణయ్యగారి మద్రాసు విశ్వవిద్యాలయ
ప్రతినే అనుసరించి, కొన్నిచిరుమార్పులతో, సంత
రించినారు; పరిశోధన ప్రామాణికముగా సాగించిన
ప్రతి యిప్పటికి అచ్చుకాలేదు గనుక. దానిలోను నిర్వే
దము గలిగించు పదవాక్య పాఠాలు ఎన్నో నిలిచిపోయి
నవి. ఎందరో పండితులు వాటికి సవరణలు వివరణ
లును సూచించునే యున్నారు. అట్లనే నూహించిన
సవరణలు శ్రీ శాస్త్రిగారికిచ్చినవి సుమారు శతా
ధికములు. వారు అందు కొన్ని వివరణ సాపేక్షములని
వదలి 74 మాత్రమే ప్రకటించినారు.

శ్రీ ని. వే. గారు నన్నిచోడని శైవ స్వరూ
పమును చర్చించు తమ వ్యాసము తుదలో 'గ్రామం
గచ్ఛన్ తృణం స్పృశతి' అనునట్లు నా సవరణలను
నామగ్రహణ పూర్వకముగా తాకి యిట్లు వ్రాసినారు.
'వాని నన్నింటిని చర్చించుట యీ వ్యాసోద్దేశము
గాదు. ఒక్కటి మాత్రము మచ్చునకు చూపు
చున్నాను.' (భార. పు. 75).

నేనిచ్చిన సవరణలలో కట్టకడపటిది వారు
చూపిన మచ్చు. దానినిబట్టి 73 సవరణలును దాని
వంటివేయని వారి సూచన కాబోలు! ఉండనిండు.

కుమార సంభవము ద్వాదశాశ్వాసాంత పద్యము
లైదింటిలో మొదటి పద్యము 'త్రిజగద్వంద్యు
డనింద్యుడు' అనుదాని రెండవ మూడవ పాదములలో
మానవల్లి కవిగారి పాఠము 'కుంభజ - తత్త్వజ్ఞుడు
ప్రాజ్ఞేశ్వర సదా సక్తుండు' అని యున్నది. వ్రాత
ప్రతిలో 'ఈశ్వర సదాశక్తుండు' అని యున్నదట.
(యూనివర్శిటీ ప్రతి పు. 362). కవిగారు దానిని
'ఆసక్తుండు'గా సవరించుట సమంజసమే. కాని ఆ
మత్తేభవృత్త పాదమున యతి చెడిపోవుట వారెం
దుకో గమనించినట్లు లేదు. ఆ పాదము యూని
వర్సిటీ ప్రతిలో 'ఈశపద సద్భక్తుండు' అని
ప్రకటితమై యతిభంగమును తొలగించుకొన్నది.
ఈ సవరింపు శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారే చేసిన
వారేమో! కాని ఆ విషయము వారు సూచించలేదు.
కనుక, 'ఈశ్వరసదాసక్తుండు' అను మూలప్రతి
పాఠమును 'ఈశపదసద్భక్తుండు' అని పొడుపుగా
దిద్దుటకన్న 'కుంభజ' అను పాదాది శబ్దమును
'కం - జజ' అని కురుచగా సవరించుటమేలని నేను
సూచించినది. '' 'కంజజ తత్త్వజ్ఞుడు' అను పాఠమే
అసంబద్ధము. దీనివలన ఆ పాదమున యతి తప్పి
నది '' అన్నారు ని. వే. గారు. 'కుంభజ' పదము
కదలింపక 'ఈశపద సద్భక్తుండు' అను పాఠమే
పరిగ్రహించితే యతి తప్పక మరేమి చేయగలదు?
అసలు పాఠము చూడక వెనుకముందులు గమనింపక
వ్రాయువ్రాత అంతయు ఇట్లు అసంబద్ధముగానే
సాగును.

కుంభజ తత్త్వమనగా అగస్త్య ప్రవర్తితమైన
రసవాద సిద్ధాంతమని, దానిని 'పన్నిరాయిరవ్' అను
తమిళ గ్రంథమున శివపారమ్యప్రతిపాదకముగా అగ
స్త్యుడు వివరించినాడని, మానవల్లివారు టీకించి
నారు. (వారి కుమా. భా 2 పీఠిక పు 4). ని వే.
గారి శైవ సిద్ధాంత వాదమునకిది తోడుపడినది.
అందుకై తెలుగులో, నన్నెచోడునిదేకాదు; ఎవరి
కవితకైనా 'మూలతత్త్వ'మయిన యతి
నియమమైనా వదలుకొనుటకు, లేదా మూలప్రతి
పాఠమును పెద్దగా యతికొరకు సవరించుటకు;
లేదా ఇతరులు సవరించిన దాని నంగీకరించుటకు,
ని. వే. గారు సిద్ధపడినారన్నమాట! 'కుంభజ'
పాఠమే కవి కిష్టమైనదని తీర్మానించుటకు ''అగస్త్య
ప్రశంస 'భవసాగరకుంభజా' అన్న కృతిపతి విశేషణ
మున గలదు—(4–112)'' అనునొక ప్రబలహేతువు

గూడ వారు క్రింది సూచికలో చూపినారు (భార. పు. 75)! 'పృష్ఠతాడనాత్ దంతభంగః'.

'కంజజ' అనగా చతుర్ముఖబ్రహ్మ; అతని తత్త్వము వేదాంతములందలి పరమార్థము; దాని నెరిగినవాడు జంగము మల్లికార్జునుడు — ఇది నా సవరణయం దుద్దేశించిన యర్థము. అతనిది 'సవైదిక' మైన యారాధ్య వీరశైవ సంప్రదాయమని నిర్ణయించు వి. వే. గారికిది ప్రతికూలమేమియుకాదు. మరి 'కుంభజతత్త్వ-కంజజతత్త్వ' పాఠములు రెండు గూడ అర్థవిషయమున గౌణములేయని సహృదయులకు తోచుటయు అసహజముగాదు. కాని నన్నెచోడుని రచనయందు ఇట్టివెన్నో యున్నవి.

కుమారసంభవమునకు సరియైన పరిశోధిత ముద్రణము లేకను రాలేదేయను శ్రీ వేంకటరావు గారి నిర్వేదమునందు తెలుగు సాహితీ రసికులందరును పాలుగొందురు. ఇప్పటికి శ్రీ కోరాడ రామకృష్ణయ్య గారి పరిష్కరణమే మూలప్రతిని పరిశీలించి ప్రామాణికముగా చేసినది. 1953 లో వావిళ్లవారు వెడలించిన రెండవ ముద్రణముగూడ కోరాడవారి పరిష్కరణము నుపయోగించుకొన్నట్లు లేదు. దానికి విపులమైన పీఠిక, దాని అనుబంధము, పాఠభేదములను చేకూర్చిన నిడుదవోలు వారు ఎక్కడ గాని కోరాడవారిని స్మరించనైనను లేదు. అది ప్రామాణిక పరిశోధన పద్ధతి గాదని వ్రాయనక్కరలేదు. 'కవి హృదయ సమ్మతములని తోచునవి' యని వారు చూపిన పాఠభేదములన్ని — ముక్కాలు మువ్వీసము కోరాడవారి ప్రతిలోనివే — విమర్శముగా చేర్చికూర్చినవి. పీఠికానుబంధములో వారు స్వచ్ఛందముగా చేసిన టీకలు కొన్ని చదివి నవ్వుకోవలసినవి. ఒక యుదాహరణము : కుమారస్వామిని స్తుతించు పద్యమును (1–8) గూర్చి 'ఇచట కుమారస్వామి స్కందుడు గాన కందములో నాతని ప్రశంస చేయబడినది.' ఈ భావమునే పెంచి పీఠిక (పు 18) లో 'కావ్యము స్కందునిఁగూర్చి కావున కందపద్యములు హెచ్చుగా వాడియున్నారు' అని 'కవితా మూలతత్త్వమును' వెలికి లాగినారు. షష్ఠ్యంతములను కందములుగానే కూర్చుటకును ఇదే కారణరహస్యమును వారే యింకెక్కడనో పైకిడ్చినట్లు నా చదివిన జ్ఞాపకము! ఈ విమర్శవినోదములను విస్తరించుట పనిలేనిపని.

శ్రీ వేంకటరావుగారి గ్రంథవ్యాసంగము విశాలమైనది; వ్యవసాయము విసుగులేనిది. దాని ఫలము పూర్ణముగా ఆంధ్రసాహిత్యమునకు లభించుటకై వారు తమ యభిప్రాయములును, రాద్ధాంతములును కొంత ఆత్రపడక నెమరువేసుకొని వెలువరుచుట కావలసియున్నది.



కలగూరగంప:

శామ్యూల్ బకెట్

సాహిత్యంలో ఈ సారి నోబెల్ బహుమతి ఐరిష్ కవి, నాటకకర్త శ్రీ శామ్యూల్ బకెట్‌కు లభించింది. 'ది టైమ్స్' (లండన్) పత్రిక అన్నట్టు ఆయనకు ఈ బహుమతి లభించడం అనివార్యం. గడచిన రెండు దశాబ్దాలుగా ప్రపంచ సాహిత్యంపై ఆయన ప్రభావం బలవత్తరమైనది, ఉపేక్షించరానిదిగా వుంటూవస్తున్నది. ఎప్పటిలాగ, నోబెల్ బహుమతి ఆలస్యంగా వచ్చింది. బెర్నార్డ్‌షా, మైఖేల్ షోలొకోవ్, బోరిస్ పాస్టర్‌నాక్‌వంటి మరికొందరి విషయంలోను ఇలాగే జరిగింది.

శ్రీ బకెట్ 1906 ఏప్రిల్ 13 వ తేదీన డబ్లిన్‌లో జన్మించారు. ఆయన తండ్రి క్వాంటిటీ సర్వేయర్‌గా పనిచేసేవారు. శ్రీ బకెట్ తన మొట్ట మొదటి పుస్తకం 'హోరాస్కోప్' అనే కవితను 1930 లో ప్రచురించారు. తర్వాత పెక్కుతక్కిన పుస్తకాలు ప్రచురించారు. ఏడు సంవత్సరాల తర్వాత ఆయన కళావ్యసనాలను తీవ్రంగా ఆకర్షించే, దుర్వి ఖ్యాత మేధావుల కేంద్రమయిన పారిస్ నగరానికి తన బస మార్చారు. అక్కడ ఆయనపై ఐరిష్‌జాతి వాడయిన మరొక మహారచయిత జేమ్స్‌జాయ్స్ ప్రభావం పడింది. ఆయన జేమ్స్‌జాయ్స్‌కు కొంత కాలం సెక్రెటరీగా పనిచేశారు. (జేమ్స్‌జాయ్స్ కుమార్తె లూషియాతో బకెట్‌కు వివాహం కూడా ఏర్పాటయింది. కాని, వివాహం జరుగలేదు) సుప్రసిద్ధ ఫ్రెంచినవలారచయిత ప్రౌస్ట్ గురించి ఆయన విమర్శ గ్రంథమూ వ్రాశారు.

1945 కల్లా ఆయన ఫ్రెంచి భాషలో రచనలు చేయడం మొదలు పెట్టారు. వాటిని తనే ఆంగ్లభాషలోకి అనువదించారు. (ఆయన జేమ్స్ జాయ్స్ రచనలుకూడా ఆంగ్లీకరించారు.) ఆయనను ప్రపంచ విఖ్యాతుణ్ని చేసిన ప్రధానమయిన రచన 'వెయిటింగ్ ఫర్ గోడోట్' అనే రూపకం. దీనిని ఆయన ఫ్రెంచి భాషలో ఒక్క నెలలో వ్రాశారు. 1952 లో దానిని ఆంగ్లంలోకి అనువదించారు. 20 సంవత్సరాలకుపైగా అంతగా పేరుకురాని కవి, నవలా రచయిత అయిన బకెట్‌కు ఈ రూపకం త్వరలోనే అపారకీర్తి ప్రతిష్ఠలు సంతరించింది. 'ఓహ్, ది గుడ్ డేస్', 'ఎండ్‌గేమ్', 'ఆల్‌దట్ ఫాల్ ఒర్' 'మార్ఫీ', 'మెలోన్ డైస్', 'ది అన్ నేమబుల్', 'వాట్ దట్ ఈజ్' 'క్రాప్స్ లాస్ట్ టేప్' అనేవి ఆయన ప్రసిద్ధరచనలలో కొన్ని.

మానవుని పతనం, కష్టాలు, ఒంటరితనం, నిరాశ ఆయన రచనలో కొట్టవచ్చినట్టు కనిపిస్తాయి. శ్రీ బకెట్ ద్వితీయ ప్రపంచ మహాసంగ్రామ సమయంలో ఫ్రాన్సులోవేవుండి, అనాక్రాంతమండలంలో 1942 సం–నుంచి 1944 వరకు నివసించారు. ఆయన ఇప్పటికీ పారిస్ నగరంలోనే నివసిస్తున్నారు. జీన్ పాల్ సార్త్రేలాగ ఆయన తన తర్వాత రచనలలో అల్లరిచిల్లరి దేశదిమ్మరివారినికూడా చిత్రించారు. ఒక దిమ్మరి ఆతనిని పారిస్‌లో కత్తితో పొడిచాడు కూడా. పుపుసాల్లో దెబ్బతగిలింది. ఆస్పత్రిలో చేర్చారు. తను కోలుకొన్నవెంటనే ఆయన చేసినపని ఏమిటంటే, తనను కత్తితో పొడిచినవాడిని జెయిలుకు వెళ్ళి పరామర్శించడం.

శ్రీ బకెట్ ఎవరికీ దొరక్కుండా తప్పించుకొని తిరిగే వ్యక్తి. ఆయన పత్రికా విలేకరులను, ఫొటోగ్రాఫరులను ప్లేగులాగ భావిస్తారు. వారిని దగ్గరికి రానీరు. నోబెల్ బహుమతి ప్రకటించినప్పుడు ఆయన టునీషియాలో వినోదకాలక్షేపం చేస్తున్నారు. పత్రికా విలేకరులు ఆయనను కలుసుకొనడానికి

ప్రయత్నించారు. ఆయనను కలుసుకొనడానికి అవకాశంలేదని, దక్షిణ ట్యునీషియా వరదలతో వేరయిపోయినట్టు కనిపిస్తున్నది గనుక ఆయన ప్రపంచానికి వేరుగా వున్నాడని పత్రికా విలేకరులకు వర్తమానం అందింది.

ఆయన బక్కపలచగా వుంటారు. ఆకుపచ్చ రంగుకళ్ళు. జీవితంలో ఎప్పుడూ ఏ పత్రికా విలేకరికీ తనతో ముచ్చటించడానికి అవకాశ మివ్వలేదు. విఖ్యాత రచయితలు ఫాక్నర్, ఇ. ఎం. ఫోర్స్టర్, ఎజ్రా పౌండ్, టి. ఎస్. ఎలియట్, బోరిస్‌పాస్టర్‌నాక్, హెన్రీమిల్లర్‌వంటివారిని కలుసుకుని పట్టుదలతో వారి విషయాలు తెలుసుకొని ప్రచురించిన 'పారిస్ రివ్యూ' శ్రీ బకెట్‌ను పట్టుకోలేకపోయింది. బకెట్ ఇచ్చిన ఒకేఒక ఇంటర్వ్యూ ఎనిమిది సంవత్సరాల క్రితం ఒక ఫ్రెంచిపత్రికకు.

తను ఏ తత్త్వవేత్త గ్రంథాలూ చదవలేదని ఆయన తనతో ఇంటర్వ్యూ చేసినవారివద్ద ఒప్పేసుకున్నారు. 'ఎందుకంటే, వారు వ్రాసేది ఏదీ నాకు అర్థం కాదు' అని ఆయన అన్నారు.

తను మేధావినని ఆయన ఒప్పుకోరు. 'నేను చేసేదంతా అనుభూతి పొందడం...నేను అనుభూతి పొందినవాటిని వ్రాయడం ప్రారంభిస్తాను.' మేధను గిలిగింతలుపెట్టే రచనలలో 20వ శతాబ్దంలో మహత్తరమయిన రచనను (వెయిటింగ్ ఫర్‌ది గాడోట్) రచించినట్టివాడు ఏమి చెబుతున్నాడంటే, తన రచనలలో ఎలాటి తత్త్వమూ లేదని.

పెగ్గీ గగ్గెన్‌హీమ్స్ అనే మహిళ తన జ్ఞాపకాలలో ఈ సిగ్గరి రచయితను 'ఒక కళావ్యసని ఒప్పుకోలు' (కన్‌ఫెషన్స్ ఆఫ్ ఎన్ ఆర్ట్ ఎడిక్ట్) అని హృదయం తాకేట్టు చిత్రించింది. పెగ్గీ తన భర్తకు విడాకులిచ్చింది; ఆ సమయంలోనే బకెట్‌ను ఆమె తొలిసారిగా చూడడం తటస్థించింది. ఆమె 'అతనిపై ప్రేమతో ఉక్కిరిబిక్కిరి' అయింది. ఆమె నివాసం లండన్‌లో. అక్కడ ఆమె ఒక గ్యాలరీని నిర్వహించేది. బకెట్ ఏమో ప్యారిస్‌లో వుండేవారు. ఆమె నిరంతరం ఆ రెండు నగరాలకూ రాకపోకలు సాగించేది. 'ఆయన ఏమికోరినా నిరాకరించేదానినికాను......నన్ను పెళ్ళాడడమో, నన్ను వదలుకోడమో ఆయన నిర్ణయించుకోలేకపోయేవాడు.' పెగ్గీకి అతనితో సంభాషిస్తూ గడపడం, కలిసివుండడం ఎంతో ఆహ్లాదంగా వుండేవి అయితే, ఆయనతో సంభాషించడం కూడా కష్టమయిన పనే. 'ఆయనకు ఎప్పుడూ అత్యంతోత్సాహం కలిగేదికాదు. గంటల తరబడి కాలం గడిచి, మధుపాత్రమీద మధుపాత్ర పడుతూవస్తే అప్పుడు కొంచెం ఉత్సాహం కలిగి తనను అభివ్యక్తీకరించుకొనేవాడు. బక్కపలచని శరీరం, ఆకుపచ్చని కళ్ళు, పలుచని ముఖం, గద్దముక్కు — ఎంతో మోహం కలిగించేవాడు. దుస్తులుమాత్రం ఫ్రెంచి పద్ధతి; ఒంటికి అంటిపెట్టుకొని వుండేవి. ఆయన చాల తెలివితేటలు గలవాడు, విడదీసిచెప్పరాని వ్యక్తిత్వం ఆయనది'

'వెయిటింగ్ ఫర్ గడోట్' రూపకం వరౌలిక మహాదృశ్యకావ్యం' అని ప్రముఖ బ్రిటిష్ సాహిత్య విమర్శకుడు సిరిల్ కొనోలీ వర్ణించాడు. బకెట్ రచనలలో ఒక్కటయిన 'వాట్ ఇట్ ఈజ్' అనే దానిలో కథగాని, ఎత్తుగడగాని, మొదలుగాని చివరగాని లేదు. దానిలోని పాత్రలు పెక్కుసార్లు పేర్లు మార్చుకొంటాయి......177 పుటల ఈ పుస్తకంలో ఎక్కడా కామా, ఫుల్‌స్టాప్‌వంటి వాక్య విశ్రమ చిహ్నాలు లేవు. ఇక ప్యారాగ్రాఫులా వరుసన అసంబద్ధాలు ఎన్నో.

ఎలియట్ పాత్రలలాగా బకెట్ పాత్రలూ శాశ్వతంగా నిర్వాసితులు; విశ్వకాందిశీకులు. ఒక విమర్శకుడు అన్నట్టు 'తామెప్పుడూ సృష్టించని ప్రపంచంలో నివసిస్తూ, తమను అర్థంచేసుకోని సంఘంలో వ్యవహరిస్తూ, తమ అభిప్రాయాలు ఎప్పుడూ నచ్చచెప్పలేనివారిని పెండ్లాడుతూ, తాము జన్మించిన సంఘంగాని, ప్రపంచంగాని అర్థం చేసుకోనట్టి పిల్లలని కని ప్రపంచాన్ని నింపుతూ, వున్నట్టివారు.'

బకెట్, చరిత్ర నొక దుస్స్వప్నంగా, విపరీతంగా చూస్తారు. ఆయన ప్రపంచంలో అన్నిరకాల ప్రజలు — అన్యాయం చేసేవారు, అన్యాయబాధితులు, చతురులు, మూర్ఖులు, జీవితంలో విజయం పొందినవారు, ఓడిపోయినవారు అధఃపతితులు,— అందరూ సమానంగా ఈ జీవితమనే రైలు స్టేషన్‌లో వేచివుంటారు. వేచివుంటూనే సమానంగానే, అన్ని వ్యవహారాలూ సాగిస్తారు—చంపడం, మోసగించడం, అబద్ధాలు చెప్పడం, ఆశించడం, మూత్రించడం, విసర్జించడం; పాడడం—మొదలయినవి సమానంగానే చేస్తారు.' భంగ్యంతరంగా చెప్పాలంటే, బకెట్ వర్తమాన ప్రపంచ జీవితాన్ని యథాతథంగా, వాంతులు చేసుకొని చచ్చిపోతామేమో నన్నంత అసహ్యం పుట్టించే పాశవికమైన, తిరుగులేని నిష్కాపట్యంతో చిత్రిస్తారు.

నోబెల్ బహుమతి వార్త వినగానే బకెట్ భార్య 'ప్రళయం' అని అన్నది. 'చాల చెడ్డపని జరిగింది' అని అతనిమిత్రుడు, పారిస్‌లో ఆయన ఏజంటు అయిన ఒకవ్యక్తి గట్టిగా అరిచాడు. బకెట్ ఈ బహుమతిని నిరాకరిస్తారనడం జరుగకపోవచ్చు కాని, ఆయన ఈ 6,75,000 రూపాయల ఈ బహుమతిని 'స్వీకరించడంకోసం అంత దూరం, స్టాక్‌హోమ్‌కు వెళ్ళాతా డనడంకూడా సంభవం కాకపోవచ్చు. ఆ మధ్య ఆయన మిత్రుడొకడు 'బకెట్ ఆ బహుమతి కోసమని, —అంత దూరం స్టాక్‌హోమ్‌కు వెళ్లి, ఏవేవో దుస్తులు వేసుకుని, ఆ సమావేశంలో ఓపికగా కూర్చుని బహుమతి స్వీకరిస్తాడని అనుకోను' అని అన్నారు. ఇది నిజమైనమాట.

ఈ బహుమతి డిసెంబర్ 10 వ తేదీన అందజేయ బడుతుంది.

—శ్రీ శిరుమల్ల వెంకటనారాయణ.

పాండవ విజయము

'పాండవ విజయము' అనునదియొక అముద్రిత ద్విపద కావ్యము.

గ్రంథకర్త పేరు తెలియదు. కావ్యమును సంపూర్తిగా చదివినను కవిపేరు ఎచటను కాన్పింపదు.

అలుకూరి బాలకవి చిన్నప్ప కుమారుడు రామన్న అనునతడు దీనిని తాటియాకుల వ్రాతగ్రంథము నుండి ఎత్తి పుస్తకములో వ్రాసుకొన్నట్లు కావ్యాంతములో రామన్న వ్రాసుకొన్నాడు. ఈ రామన్న రాయమూరి ప్రాంతమువాడని తెల్పుకొన్నాడు. ఈ గ్రంథమునం దచ్చటచ్చట కన్నడ ప్రయోగములు గన్పట్టుటచే యీ గ్రంథమును రాయమూరి ప్రాంతపు కవి వ్రాసినాడేమో యని యూహింపవచ్చును.

ఈ గ్రంథకర్త తన గురువులైన భట్టరు శ్రీ చెన్నభట్టరాచార్యులను స్మరించినాడు. ఇంతియ కాక శబ్దనాటకాలంకార శాస్త్ర వివిధ ఛందోమార్గ, వివిధ ప్రబంధ సారార్థ సంగ్రహమూర్తి, కారుణ్య జలధి మంగరసాన సుకవి పదపద్మములను ప్రస్తుతి చేసి, నవరసభావ వైఖరుల విలసిల్ల పాండవ విజయంబు నెఱయంగ ద్విపదగా రచించెదనని వ్రాసుకొన్నాడు.

కథా ప్రారంభమున శ్రీ తిరుపతి వెంకటేశ్వరుని అలవేలు మంగమ్మను తరువాత గణనాథుని ప్రార్థించినాడు.

ఇ తి వృ త్త ము

'భీమసేనుడు సౌగంధికాపుష్పమును గొనితెచ్చి ద్రౌపదికి నొసంగుట'యను కథయే యీ 'పాండవ విజయమందలి' ముఖ్యసారాంశము. భారతములోని కథకును, యీ ద్విపదకావ్యములోని కథకును చాల వ్యత్యాసమున్నది. కవి స్వతంత్రించి పాండవ విజయమును కావ్యరూపమున రచించినాడు. తుదకు హరిహరులు ఒకరితోనొకరు పోరాడవలసివచ్చును. పాండవుల ప్రక్క కృష్ణుడును, కుబేరునివైపు శివుడును చేరి ఘోరయుద్ధము సల్పునంతలో బ్రహ్మ ప్రత్యక్షమై వారిద్దరి అభేదత్వము (హరిహరాద్వైతము) నిరూపించి, పాండవులకు కుబేరునకు సంధి యొనర్చి సౌగంధిక పుష్పములను భీమసేనున కిప్పించును

శైలి

పరికించిచూడ ఈ కావ్యమున కావ్యలక్షణములతో, లోకోక్తులతో, తెలుగు నుడికారములతో, జాతీయములతో; అంత్యానుప్రాస, రూపక, శ్లేషాలంకారములతో పురవర్ణన, కైలాసవర్ణన, సూర్యాస్తమయ, సంధ్యారాగ, యుద్ధవర్ణనలతో, ఓజోగుణభూయిష్ఠముతో కవిత్వము సర్వాంగసుందరముగా నున్నది. చదువ[illegible] ప్రసాద గుణముగల్గి, చదువరుల కుత్సాహ జనకముగా నున్నది. కోమల పదములతో దీర్ఘ సమాసములతో నొప్పారుచున్నది.

నేడు ద్విపద కావ్యముల కెక్కువ ప్రశస్తి లేదు. పూర్వమునుండి అనేక ద్విపద కావ్యము లముద్రితముగానే నిలిచిపోయినవి. కంచెర్ల శరభ కవియు, మోచెర్ల అన్నయయు శ్రీనాథుని కాశీఖండమును ద్విపద కావ్యముగ పరివర్తించిరని ప్రతీతి. అవి లభ్యముగుట లేదు లభ్యములైనను యవి అముద్రితములు. అముద్రిత కావ్యము లనేకములున్నవి అముద్రిత ద్విపద కావ్యములలో 'పాండవ విజయము' అను నదొకటి.

శ్రీ తూమకుంట భీమసేనరావు.

సవరణ

1969 అక్టోబరునెల భారతిలో ప్రచురింపబడిన 'లక్ష్మీభీమవరాగ్రహారదానశాసనము'లో 16 పేజీలో కొన్ని పొరపాట్లు పడినవి కావున ఈ క్రింది విధముగ సవరింపకోరెదను

(i) మొదటికాలములో 16, 17, 18 సంఖ్యను 17, 18, 19 అని సవరించుకోవలెను.

(ii) 'రాజవీధి అలంకరింపబడిన బంగారు, మంచిముత్యములు, మాణిక్యములు (రత్నములు), అగరు, చందనము మొదలగు సువాసనద్రవ్యములు, కస్తూరీ, కుంకుమ (పచ్చ)కర్పూరము, పన్నీరు మొదలగు మనోహరమైన వస్తుసముదాయముచే ఇంపును కలుగుజేయుచున్నది.' 16...' అని సవరించవలెను

—మునునూరి సాంబశివరామమూర్తి.



గ్రంథ విమర్శలు

వేదభాష్య భూమికా సముచ్చయము

[అనువాదకులు : శ్రీ వంగల వేంకటరామ శాస్త్రి. ప్రాప్తిస్థానము : శ్రీ వంగల వేంకటరామ శాస్త్రి, సాహితీసమితి, తాడికొండ (గుంటూరుజిల్లా) డెమీ-$\frac{1}{8}$ పేజీలు 276+26 హాఫ్ కాలికోబైండు వెల : రు. 10/-]

ఈ గ్రంథము అనువాదమే యైనను ఉత్తమ గ్రంథమునకు అనువాదము. అనువాదపద్ధతియు శ్రేష్ఠమైనది.

భారతీయ ధర్మమునకు మూలము వేదము. అందులో ఎక్కువభాగము కర్మకాండకు అన్వయించును. కర్మమనగా ధర్మమే - రెండవది విస్తృతిలో తక్కువదైన జ్ఞానకాండను ప్రపంచించుచున్నది. ఆ రెండవ భాగము తత్త్వవిచారణలో మానవజాతి ఇంతవరకు సాధించినవానిలో ఉత్తమకోటికి చెందినదని నిస్సందేహముగా వక్కాణింపవచ్చును. కాని భారత ధర్మ స్వరూపమును ఉన్నదున్నట్లు తెలిసికొనవలెనన్న ఆశ్రయింపవలసినది కర్మకాండ భాగమే. దానిని చక్కగా అనుష్ఠించి దానిద్వారా వైరాగ్యాది సాధన సంపద కలిగినవాడే జ్ఞానకాండకు ముఖ్యాధికారి కాగలడని శాస్త్రము లుద్ఘోషించుచున్నవి.

వేదను ఉత్తమ ధర్మమును తత్త్వమును ఉపదేశించు గ్రంథ జాతమే కాక ఇప్పటికి లభ్యమైన వానిలో పురాతనతమమైనది. అందువల్ల ఏవిధముగా చూచినను వేదస్వరూపావగాహనము బుద్ధిమంతుల కందరికి అత్యవసరము; అందును భారతీయులకు అత్యంతావసరము.

వేదమే ధర్మమూలమని విశ్వసించిన మన ప్రాచీన ఋషులు దాని విషయములో చేసినంతకృషి మరి యే యితరగ్రంథమునకు చేయలేదు. ఆ కృషి ఎక్కువభాగము గ్రంథములను లిపిబద్ధము చేసి స్థిరపరచుటకు ఉపయోగకారియైన 'లిపి' పుట్టక ముందే జరిగినదని గ్రహించినప్పుడు అద్భుత మనిపించును. అధ్యయన విధివల్ల వేదము విస్మృతము కాకుండ జేయుటేకాక పదవిభాగము, అర్థము, వినియోగము విపరీతమార్గములు పట్టకుండ జేయుటకై వేదాంగములు పుట్టినవి. వేల సంవత్సరముల క్రిందట అందులో వారు ప్రదర్శించిన తీక్ష్ణ సూక్ష్మబుద్ధి ప్రపంచ విద్వాంసుల కందరికి అద్భుతావహముగా నున్నది.

ఈ రెండు శతాబ్దములలో పాశ్చాత్య విద్వాంసులుకూడ ఎంతోనిశితముగా వేదపఠనము చేసినారు. వేదవిషయమున వారు చేసినంత కృషి మరియే భారతీయ గ్రంథజాతమును గూర్చియు చేయలేదు. ఐనను పాశ్చాత్య విద్వాంసులది, అది ఏదో తెలిసికొనవలెనను కౌతుకముతో మాత్రమే చేసినకృషి. భ్రమ ప్రమాదములవల్ల వారికి ప్రత్యవాయ భయములేదు.

కాని మన ప్రాచీన ఋషులది అట్లుకాదు. వారికి వేదము ధర్మమునకు మూలమను నిశ్చయము కలదు. కావున వేదానుయాయులను ఏ మార్గమున నడపించిన అణుమాత్రమైన ధర్మభంగము కాకుండునో, అది ప్రపంచించుటే వారి యాశయము. ఏమాత్రము భ్రమప్రమాదములకు లోనైనను తమకు పాపము, నిరయము ప్రాప్తించు నను భయభక్తులున్నవి. తాము ప్రపంచించు చున్నది సరియైనదని నిశ్చయముతో కూడిన నిష్కంప భావ మున్నది.

వేదాంగములని ప్రసిద్ధివడసిన శిక్ష, కల్పము, నిరుక్తము, వ్యాకరణము, ఛందస్సు, జ్యోతిషము — ఈ ఆరును, ఒకవిధముగా చూచినచో, వేదమునకు వ్యాఖ్యానములే అనవచ్చును. వానికర్తలు అతిమానుష ప్రజ్ఞాశాలులైన ఋషులు కనుక వానికికూడ వేదములకున్న ప్రామాణ్యము వచ్చినది. వాని తర్వాత

పేర్కొనదగినవి వేదభాగమును సూత్రించిన జైమినీయ సూత్రములు, వేదాంతభాగమును సూత్రించిన బాదరాయణ సూత్రములు. వేదప్రామాణ్యము నంగీకరించిన పూర్వాచార్యులెవ్వరును షడంగములకును పూర్వోత్తర మీమాంసాదర్శనములకును వేదతుల్యమైన ప్రామాణ్యమును ఇయ్యకుండుటకు సాహసింపలేదు.

భారతీయ ధర్మమునకు మూలమైన వేదమునకు 14 వ శతాబ్దమునకు పూర్వము ఎన్నో భాష్యములు పుట్టి ఉండవలె కాని అవి యిప్పుడు నామమాత్రముగనే ఎక్కువభాగము తెలియవచ్చుచున్నవి. అందులో లభ్యమైన కొద్దివిగాని, ఇతర గ్రంథములవలన తెలియవచ్చుచున్నవి కాని, వేదములో ఆయా భాగలేశములకు సంబంధించినవేగాని సమస్త వేదమునకును సంబంధించినవి కావు.

వేదము లన్నిటికి — వేదాంతములతో సహా — వేదాంగ సమ్మతముగాను, పూర్వోత్తర మీమాంసా దర్శనముల కనుగుణముగాను, వేదసర్వస్వమునకు ఏకవాక్యత కూర్చుచు పుట్టిన ప్రామాణికము, సమగ్రము ఐన మొదటిభాష్యము విద్యారణ్యమే. అది మొదటిదేకాదు. అట్టిది ఇంతవరకు పుట్టినది అది ఒక్కటియే. దానికర్త సాయనాచార్యులని గ్రంథములవలన తెలియుచున్నది. లోకప్రతీతి మాధవ విద్యారణ్యకృతమని విస్తారముగా ఉన్నది. కర్తృత్వము ఏ ఒక్కవ్యక్తికి ఆరోపించినను, అంత బృహత్కార్యము ఒక్కరి మీద జరుగుట మానవసాధ్యము కాదనిపించును. అప్పుడు భరతభూమి నాలుగు దిక్కుల నుండి వేదవిద్వాంసులు ఆత్మధర్మ రక్షణార్థమై శ్రీ విద్యానగరమునకు చేరియుండవలె అట్టి పండిత పరిషత్తు సహాయముతో సాయనాచార్యులు దీనిని నిర్వహించి యుందురు. ఈ మహాకార్యారంభమునకు నిర్వహణమునకు తప్పక శ్రీ విద్యారణ్యుల ప్రాపు ఉండి ఉండవలెను. శ్రీ విద్యారణ్యుల ఆమోదముద్ర పొందినందుననే దానికి ప్రామాణ్యము సిద్ధించినది. కావున దీనిని విద్యారణ్యమనుటే యుక్తతరము. శ్రీ విద్యారణ్యులు అనునది ప్రతాపనామము. వారు శ్రీ విద్యాశంకర భారతి నామముతో శ్రీ శృంగేరీ జగద్గురు పీఠమునకు అభిషిక్తులై, తమ స్థిర నివాసమును శ్రీ విరూపాక్షమునకు మార్చినారు. వైదిక ధర్మమునకు ప్రబలప్రమాదము మూడుచున్న కాలమది! అది గమనించి దూరదృష్టిగల విద్యారణ్యులు హరిహర బుక్కరాయాదులను ప్రోత్సహించి, తనపేర శ్రీ విద్యానగరము స్థాపించి వారికి అవసరమైన ద్రవ్యసహాయముచేసి, శ్రీ విద్యానగర స్థాపనాచార్యులైనారు. ఆ సామ్రాజ్యము కొన్నివందల సంవత్సరములపాటు వేదధర్మమునకు కోటగా నిలిచినది. దాని మహత్త్వము మాత్రమే సామాన్యముగా నందరెరుగుదురు.

ఈ లౌకికసామ్రాజ్యములు స్థిరములు కావని సర్వజ్ఞులయినవారికి తెలియదా? శాశ్వతముగా, అక్షరముగా వైదికధర్మము నిలుపుటకే వారు వేదభాష్యమునకు పూనుకొనినారు. శ్రీ విద్యానగరసామ్రాజ్య స్థాపనముకంటెను వేదధర్మప్రతిష్ఠకు వేదభాష్యరచనము సహస్రగుణముగా అవసరమైనది. నేడు కాకున్నను ముందుతరములవారికైనను భారత ధర్మ రక్షణమునకు పూనుకొనువారికి ఈ వేదభాష్యము మార్గదర్శకముగా ఉండునట్టిది

కొంతకాలమునుండి ఎందువల్లనో వేదముల యందు శ్రద్ధ తగ్గుటేకాక అలసద్వేషభావములు కూడ కానవచ్చుచున్నవి. స్వాతంత్ర్యము వచ్చినతర్వాత మరింత వర్ధిల్లుచున్నవి. ప్రజలకు, కొంతకాకున్న కొంతయైనను, వేదాంతభాగములమీద శ్రద్ధ కలుగుచున్నదికాని వేదభాగముమీద ఏమాత్రము విశ్వాసము కలుగుటలేదు. ఇట్టి సమయములో శ్రీ వేంకటరామ శాస్త్రి ప్రకటించిన ఈ యనువాదగ్రంథము ఆంధ్ర పాఠకులకు తప్పక వేదధర్మస్వరూపమును గ్రహించుటకు కొంతకనువిప్పుగా ఉండగలదు.

వేదముల కిట్లు భాష్యము వ్రాయుచు ప్రతి దానికిని వేరువేరుగా భూమికలు వ్రాసినారు. ఆ భూమికలన్నియు ఈ గ్రంథములో ఆంధ్రీకరింపబడినవి. వేదభాష్యమంతయు ఆంధ్రీకరించుట అలవికాని పని. ఈ భూమికలు చదివినవారికి తప్పక వేదశాఖలన్నిటితో ఒకమాత్రమైన పరిచయము కలిగి, వేదస్వరూపమును సంపూర్ణముగా తెలిసికొనవలెనను నుత్కంఠ కలుగును. సామాన్యజనులకు వేదమును గూర్చియు, వేదధర్మమును గూర్చియు నేడు ప్రచార

ములోనున్న అపోహలు చాలవరకు తొలగిపోగలవు.

వేదము స్వతః ప్రమాణమైనదని మనము తరుచుగా వినుచుందుము. అది స్వగ్రంథాభిమానముచేత చేయు మూఢుల పిడివాదమనుభావము లోకములో ప్రచారములో నున్నది. ప్రామాణ్యవిచారణ కొంచెముగా తైత్తిరీయసంహితాభూమికలోను. విపులముగా ఋగ్వేద భాష్యభూమికలోను ఉన్నది. ఆ భాగములు చదివిన వారు ఆ విషయమును గూర్చి ఎంత మోమోటము లేకుండ ప్రశ్నలు వేసికొని సమాధానము లిచ్చిరో చూచి ఆశ్చర్యపడుదురు. వేదములో ఏ భాగము ఎంతవరకు ప్రమాణము? ఎందువల్ల? ఇటువంటి విచారణలు ఎంత నిశితతార్కికదృష్టితో చేసినారో కూడ అవగతమగును.

అట్లే, వేదము అపౌరుషేయమనుటలో తాత్పర్యమేమి? మంత్రస్వరూపమేమి? సామవేదము గానముచేయుటలో ఊహగ్రంథము, ఊహగానము ఇత్యాదుల స్వరూపమేమి? అథర్వవేదభాష్యభూమికలో, 'అది వేదమే కాదు, కనుక వ్యాఖ్యానము అనవసరము' ఇత్యాదిగా వాదించినవారి మాటలు స్పష్టముగాచెప్పి, విచారణచేసి, తుదకు అది బ్రహ్మవేదమనియు, అథర్వవేదవిదుడైన శ్రోత్రియుడే యజ్ఞాదులలో బ్రహ్మస్థానమునకు ఉత్తమాధికారియనియు సిద్ధాంతము చేయబడినది

ప్రతి చిన్నవిషయములో ఎంత నిశితముగా విచారణముచేసి ఈ భాష్యము వ్రాయబడినదో తెలుసుకొనుటకు, ఏవరుసలో సంహితల భాష్యములు వ్రాయవలెనో అను విషయమువ చేసిన విచారణ చాలును. సామాన్యముగా ఋగ్వేదము ప్రథమముగా పరిగణింపబడుచున్నది కాని భాష్యము తైత్తిరీయ సంహితా (కృష్ణయజుర్వేదము) భాష్యముతో గ్రంథమారంభమైనది. తర్వాత ఋగ్వేదమునకు, ఆతర్వాత సామవేదమునకు, పిమ్మట కాణ్వసంహితకు (శుక్లయజుర్వేదము) తుదకు అథర్వవేదమునకు— ఈ వరుసను భాష్యము వ్రాయబడినది; ఈ వరుస గ్రహించుటకు ఋగ్వేద భాష్య భూమికారంభములోనే చక్కని సమాధాన మీయబడినది.

ఈ లోక విషయములు కాకుండ పరలోక విషయములందు మాత్రమే ప్రజలబుద్ధిని కేంద్రీకరింప జేసినందుననే మనదేశము వెనుకబడి పోయినదని ఈనాడు తరుచుగా విమర్శలు వినుచుందుము. అట్టివారు అథర్వవేద భాష్య భూమిక పఠించినచో తమ పొరపాటు గ్రహింపగలరు. వేదధర్మ వేదధర్మము మానవులను పూర్ణపురుషులను చేయుటకు ఉద్దేశింపబడినదని తెలిసికొందుము. ఈ భూమికాపఠనము ఆస్తికులకును నాస్తికులకును గూడ వేదములను గూర్చిన జిజ్ఞాసను అతిశయింపజేయగలదు.

విద్యారణ్యభాష ఎంతో తేటగా నుండును. ఐనను ఎన్నో శాస్త్రవిషయములు కర్కశములైన తర్కపంక్తులు మధ్యమధ్య తప్పనిసరిగా ప్రసక్తములగుచుండును. అనువాదకర్త మూలభావమును ఆంధ్రములో తేటపరచుటకు ఎంతో శ్రమపడినారు. కష్టమైన భాగములుగూడ చేతనైనంత తేటగా వివరించినారు. ఐనను కొన్నిభాగములలో ఝటితిస్ఫురణ కలుగకపోవచ్చును. అట్టి భాగములు సావధానముగా రెండుమూడుమారులు పఠించినచో తప్పక అర్థావగాహనము కాగలదు.

ఇప్పటికి బహుసంవత్సరముల క్రిందట కాశీ విశ్వవిద్యాలయాధ్యాపకులైన బలదేవ ఉపాధ్యాయుల వారు ఈ భూమికలను ఆంగ్ల సంస్కృతోపోద్ఘాతములతో ప్రచురించుచు 'వేదభాష్య భూమికా సంగ్రహః' అని నామకరణము చేసినారు: సంగ్రహ శబ్దమునకు కూర్పు అనే అర్థమె చెప్పుటకైన ఆ నామకరణ ముచితమే కాని సంగ్రహ శబ్దమునకు సంక్షేపమనే అర్థము ఆంధ్రదేశములో వ్యాప్తిలో ఉన్నది. అదికారణముచేత అనువాదకులు ఇది సంక్షేప గ్రంథము కాదు, సంపూర్ణగ్రంథమే అని ఆంధ్రపాఠకులకు సూచించుటకు 'వేదభాష్య భూమికా సముచ్చయము' అని నామకరణము చేయుట సముచితమే.

అచ్చు తప్పులు రాకుండుటకు అనువాదకులు ప్రెస్సువారు శ్రమించినట్లున్నారు గాని ఇంకా చాలా మిగిలిపోయినవి. పత్రికలవారు — పెద్ద ప్రెస్సులవారు కలసి మహోద్యమము లేవదీసినవేగాని ఆంధ్రగ్రంథములలో అచ్చు తప్పులు నెనుకపట్టవు.

ఒకవిధముగా చూచినచో జైమిని బాదరాయణుల తర్వాత వేదధర్మ ప్రతిష్ఠాపనకు దాదాపు

అంత కృషి చేసినవారు శ్రీ విద్యారణ్యులే. ఈ భూమికల పఠనము భాష్యపఠనమునందు ఆసక్తి కలిగింపగలదు. శ్రీ విద్యారణ్య పరంపరా గురువులవలన శ్రీవిద్యా దీక్ష గ్రహించిన శ్రీ వేంకటరామశాస్త్రి ఈ గ్రంథప్రకటనముచేసి ఋషిఋణము తీర్చుకున్నారు. కేవలము మాటలలోనేకాక ఆచరణములో గూడ వేద ధర్మమును అనుష్ఠించుచున్న పుణ్యపురుషులు బ్రహ్మశ్రీ తాడేపల్లి రాఘవనారాయణ శాస్త్రిగారి ఆశీస్సు ఈ గ్రంథమునకు శ్రీ రామరక్ష!

ఆంధ్రులందరు ఈ గ్రంథము శ్రద్ధగా పఠించి వేదమాతృకృపాపాత్రులగుదురుగాక!

— నోరి నరసింహశాస్త్రి.

కరుణాసౌగతము

[రచన: శ్రీ కే. సత్యనారాయణ; ప్రచురణ: విజయమోహన్ పబ్లికేషన్; భీమవరం. వెల 3-00 రు.]

ఎడ్విన్ ఆర్నాల్డు '(Light of Asia)' అనే గ్రంథం వ్రాసిన తరువాత బుద్ధుని జీవితగాథలను గురించి ఉత్సుకత బయలుదేరింది. ప్రాక్పశ్చిమాల్లో ఆ గ్రంథంయొక్క ప్రభావం అమోఘమైంది. ఆర్నాల్డు తన గ్రంథంలో వాస్తవికత కంటె కల్పనకు ప్రాముఖ్యమిచ్చాడు. అందుచేతనే కొన్ని ఘట్టములందు వాస్తవికత వాసించదు. ఆర్నాల్డు తరువాత పార్కన్ అనునతడు బుద్ధునిగూర్చి వచనంలో ఒక గ్రంథం వ్రాసాడు. వీ రిరువురు వ్రాసిన తరువాత ఆంగ్లభాషలో బుద్ధునిగూర్చి గ్రంథాలు బయలుదేరాయి. ఆయా రచయితలకు బుద్ధుని జీవితాన్ని పరిశీలించి బౌద్ధమతసిద్ధాంతాలకు వ్యాఖ్యానం చేయటం పరిపాటియైనది. బుద్ధుని కారుణ్యమూర్తిగా చిత్రించి కావ్యాలు వ్రాసారు. ఏ రచయిత వ్రాసినను కరుణను స్పృశించకుండా ఉండలేదు. ఆర్నాల్డు గ్రంథం వచ్చిన తరువాత తెలుగులో తిరుపతి వేంకటకవులు 'బుద్ధ చరిత్రము' పింగళి, కాటూరి 'సౌందర నందము' మొదలగు కావ్యాలు వచ్చాయి. మతపరంగా కొందరు రచయితలు బౌద్ధమత నిరాసకులైనప్పటికి బుద్ధునియొక్క కరుణాస్వభావాన్ని కాదనలేక పోయారు. మతం మానవత్వాన్ని కొన్ని విషయాల్లో పెంచి రూపురేఖలు దిద్దింది. మరికొన్ని విషయాల్లో గుణం గ్రహింపకుండ మతమే ప్రధానంగా భావించి మానవత్వాన్ని నిర్దాక్షిణ్యంగా రూపుమాపింది. మానవుడు సృష్టించిన మతానికి ప్రాధాన్యమున్నదిగాని మానవునకు ప్రాధాన్యం లేకపోయింది. ప్రతి విషయాన్ని మతంతో ముడిపెట్టి మతానికను గుణంగా ఉన్నట్లయితే మంచియని పొగడి వ్యతిరేకంగా ఉన్నట్లయితే తెగడారు. మతం మానవునిమాత్రం విపరీతస్థితికి తీసుకొని వెళ్ళింది.

బౌద్ధమత సాహిత్యం ప్రధాన భారతీయ భాషల్లో వెలువడింది. ఆ సాహిత్యంవలన ఒక్కొక్క భాషకొక విధమైన ప్రాధాన్యం ఏర్పడింది. బౌద్ధసాహిత్యంలో ధర్మానంద కోశాంబి ప్రసిద్ధులు. అంతేగాక వారు బౌద్ధులు. పాలిభాషలో వున్న బౌద్ధగ్రంథాలు చదివి వాటికి టీకలు వ్రాసి ప్రసిద్ధ రచనలను సాగించారు. బౌద్ధమత సాహిత్యప్రచారానికి వారు చాలవరకు దోహదంచేసారు. వారు వ్రాసిన బౌద్ధ గ్రంథాలకు పాలీగ్రంథాలే ఆధారం. ఆయా గ్రంథాలలో వారి ప్రతిభ అసామాన్యమైంది. భావం స్పష్టంగాను సరళంగా ఉంటుంది. జనసామాన్యాన్ని ఉద్దేశించి వ్రాయబడింది గనుక సరళత అనేది గ్రంథాలకు ముఖ్యమైనది. కోశాంబి తన జీవితాన్ని బౌద్ధానికి కంకితంచేసి ఎన్ని కష్టాలు వచ్చినప్పటికి లెక్కజేయక బుద్ధుని ధర్మోపదేశాలే జీవితానికి ధ్యేయంఅని భావించి జన్మను సాఫల్యం చేసికొన్నవారు.

భారతదేశంలో పుట్టిపెరిగిన బౌద్ధం క్రమంగా కనుమరుగైంది. ఆదరణ తక్కువ అనాదరణ ఎక్కువ. చివరకు భారతీయులు బౌద్ధాన్ని మరచి

పోయారు. స్వదేశంలో బుద్ధునకు చోటులేక పోయినా ఇతరదేశాల్లో బౌద్ధానికి ఉన్నత స్థానం లభించింది. కాలపరిణామంలో నూతనమతాలు అవతరించాయి. ఈ మతాలు బౌద్ధమతంపై తిరుగుబాటు ప్రారంభించాయి. దాని యొక్క ప్రభావం ప్రజలపై పొడుచూపింది. అందుచేతనే బౌద్ధమతం భారతదేశంనుండి అంతర్థానమైంది.

బుద్ధుని జీవితగాథ కరుణామయం. కరకు రాతిగుండెలే కరుణముందు నిలవలేక కరగిపోయాయి. ప్రతిపాదిత సిద్ధాంతాలు ఆలోచనాత్మకాలు. క్రౌర్యాన్ని కాఠిన్యాన్ని రూపుమాపి కరుణను పెంపొందింప జేయుటయే బుద్ధునియొక్క జీవిత లక్ష్యం. ఆ లక్ష్యంకోసం ప్రబోధాలు ప్రారంభించి ప్రశాంత నిర్మల జీవితానికి నాంది పల్కాడు గౌతముడు. ప్రజలమధ్య తారతమ్యాలు రూపుమాపి సమతాదృక్పథాన్నిచూపి అందరికి కరుణను ప్రసాదించి తనవైపుకు మరలించుకొన్నాడు. బాధ వ్యథ జీవితంలో సామాన్యమైనప్పటికి వాటిని అధిగమించి ధర్మసాక్షాత్కారంతో ఎంతటి పనినైనా సాధింపవచ్చునన్న ధైర్యాన్ని కలిగించి కర్తవ్య మార్గాన్ని చూపాడు. బుద్ధుని ప్రబోధాలు కఠినాత్ములను కరుణామూర్తులుగా తీర్చి హృదయపరివర్తన కలిగించి మానవతను ఉద్ధరించేవి. ఆత్మ సంతృప్తిపొందని అమాయక హృదయాలకు నిండుదనం కలిగించేవి.

ప్రతికవికి అనుభూతి ఉండాలి. ఆ అనుభూతే హృదయస్పందనం కలిగించి అంతర్గతభావ చైతన్యం సృష్టించి కవికి కవితగా సాక్షాత్కరిస్తుంది. ఆవిధంగా దర్శనమిచ్చిన కవిత ప్రజలమధ్య పది కాలాలపాటు నిలవడానికి వీలుంటుంది. అనుభూతిపరమైన కావ్యానికొక శోభ చేకూరుతుంది. అనుభూతులనుబట్టి కవితలుకూడ మారుతూఉంటాయి.

శ్రీ కరుటూరి సత్యనారాయణగారు బుద్ధుని చరిత్రలు చదవటంచేత వారిలో వొక భావచైతన్యం కలిగి కరుణాసాగరం వ్రాయాలనే కోరిక కలిగింది. చరిత్రకందిన సత్యాలను కవిత్వంలో రూపురేఖ విలాసాదులలో చిత్రించారు. ఇంతకుముందు వీరు 'రసమంజరి' 'తిష్యరక్షిత' అనే కావ్యాలు వ్రాసారు. 'కరుణాసాగరము' మూడవకావ్యము. ఇందు వస్తువు కరుణరసప్రధానమైనది. కరుణరసానికి ఘట్టములే ప్రతీకలు. ఏ ఘట్టము చూచినప్పటికి బుద్ధునియొక్క మూర్తి కన్నులముందు సాక్షాత్కరిస్తుంది. కావ్యం కరుణ రసపూరితంగాను ఉత్తమ కావ్యంగాను భాసిస్తున్నది.

కావ్యమునందు అంగులిమాలుడు, ఆమ్రపాలి, కానుక, సుదాసుడు, సుప్రియ, కిసగౌతమి, అజాతశత్రువు, సునీతుడు, సుజాత, న్యాయవిచారణ, మహాపరినిర్వాణము మొదలగు పదునొకండు విభాగాలున్నాయి. ప్రతి ఘట్టమునందొక ప్రత్యేకత కాన్పిస్తుంది. అట్టి ప్రత్యేకత కావ్యాన్ని చదివిస్తుంది. ప్రధానంగా ఆమ్రపాలి, కానుక, సుప్రియ, సుజాత మున్నగునవి మధురంగా ఉన్నాయి.

వైశాలీనగర ఆచారప్రకారం ఆమ్రపాలి వేశ్య అయినప్పటికి ఆమెలో కరుణ గూడు కట్టుకొనియున్నది. కన్నబిడ్డ దూరమగుసరికి ఆమె హృదయం భరింపరాని వ్యథకు లోనయింది. కన్నబిడ్డ కన్నతల్లి ముందుకువచ్చి భిక్షను స్వీకరించి అమ్మాఅని పిలవలేక నిర్లిప్తతతో వెళ్ళిపోయాడు. కుమారునియొక్క నిర్లిప్తతకు ఆమ్రపాలి విచారించి బుద్ధుని దగ్గరకు వెళ్ళి

తల్లి నిజంపి పుట్టితివి తల్లియొడిన్
శయనింపలేదు నీ
యుల్లమునందు నక్కటిక మున్నదె
లేదు ప్రియాంగనన్ సుతున్
మెల్లగవీడి వచ్చితివి మిన్నక నీ కిపు
డర్థమౌనె యీ
తల్లియెడంద చెప్పెదవు ధర్మము
లోకము నుద్ధరింపగా

అని తొందరపాటుతో మాటాడింది. వాత్సల్యం రుచిచూడని బుద్ధునకు ఆమ్రపాలి వాత్సల్యం అర్థం

కాలేదు. కనుక పో బిడ్డను సేకిస్తానని ఆమెతో చెప్పలేక పోయాడు. ఆమ్రపాలి బిడ్డ కాషాయవస్త్రాలు ధరించి భిక్షు స్వీకరిస్తూంటే ఆమె మనస్సు వికలమైంది. ఆమెయొక్క పుణ్యఫలంటను బుద్ధుడు దోచుకున్నాడు.

మతంయొక్క అభివృద్ధికోసం బలవంతంగా బౌద్ధులు మతస్వీకారం చేయించారు. స్వీకరించినవారది గ్రహింపలేదుగాని చూచినవారు మాత్రం ఓర్పు వహింపలేక పోయారు. దానికి కారణము లేకపోలేదు.

ఆమ్రపాలి జీవితాన్ని బుద్ధుడుచూచి కరుణ వహించి అనుబంధాలు త్రెంచుకొని సంఘాన్ని శరణు వేడుకోమన్నాడు ఒకప్రక్క తనబిడ్డ కొఱకామె తపిస్తూంటే తనబిడ్డసంగతి చెప్పకుండ సంఘాన్ని శరణు వేడమంటాడు. అదేమంటే అనుబంధాన్ని త్రెంచుకొమ్మన్నాడు. తనకు లాగును అనుబంధాలను ఒక్కసారిగా ఎవ్వరూ త్రెంచుకోలేరు. తనమతం కొఱకు మాత్రమే బుద్ధుడు చూచాడుగాని కన్నతల్లి హృదయం ద్రవించి పోతున్నదన్న విషయాన్ని గ్రహింపలేక పోయాడు. ఆమెకుమాత్రం

ఈ యవిజ్ఞాత హేతువు వెతెగినపుడె
పరిమళించును సుమ్ము నీ బ్రతుకుబాట
వెలుగుకిరణము చీకటి వెడలజేయు

పడయుదువు తల్లి నిర్వాణ పదము భక్తి — అని సెలవిచ్చాడు. ఒకవిధంగా యిది సముదాయించటమే. కన్నబిడ్డపై ఉండే మమతను త్యజింపలేక పోయింది ఆమ్రపాలి. కాని సాదరపేశలమ్మలగు స్వాంతన వాక్యాలు ఆలకించి జ్ఞానోదయమై హృదయభారం తీరేవిధంగా బుద్ధునకు మ్రొక్కింది ఆమ్రపాలి.

'కానుక' నిండు మనస్సుతో దానిమ్మపండును బుద్ధునకు ఒసంగినట్టి వృద్ధురాలిచరిత్ర. బుద్ధుడు దానిని మహాప్రసాదంగా స్వీకరించాడు. కానుక ఏదైనప్పటికి నిస్వార్థచిత్తంతో నిర్మలమైన భక్తితో సమర్పించిన వస్తువు అమూల్యం. అందు చేతనే దానిమ్మపండును బుద్ధుడు స్వీకరించాడు.

'సుప్రియ' ఒక బిచ్చకత్తె. క్షామకాలంలో తాను ఇంటింటికి తిరిగి ధనాన్ని ప్రోగుచేసి క్షామ పీడుతులకు పంచియిచ్చింది. ఆమె అనాథ అయినప్పటికి కలవారు ఆమెముందు తలవంచాలి. కలవారు చేయని పనిని సుప్రియచేసి చూపించింది. ఆమె జీవితాన్ని క్షామకాలంలో ఉన్న ప్రజలకు సమర్పించి నిస్వార్థపరురాలుగా కీర్తింపబడింది. ఆమెయొక్క త్యాగబుద్ధియే జీవిత పరమార్థమై బుద్ధునకు ఆనందప్రదమైనది.

'సుజాత' బిడ్డలు లేరంటూ అశ్వత్థ వృక్షానికి ప్రదక్షిణలు చేసింది. కొంత కాలానికి బిడ్డ కలిగాడు. ఆ సంతోషంతో నైవేద్యానికై పాయసాన్నాలు తీసికొనివచ్చింది. ఆ సమయంలో సిద్ధార్థుడు కన్పించాడు. సుజాత సిద్ధార్థుని వనదేవతగా తలంచి పాయసాన్నాలు అతనికి సమర్పించింది. ఆమెయిచ్చిన పాయసాన్నాలవల్ల తనకు జ్ఞానోదయమైనట్లుగా భావించాడు సిద్ధార్థుడు. అప్పటినుండి సిద్ధార్థునకు సంబోధికలిగి బుద్ధుడయ్యాడు. ఇట్టి ఘట్టములందు కవి చిత్రించిన దృశ్యములు సాక్షాత్తు దర్శించుచున్నట్లుగా ఉన్నాయి.

మహాపరినిర్వాణమునందు కుమ్మరి చుందుడు తథాగతునకు విందుచేయును. ఆ సందర్భమున మధుర భక్ష్యములతోబాటు సూకర 'మద్దవము' కూడవిందులో వడ్డించాడు. దానిని స్వీకరించి బుద్ధుడు పరినిర్వాణ

మందాడు. ఈ విషయంపై భిన్నాభిప్రాయాలున్నాయి దీనినిగూర్చి ధర్మానందకోశాంబి వ్రాశారు. సూకర మాంసము బుద్ధుడుతినుట కేవలము కల్పన అసత్యమని ఆతనియొక్క తలంపు. బుద్ధుడు సూకరమాంసం భుజించాడని అంగుత్తరనికాయములోని పంచకనిపాత మందు ఆధారములేదు. ఉగ్గగణపతి యిట్లనును.

'మనాపం మే భంతే సంపన్నవరసూకరమాంసం తం మే భగవా పటిగ్గణ్హాతు అనుకంపం ఉపాదా యాతి పటిగ్గహేసి భగవా అనుకంప ఉపాదాయని'. అనేదానిని ఉదాహరించి బుద్ధుడు మాంసం స్వీక రించాడని చెప్పాడు. కాని సూకరముద్దవం అంటే అట్ఠకథలో పందులచేత త్రొక్కబడినచోట పుట్టిన పుట్టగొడుగని అర్థం చెప్పారు. ఈ విధంగా ఉన్న వానిని చూచి రచయిత ఒక నిర యానికివచ్చి సూకర ముద్దవం స్వీకరించాడని దానివల్ల అజీర్ణవ్యాధి రావటంచే నిర్వాణం పొందాడని వివరించారు.

కరుణరస ప్రధానమైన కావ్యంగనుక శైలి కూడ లలితపద సమ్మిళితమై జాలువారుతూన్నది. అన్వయక్లిష్టత కావ్యంలో కాన్పించదు. పద్యంయొక్క నడక సొగసుగా సాగింది. ఉదాహరణ

చిరునవ్వొక్కటి శాన్తనేత్రములు
దోచెన్ మందమందమ్ముగా
గురియించెన్ దయ వాని శీర్షమున
మూర్కొంచెన్ కృపామూర్తి యా
దరమున్ జూపుచు తన్కరుండపుడు
పాదాబ్జమ్ములన్ వ్రాల 'సో
దర లెమ్మ'ంచు ననుగ్రహించె
జినుడంతః పూర్ణకారుణ్యుడై'

ఇట్టి రచన ప్రతిభాగమునందు చూడగలము. సుందరపదశైలియే కావ్యానికి శోభ కూర్చింది.

సుగతునియొక్క చరిత్ర కరుణాపూరితం కాబట్టి కావ్యానికి 'కరుణాసాగతము'ని పేరు పెట్టారు. అన్నిఘట్టములందు తథాగతునియొక్క రూపం పాఠకుని మనోమండలంపై సాక్షాత్కారిస్తుంది. కవితాశిల్పమునందు రచయిత అంతఃప్రజ్ఞ చూపించకపోయినా దృశ్యచిత్రీకరణలో ఒక అడుగు ముందుకువేసారు. ఇందలి భాగాలననుసరించి ఒక్కొక్కభాగాన్ని కొక్కొక్కకావ్యం వ్రాయవచ్చును. కరటూరివారు ఈ ప్రయత్నం చేయగలరని నమ్మకం కావ్యాన్నిబట్టి తెలుస్తుంది. నవ్యులలో కావ్యాన్ని రసవంతంగా తీర్చిదిద్దేవారు చాల అరుదు. కాని కరటూరి సత్యనారాయణగారు నవ్యత్వంలో ప్రాచీనత్వం చూపించి కావ్యాన్ని చక్కగా తీర్చారు. ఇట్టి కావ్యాలు వ్రాయాలని, అవి బహుజనాదరణీయములై సాహితీ లోకంలో వెలయగలవని నమ్మకం ఉన్నది.

— జి. రామమోహనరావు.

కొత్త గొంతులు

(కవితా సంకలనం. ప్రతులకు : జి. విద్యాసాగర్ ఎం. ఏ., ఉపాధ్యాయుడు, తెలుగుభాషాసమితి, ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల, జడ్చర్ల, మహబూబ్‌నగర్ జిల్లా.)

ఈ సంకలనంలోని రచనలన్నీ ఇంకా విద్యార్థులుగా ఉన్నవారి చేతచేయబడ్డవి. దరిదాపు కవు లందరూ ఇరవై సంవత్సరములలోపువారు. 'కూకుండ నీదురా కూసింతసేపు' అనికదా లోలోపల వేదన వ్యక్తీకరణ విషయం. (అన్నింటికి— మంచికి, చెడుకి, వెన్నెలకీ, ఎండకీ--చక్కగా స్పందించే ఓ అమూల్యమైన వస్తువుకదా కవి!) అలాంటి ప్రబల వాంఛా తత్పరత పిల్లందరిలోనూ ఉంది. అయితే అన్నింటికన్నా మిన్నగా రాజకీయ పరమైన అన్యాయాలు, సామాన్యుని వేదనలు, సాంఘికపరమైన కుళ్లు, అసమానత, మానవతారాహిత్యం – సత్యం, నీతి, ధర్మం, నియమం—వీటిపతనం—వీటినందర్నీ మరీ మరీ కదలించి వేసినయ్. చూడండి—

'నే వెతుకుతున్నాను
ఎందరెందరో పోగొట్టుకున్న
మరెందరో పారేసుకున్న

మానవతా విలువలకోసం
మనుజ లోకమంతా వెతుకుతున్నాను'
(అన్వేషణ—యాదగిరి)

చీకటి – చీకటి—చీకటి
ఆకలిలాంటి చీకటి
దఱ్ఱ్యం కనుబొమల కత్తిరించి వేసినట్లున్న
చీకటి'
(కాలం – బాబు)

మా వూళ్ళో సంత జరిగిపోతున్నది
పెద్దచేపలు చిన్నచేపలను తిన్నట్లుగా
బలవంతులు బలహీనులను దోచేస్తున్నారు.
'అన్యాయాన్ని' సంతలో విక్రయించుతున్నారు
'న్యాయానికి' 'నోస్టాకు' బోర్డు కడుతున్నారు'
(సంత జరుగుతున్నది—ఎన్. మూర్తి)

'పురోగమించటంలో మనిషి పురుగ్గామారొద్దు'
(ఆశ – యాదగిరి)

'కచ్చులూ,కావేశాలు హెచ్చి, సత్యాహింసలుచచ్చి
గందరగోళాలు దేశంలో రెచ్చిపోతున్నవయ్యా'
(హే భగవాన్—శ్రీరామకవచం)

'తిరుగుతోంది, తిరుగుతోంది
తిండిలేని కుక్కలా
సత్యమనేది సుందరాంగి'
(కాలచక్రం — ఎం. శివారెడ్డి)

'అగాధమైన లోకంలోతు పాపం
కంట్రోల్‌లో యూరియా దొరకని రైతు
ఆరువెలల జీతమందని ప్రైమరీ స్కూల్
టీచరు
చెప్పులరిగిన నిరుద్యోగులు
ఎన్. జి. వో. లు, కాంపౌండర్లు, చెట్టుకింద
ప్లీడర్లు
చుక్కానిలేని పడవల్లా దిక్కులు మారు
తున్నారు'
(ఉదయం ఎప్పుడు—క్రిష్ణపాటి)

'హాయిగా ఊరకుక్కలను
విందుకు రమ్మన్నాయి ఈ కాకులు'
(విందుబలి—కంకణాల)

'సజీవశవాలగోడు దీనంగా
నిశీధివీధుల్లో ధ్వనిస్తుంటుంది.'
(హెచ్చరిక—వకౌలాలి)

'మానవత, మమతలెరుగని ఈ సంఘం
అసమర్థుల సమాధులపై పునాదులేస్తున్న
దాని వ్యవస్థ'
(బసవరాజు—సామాన్యుని స్వప్నం)

'గాంధి, గౌతమబుద్ధులు
ప్రభవించిన దేశంలో
హింస బుసలుకొడుతుంది
వేయితలల పాములా —
నిరుపేదల బ్రతుకంతా
బలిపీఠగ మారుతోంది.'
(ఎం. శివారెడ్డి—కాలచక్రం)

ఇలా దేశంలో నేటినడుస్తున్నచరిత్రను కళ్ళకు కట్టినట్లు చిత్రించటంతోపాటు—

''కలకాలం
జాగృతజాలం
కావాలనే నాకలం
కాంచుతోంది''
'ఈ క్షితిపై, దుష్టుల
చితిపై, సంఘు దు
స్థితిపై తెరుస్తా నా
మూడవ కన్ను—'
(దాస్యాని—తల్పేస్వామ—మూడవ కన్ను)

తెరపించటంతోపాటు

'నీతిని, నిజాయితినీ నిండి నిప్పెనలుగావేసి
అణుయుగమిమ్మది, అందం, మంచికే
నిలవా'లని
ఆశించటంతో సరిపెట్టుకోక—

'నాలోని వెలుగుతో
ఈ నీడ చెరపి
నా నెత్తుటి వాడితో
ఈ వ్రణము చీల్చి
రక్తచలన సంగీతశ్రుతి
రేపు వినిపిస్తాము,
నేను—భవిష్యత్తు మనిషిని
రేపు కనిపిస్తాను—

(శ్రీ చంద్ర—రక్తచలన సంగీతశ్రుతి)

అని వీళ్లందరి నిర్ణయం—

సమస్యతోపాటు, సమస్యా పరిష్కారమార్గం తెలిసిన వీరికి భవిష్యత్తు 'స్వర్ణయుగం' 'కాంతి కిరణం'. అందుకే అన్నారు—

'కాలగర్భంలో కోడి కూస్తోంది
చుక్కల ఆకాశం నిక్కిచూస్తోంది'
అని
రేపటి ఉదయపు గుసగుసలు విన్నారు కాబట్టే
'ఇక భయం లేదు
రొమ్ము బాటలో
గులాబీలు పూస్తాయి
సమాజం గుడ్డికళ్లకు
(కాంతి) కొత్తచూపులొస్తాయి'

అని కొత్త గొంతులు మధురంగా విన్పించాయి.

ఇందులో అందరూ విద్యార్థులైనా కొందరిలో మంచి పరిణతి కన్పిస్తుంది. చక్కని భావనా పటిమ, దాన్ని పదునైన మాటల్లో పొదిగే నేర్పు ఉన్నాయి—

'కూస్తుంది నా కవిత
కోటి కంఠాల కలత' (రాజా)

'జీవితం
ఓ బలిపీఠం
నిన్ను నీవు అర్పించుకుంటే
తప్ప,
అనుగ్రహించదు
ఆదర్శం
ఓ బల్లెం
నిన్ను నీవు పొడుచుకుంటే
తప్ప,
వాడి కనిపించదు' (చంద్రం)

'నా నెత్తురు వాడి కత్తి
నా బ్రతుకు కన్నీటి వొత్తి' (చంద్రం)

'నేనొక నవగీతిక
మానవుడే దానికి ప్రాతిపదిక' (కంకణాల)

'బురదనుండి, బురద నీటినుండి
సన్నని నీటి పొరలపైన అల్లల్లాడే కలువలాగు
ప్రాపంచిక రొదలనుండి
పైకిలేచి, విస్తరిల్లి, నన్నుతాకింది ఆమె పాట'
(యాదగిరి)

ఇలా భాష భావం వియ్యమందిన చోట్లు చాలా కన్పిస్తాయి. ముమ్ముందు జీవితానుభవం ప్రోగు చేసి, భాషను ఇంకా అందంగా మలచి సుసంపన్నమైన, సౌందర్యావహమైన కవిత్వం వీరు వ్రాయాలని ఆశిద్దాం. పోతే వచన కవిత్వం రాసేటప్పుడు ముఖ్యంగా అది రాజకీయానికి గురి చేయబడ్డప్పుడు, కవి చాలా నేర్పు, జాగ్రత్త చూపించకపోతే అది, అటు గద్యం, ఇటు పద్యంకాక, నపుంసకునిలా తయారవుతుంది—హాస్యాస్పదమైన రూపం పొందుతుంది. కాబట్టి ఈ విద్యార్థి యువకవులు ఈ విషయం ముందు గుర్తుంచుకోవలసినది. అప్పుడప్పుడే గొంతు విప్పుతున్న కోకిలకంఠంలో కమ్మదనం వీరి కంఠాలలో ఉంది

—కె. శివారెడ్డి.

పద్మినీ భాస్కరము

(రచయిత: శ్రీ మోటూరి వేంకటరావు; ప్రతులకు: రచయిత, వుడ్ పేట, అనకాపల్లి, విశాఖ జిల్లా; మూల్యము: సాదాప్రతి అయిదు రూపాయలు, మేలుప్రతి ఆరు రూపాయలు)

వివిధములైన ఎనుబదియొక్క ఛందస్సుల ముఖముగా మొత్తము నాలుగువందల పద్యముల కూర్పుచేసి ఈ కావ్యము చేయబడినది. ఈ కావ్య మింత విలక్షణమైనదగుటకీ ఛందోవైచిత్రియే కారణము. ఆంధ్రభాషకవు లిప్పటి కెవ్వరుగాని ఇన్ని ఛందముల నీ విధముగా వినియోగించి కావ్యరచన చేయలేదు. ఆ విధముగా నిదియొక క్రొత్త ప్రయోగము. ఈ ప్రయోగమునందు మరొక విచ్ఛిత్తి విశేషముకూడ కలదు. ఈ కావ్యమున దగ్గరదగ్గర ఎనుబది ఉపశీర్షికలు కలవు. ప్రతిశీర్షికయు అటు కథేతివృత్తముతోడను, ఇటు ఆ శీర్షిక క్రింది పద్యముల ఛందస్సుతోడను సంవదించునట్లుగా సమకూర్పబడినది. ఈ కూర్పు విషయమునందే కవి మహాకవి పదస్థుడగుచున్నాడు. ఇన్నివిశేషవృత్తముల నింత ధారాప్రవాహముగా వ్రాయుటయు సామాన్యమైన పనితనముకాదు. ఈ విధముగా పరమాశ్చర్యపడి చూడవలసినట్లుగా రచింపబడిన కావ్యమిది. ఆధునిక కృతులలో నిది విలక్షణమైనది.

పద్మినీ భాస్కరులకున్న, భార్యాభర్తృభావ మనాదిసిద్ధము. మరియు నదియొక కవి సమయము. ఈయొక్కభావమును ప్రధానముచేసి ఇంత పెద్ద కావ్యము నింతకష్టపడి వ్రాయుటను నిజముగా ప్రశంసింపవలయును. భూమ్యాకాశములను కలిపి ముడి వేసిన ఆ భావ మంతరంగమున పైకి కనిపించినంత సాధారణముగాలేదు. అందువల్లనే ఇంత కావ్యమునకు మూలభూతమైన వస్తువైనది.

పద్మినీ భాస్కరుల ప్రణయము ఉత్పలినీ విరహరము, మందేహ రాక్షస సంహారము, పద్మినీ విరహము, పద్మినీ భాస్కరుల పునస్సమాగమము— అను నీ యైదంచలవిూదుగా నా మూల భావము వికసమును పొందినది. దేవతాత్మకమైన ప్రకృతి మానవీకరింపబడి తత్తద్దశావిశేషముల యందభివర్ణింపబడినది ఆ విధముగా నిది వట్టి ప్రకృతి వర్ణనాత్మకమైన కావ్యము ప్రకృతి వర్ణనము కొలది పాటిగా కథావస్తువుతో సంబంధించియు సంబందింపకయు మన పూర్వకావ్యములయందు ప్రసిద్ధముగనే యున్నది. అచట ప్రకృతివర్ణనమే కావ్యముకాదు. కావ్యమునందొక వర్ణనాంశము. అంతమాత్రమే. అచటి అంశ మిచట సమస్తముగా ప్రదర్శింపబడినది.

ఈ కావ్యమును ముందుపెట్టి చదివినచో ఛందోగతి భావగతి విశేషాభివ్యక్తి కెట్లు దోహదము చేయునో గూడ తెలియును. రసభావ ప్రతీతి ఛందము నధీనములోనిదను దీని రహస్యముకూడ వివృతమగును. ఈ కావ్యకర్త శ్రీ మోటూరి వేంకటరావుగారు ఆధునికాంధ్ర కవులలో విలక్షణమైన కవితా దర్శనముకలవారు. ఇంతకు మునుపటి సింహబలి, చకోరసందేశము మొదలైన కావ్యములకువలెనే ఈ పద్మినీ భాస్కరమును సహృదయ హృదయాహ్లాదన మొనర్పగలదు ఆధునికాంధ్రకవిత్వాభిమానులవశ్యము పఠింపవలసిన కావ్యమిది. కవిని వాగ్దేవత మిక్కిలిగా కరుణించినది.

శ్రీ వృషాధిప శతకము

[కవి: పాలకురికి సోమనాథుడు, ప్రకాశకులు: శ్రీ నిర్మల శైవసాహితీ గ్రంథమాలిక, గాంధీనగరం. కాకినాడ–4. మూల్యము: ఒక రూపాయి.]

తెనుగుభాషయందిప్పటికి లభించిన శతకములలో నిదియే మొదటి శతకము. పాలకురికి సోమనాథుడు పరమశివాభినివేశముతో బ్రతికినవాడు. ఆయన గ్రంథములన్నియు శివపారమ్యము నుపలక్షించునవియే. ఈ వృషాధిపశతకము భక్తిశతకములలో నగ్రగణ్యము. పాలకురికి సోమనాథుడు దీనిని 'నోరికివచ్చినట్లు' వ్రాసినాడు. శివావేశమును పొందిన ఆయన చిత్తవృత్తుల తీవ్రసంచలన మీశతకము రచనారీతియందు ప్రతి పద్యమునను ప్రస్ఫుటముగా కనిపించును. ఆ విధముగా నిది మరియు గొప్పది. భక్తిభావాభివ్యక్తికి శబ్దాలంకారముల వినియోగము తెచ్చు దీప్తిని సోమనాథుడు తెస్సగా దర్శించినాడు. మొదటి యేబది

పద్యములను చూచిన ఆ విషయము తెలియును. సంస్కృత ద్రవిడ కర్ణాట మహారాష్ట్ర భాషల యందును, వాని మిశ్రమములయందును చిత్ర రచనా రీతులను సోమనాథుడవలంబించినాడు. ఏబదినుండి అరువదినాలుగువరకుగల పద్యములయందారీతివైచిత్రి ప్రదర్శనము కలదు. ఆ తరువాతి పద్యములయందు బసవలీలల వర్ణనము కలదు. మరియు కొందరు భక్తుల చరిత్రములును అందందు సూచింపబడినవి

ఈ శతకమును చదువుటకు సుఖముగానే యుండును. అర్థము చేసికొనుట కంత సులువుకాదు. మరియు నీ మధ్యకాలమున నిది ముద్రితమై మార్కెట్టున దొరుకుటలేదు. ఈ లోటు ఈ ప్రచురణమువల్ల తీరినది. దీనికి శివశ్రీ బండారు తమ్మయ్యగారును, నూతికట్టు కోటయ్యగారును ప్రతిపదార్థమును రచించియు, కథావివరణాదులను సమకూర్చియు, పాఠకులకు సౌకర్యమును కలిగించిరి. శివభక్తులును, ఆంధ్రసాహిత్య విద్యార్థులును మిక్కిలిగా ఆదరింపదగినట్లు ముద్రణము సిద్ధము చేయబడినది. శివచిత్తవృత్తిపరులైన తమ్మయ్యగారు సామాన్య పాఠకుల కవగతముకాని, కావలసిన బహ్వంశములను సరళసుందరముగా విశదీకరించిపెట్టినారు. ఆంధ్రశైవవాఙ్మయమును విశిష్టస్థానమాక్రమించిన ఈ తొలుదొల్లటి శతకమీవిధముగా ప్రకటింపబడుట ఎంతయు హర్షింపదగినది. ప్రకాశకుల కృషి ప్రశంసింపదగినది. ఇందువలన సాహిత్యాభిమానులకొక సదవకాశము సమకూరివచ్చినట్లు.

—క్షేమేంద్ర.

మ నో భి రా మ ం

ఆటవెలది శతకం. రచయిత: పి. వి. ఎస్. ప్రాతో. పుటలు-50 వెల 1-00. ప్రాప్తిస్థానం—శ్రీ పి వి. యస్. ప్రాతో, కవితానికేతనం, పాచిపెంట, శ్రీకాకుళంజిల్లా.

శ్రీ సీతా నిర్వేదము

పద్యకావ్యం. రచయిత శ్రీవారు నాగుపార్యక పుటలు-36. వెల—1-50 ప్రాప్తిస్థానం-శ్రీవారు నగుపార్య, సి. కె రాచపల్లె, వయా రైల్వే కోడూరు కడపజిల్లా.

బాల పౌరుల బాధ్యతలు

పుటలు -48. వెల 1-35. ప్రాప్తిస్థానం డైరెక్టరు, పబ్లికేషన్స్ డివిజన్, పాటియాలా హౌస్, న్యూఢిల్లీ 1.

ప్రత్యేక సంచికలు

చిత్తూరుజిల్లా రచయితల మహాసభలు—ప్రత్యేక సంచిక, సృజన సాహిత్య పత్రిక నవమ సంచిక, జనధర్మ 1 వ సంచిక మా కార్యాలయం చేరాయి

బాలలకు భారత దేశ చరిత్ర

రచయిత్రి శ్రీమతి శీలాధర్, పుటలు-266. వెల 3-50. ప్రాప్తిస్థానం—భారత ప్రభుత్వం పబ్లికేషన్ డివిజన్, రేడియో, సమాచారమంత్రిత్వ శాఖ, ఢిల్లీ-6.

ఆంధ్ర గద్య చంద్రిక

ఈ సంచిక 53 వ పేజీలో 'ఆంధ్ర గద్య చంద్రిక, సంకలనకర్తలు' అదిగాఉన్న వివరణను 'సంపాదకవర్గము -- కళాప్రపూర్ణ శ్రీ విశ్వనాథ సత్యనారాయణ, ఎం. ఎ, విద్వాన్ శ్రీ మల్లంపల్లి శరభయ్యశర్మ, శ్రీ వెలుకుపల్లి జమదగ్నిశర్మ ఎం. ఎ, శ్రీ టి. భాస్కరరావు బి. ఎ, (ఆనర్స్)' అని చదువుకొనవలెను

Printed and Published For Nageswara Rao Estates (Private) Ltd., by Radhakrishna at the Andhra Patrika Press, 6 & 7, Thambu chetty Street, Madras-1.
Editor: S. Sambhu Prasad.